31. 3. 2026

VELTHURU TELUGU DAILY

# వెలుతురు

మంగళవారం | రంగారెడ్డి , నల్లగొండ

సంపుటి :07 సంచిక : 295 , పేజీలు : 12 వెల:రూ.5/-

SRI SHANTHI PUBLICATIONS PUBLISHED FROM TELANGANA | ANDHRA PRADESH

తెలుగు దిన పత్రిక

www.velthuru.com

velthuru Newspaper

## క్యాన్సర్ స్క్రీనింగ్ మొబైల్ వాహనాలు

- జెండా ఊపి ప్రారంభించిన గవర్నర్

2



## ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థ

- నిత్యావసరాలు అక్రమ నిల్వ చేస్తే కఠిన చర్యలు
- సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ తగ్గింది
- వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం
- త్వరలోనే ప్రజలకు క్యాన్సర్ టెస్టుల నిర్వహణ
- 50 శాతం సీట్లు పెంపు వెనక పెద్ద కుట్ర
- దక్షిణభారతదేశానికి తీవ్ర అన్యాయం చేసే ఎత్తుగడ
- దీనికోసం బిజెపి లక్ష్మణ్ రాజీనామా చేయాలి
- కెసిఆర్ వల్లనే తనకు మంచి పేరు వస్తోంది



మీడియా చిట్‌చాట్‌లో సిఎం రేవంత్ రెడ్డి

**హైదరాబాద్,మార్చి30 వెలుతురు:** ఈగల్, హైడ్రా తరహాలో ఆహార కల్తీ నియంత్రణకు సరికొత్త వ్యవస్థను తీసుకొస్తామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. దేశంలో చట్టాలను అధ్యయనం చేసి పకడ్బందీ వ్యవస్థను రూపొందిస్తామన్నారు. మరోవైపు పంటకు ధర నిర్ణయించే అవకాశం రైతుకు లేకుండా పోయిందని, వారి అవసరాలను ఆసరాగా చేసుకొని దళారులు దోపిడీ చేస్తున్నారని సీఎం వ్యాఖ్యానించారు. రైతుల హక్కులను కాపాడేందుకు కనీస మద్దతు ధర చట్టం తీసుకొచ్చినట్లు గుర్తు చేశారు. సోమవారం ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. నిత్యావసరాలను అక్రమంగా నిల్వ ఉంచడం హత్యానేరం కంటే ఎక్కువే. ప్రజలకు దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాం. 86 శాతం ప్రజలు సన్నబియ్యం పొందుతున్నారు. అర్హులందరికీ రేషన్‌కార్డు ఇచ్చాం. రైతులకు లాభం చేకూర్చడమే కాదు.. పేదల ఆకలి తీరుస్తున్నాం. సన్నబియ్యం పంపిణీతో బ్లాక్ మార్కెట్ మాఫియా తగ్గింది. వాణిజ్య పంటలవైపు రైతులను ప్రోత్సహిస్తున్నాం అని అన్నారు.పంట మార్పిడి విషయంలో రైతులపై ఒత్తిడి తీసుకురామని.. వారికి అవగాహన కల్పిస్తామని తెలిపారు. పేదలకు ఇచ్చే సన్న బియ్యం కోసం రూ.14,560 కోట్లు ఖర్చు పెడుతున్నామని, దాంట్లో కోతలు పెట్టమని స్పష్టం చేశారు. సన్న బియ్యం పక్కదారి పట్టడం లేదని తెలిపారు. మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సన్న బియ్యంతో అసెంబ్లీలో అందరికీ మంచి భోజనం

2 లో..

## మార్పు కోసం ఓటు కాంగ్రెస్‌తోనే భవిష్యత్తు

- పదేళ్ళ ఎల్‌డిఎఫ్ పాలనకు ముగింపు పలకాలి
- కేరళంలో మార్పు కోసం యుడిఎఫ్‌ను గెలిపించాలి
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీతో పాటు బహిరంగ సభలో పాల్గొన్న మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



2

## సన్నబియ్యం పథకం క్రెడిట్ సీఎం రేవంత్ రెడ్డిదే

- అవే బియ్యంతో ప్రజాప్రతినిధులకు లంచ్: ఉత్తమ్

2



## జీవో 317ను వెంటనే రద్దు చేయాలి

- వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలి
- గతంలో పిసిసి చీఫ్‌గా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి
- సిఎం రేవంత్ రెడ్డికి కల్వకుంట్ల కవిత బహిరంగ లేఖ



**హైదరాబాద్,మార్చి30 వెలుతురు:** జీవో నం.317 బాధితులకు వన్‌టైం రిలీఫ్ కింద స్వస్థలాలకు ట్రాన్స్‌ఫర్ చేయాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కవిత బహిరంగ లేఖ రాశారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం 2021 డిసెంబర్ 6న జారీ చేసిన జీవో నం.317 వల్ల వేలాది మంది ఉద్యోగులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని లేఖలో పేర్కొన్నారు. జీవో 317ను వెంటనే రద్దు చేసి ఉద్యోగులకు సొంత జిల్లాల్లో పోస్టింగ్స్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు సీఎం రేవంత్ రెడ్డి కూడా ఈ అంశంపై అప్పటి సీఎం కేసీఆర్ లేఖ రాసిన విషయాన్ని కవిత గుర్తు చేశారు. 2023 అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ.. జీవో 317ను సమీక్షించి బాధితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చిందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో కూడా ఈ విషయాన్ని కాంగ్రెస్ స్పష్టంగా పొందుపరిచినట్లు కవిత పేర్కొన్నారు. ప్రస్తుత మంత్రివర్గంలో ఉన్న

2 లో..

## ఇరాన్ దిగిరాకపోతే స్మాష్ చేస్తాం

- త్వరగా ఒప్పందం కుదర్చుకుని దారికి రావాలి
- మరోమారు తీవ్ర హెచ్చరిక చేసిన ట్రంప్

2



## కోటి ఎకరాల భూ ఆక్రమణకు టెండర్

- ముఖ్యమంత్రి, మంత్రుల భూ దందాకు సామాన్యుల బలి
- వట్టినాగులపల్లిలో బాధితులకు కెటిఆర్ పరామర్శ
- అండగా ఉంటామని హామీ



**హైదరాబాద్,మార్చి30 వెలుతురు:** సీఎం రేవంత్ రెడ్డి పలుకుబడిని అడ్డుపెట్టుకుని అడ్డగోలుగా భూములు గుంజుకుంటున్నారని కేటీఆర్ విమర్శించారు. భూమి బౌండరీలను మార్చే ప్రయత్నం చేశారని ఆరోపించారు. మహేశ్వరం నియోజకవర్గంలో వేల ఎకరాలు కబ్జా చేస్తున్నారని తెలిపారు. అధికారులను అడ్డుపెట్టుకుని అరాచకపర్వం చేపడుతున్నారని మండిపడ్డారు. కోటి ఎకరాల భూమిని నిషేధిత జాబితాలో పెట్టారని

2 లో..

## హైదరాబాద్,చెన్నైని మించి అమరావతి అభివృద్ధి



- యువత రాజకీయాల్లోకి రావాలి... టీడీపి అవకాశం ఇస్తుంది
- పేదల సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యం
- సూళ్లూరుపేటలో టిడ్కో ఇళ్లను పంపిణీ
- రాష్ట్రవ్యాప్తంగా 2,50,893 మందికి సొంతిల్లు
- ఇండ్ల పండగ జరుగుతోందన్న సిఎం చంద్రబాబు
- గత వైసిపిది పనికిమాలిన ప్రభుత్వం అంటూ విమర్శలు

2



వెలుతురు

# 'తల్లిదండ్రుల పోషణ బిల్లు' చారిత్రాత్మక నిర్ణయం

- వృద్ధాప్యానికి చట్టబద్ధమైన భరోసా..
- ప్రజా ప్రభుత్వం నిబద్ధతకు ఈ బిల్లు నిదర్శనం
- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు
- కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్



హైదరాబాద్ వెలుతురు మార్చి 30:
సామాజిక బాధ్యతతో తెలంగాణ ప్రజా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రూపొందించిన 'తల్లిదండ్రుల పోషణ, జవాబుదారీతనం & పర్యవేక్షణ బిల్లు-2026'కు అసెంబ్లీ ఏకగ్రీవంగా ఆమోదం తెలపడం పట్ల కాంగ్రెస్ సీనియర్ నేత ఇందిరాశోభన్ హర్షం వ్యక్తం చేశారు. కన్నవారిని కంటికి రెప్పలా కాపాడుకోవాలనే ఉన్నత ఆశయంతో ఈ బిల్లును తెచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇది కేవలం చట్టం కాదు, ఒక సామాజిక సంస్కరణ అని ఆమె పేర్కొన్నారు. ఆధునిక కాలంలో మారుతున్న సామాజిక విలువల వల్ల ఉమ్మడి కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్నమవుతోందని ఇందిరాశోభన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో కష్టపడి పిల్లలను ప్రయోజకులుగా తీర్చిదిద్దిన తల్లిదండ్రులు, వృద్ధాప్యంలో అదే పిల్లల ఆదరణకు దూరమై అనాథాశ్రమాల్లో గడపడం, కనీస అవసరాలు తీరక ఇబ్బందులు పడటం అత్యంత బాధాకరమన్నారు. కన్నవారిని నిర్లక్ష్యం చేసే కొడుకులను సమాజం నుంచి బహిష్కరించాలన్న ముఖ్యమంత్రి మాటలు ప్రతీ ఒక్కరిని ఆలోచింపజేశాయన్నారు. ఈ బిల్లు వృద్ధ తల్లిదండ్రులకు ఆత్మగౌరవాన్ని, భద్రతను కల్పిస్తుందన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి వేతనం నుంచి 15 శాతం లేదా గరిష్టంగా రూ.పది వేలు కట్ చేసి నేరుగా తల్లిదండ్రుల ఖాతాల్లో వేయడం విప్లవాత్మక నిర్ణయమని ఇందిరాశోభన్ కొనియాడారు. ఈ చట్టం కేవలం ఉద్యోగులకే కాకుండా.. ప్రజాప్రతినిధులకు కూడా వర్తించేలా చేయడం ద్వారా ప్రజా ప్రభుత్వం తన నిబద్ధతను చాటుకుందన్నారు. అసెంబ్లీ సాక్షిగా ముఖ్యమంత్రి ప్రసంగిస్తూ శ్రవణ కుమారుడి మాతృ-పితృ భక్తిని గుర్తు చేయడం, రేమండ్ గ్రూప్ మాజీ చైర్మన్ విజయ్‌పథ్ సింఘానియా వంటి ప్రముఖుల విషాద గాథలను ఉదాహరణగా చెప్పడం సమాజంలోని ప్రతీ బిడ్డ కళ్లు తెరిపించేలా ఉన్నాయన్నారు ఇందిరాశోభన్. "భక్తి లేని చోట భయం ఉండాలి" అన్న సీఎం మాటలు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే వారికి గట్టి హెచ్చరిక అని ఆమె స్పష్టం చేశారు. చట్టాలు ఎన్ని ఉన్నా మనిషిలో మార్పు రావాలని, తల్లిదండ్రులను పూజించే సంస్కృతి మళ్లీ వెల్లివిరియాలని ఆమె కోరారు. ఈ చారిత్రాత్మక బిల్లును ఏకగ్రీవంగా ఆమోదించినందుకు అసెంబ్లీలోని అన్ని పార్టీల సభ్యులకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ 'పేరెంటల్ సపోర్ట్ యాక్ట్' దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని, వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రులకు ఇది ఒక 'భరోసా కవచం' అని ఇందిరాశోభన్ అభివర్ణించారు.

# ఆడకూతురు అంటే ఆటబొమ్మ కాదు, బీజేపీ మౌనం దేశానికి అవమానం!

*రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు*

*తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్*



హైదరాబాద్ వెలుతురు మార్చి 30:
"బేటీ బచావో" అంటూ దేశాన్ని మోసం చేసే నినాదాలు ఇచ్చే బీజేపీ, తన సొంత పార్టీలోనే మహిళల గౌరవాన్ని రక్షించడంలో పూర్తిగా విఫలమైందని తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు డా. రేఖ బోయలపల్లి ఘాటుగా విమర్శించారు. లైంగిక నేరాల ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రజాప్రతినిధులపై చర్యలు లేకపోవడం, గోవాలో మైనర్ల వేధింపుల ఆరోపణలపై నిశ్శబ్దం కొనసాగించడం . ఇవి యాదృచ్ఛికాలు కావని, ఇది అధికార దుర్వినియోగంతో నిందితులను కాపాడే ప్రమాదకర సంస్కృతి అని ఆమె ఆరోపించారు. ప్రధాని నరేంద్రమోదీ మరియు బీజేపీ నాయకత్వం ఈ అంశాలపై మౌనం వీడకపోతే, "బేటీ బచావో" నినాదం దేశాన్ని మోసం చేసే ఖాళీ మాటగా మిగిలిపోతుందని ఆమె అన్నారు. తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని వెంటనే సస్పెండ్ చేసి, అన్ని కేసులపై స్వతంత్ర దర్యాప్తు జరిపి, బాధితులకు తక్షణ రక్షణ, న్యాయం కల్పించకపోతే, అది కేవలం పరిపాలనా వైఫల్యం కాదు, అది మహిళల గౌరవంపై ప్రత్యక్ష దాడి అవుతుందని హెచ్చరించారు. బేటీ ఆటబొమ్మ కాదని, ఆమెను రాజకీయంగా వినియోగించే వస్తువుగా చూడడం సహించబోమని స్పష్టం చేస్తూ, దేశంలోని ప్రతి మహిళకు భద్రత, గౌరవం, న్యాయం హామీ ఇవ్వడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. నినాదాలు కాదు చర్యలు కావాలి, మౌనం కాదు సమాధానం కావాలి, ఆలస్యం కాదు న్యాయం కావాలని ఆమె డిమాండ్ చేశారు.

# "రూపాయి పతనం పాలన పతనం బీజేపీ ఆర్థిక వాదనలు బహిర్గతం"

- "రికార్డు కనిష్ఠానికి రూపాయి..
  'విశ్వగురు' కథనం కూలిపోతోంది"
- డా. రేఖ బోయలపల్లి ఉపాధ్యక్షురాలు,
  తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్



హైదరాబాద్ వెలుతురు మార్చి 30:
భారతీయ రూపాయి నిరంతరం రికార్డు కనిష్ఠ స్థాయిలకు పడిపోవడం సాధారణ ఆర్థిక మార్పు కాదు. ఇది నరేంద్ర మోదీ ప్రభుత్వ ఆర్థిక పాలనలో జరిగిన ఘోర వైఫల్యానికి స్పష్టమైన సంకేతం. భారతీయ రిజర్వ్ బ్యాంక్ పునరావృతంగా జోక్యం చేసుకున్నప్పటికీ, ప్రాథమిక ఆర్థిక పరిస్థితులు బలహీనంగానే ఉన్నాయి. పెరుగుతున్న ముడి చమురు దిగుమతి ఆధారపడటం, విదేశీ పెట్టుబడిదారుల నిరంతర నిష్క్రమణ, స్పష్టమైన విధాన దిశ లోపం రూపాయిని ప్రమాదకర స్థాయికి నెట్టాయి. బలమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించామని చెప్పుకున్న బీజేపీ ప్రభుత్వ వాదనలు ఇప్పుడు పూర్తిగా బహిర్గతమయ్యాయి. ఎంతో ప్రచారం చేసిన "విశ్వగురు" ఆర్థిక దృక్పథం వాస్తవ పరిస్థితులకు పూర్తిగా విరుద్ధంగా కనిపిస్తోంది. రూపాయి పతనం కేవలం సంఖ్యల ఆట కాదు ఇది ప్రతి కుటుంబాన్ని నేరుగా ప్రభావితం చేస్తోంది. ద్రవ్యోల్బణాన్ని పెంచుతూ, అవసరమైన వస్తువుల ధరలను పెంచుతూ, ఇప్పటికే ధరల భారంతో ఇబ్బంది పడుతున్న మహిళలు మరియు కుటుంబాలపై అదనపు భారం మోపుతోంది. ఇంకా ఆందోళన కలిగించే విషయం బాధ్యత లేకపోవడం, మార్గ సరిదిద్దే ప్రయత్నాల లోపం. నిర్మాణాత్మక ఆర్థిక సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, కథనాలు మరియు ప్రచారాల మీదే ఆధారపడుతోంది. భారతదేశానికి నినాదాలు కాదు ఆర్థిక స్థిరత్వాన్ని ప్రాధాన్యంగా తీసుకునే పాలన అవసరం. పెట్టుబడిదారుల విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, రూపాయిని స్థిరపరచడానికి, ప్రజల ప్రయోజనాలను కాపాడడానికి పారదర్శకమైన, బాధ్యతాయుతమైన నాయకత్వం అవసరం. రూపాయి పతనం, ద్రవ్యోల్బణ నియంత్రణ, ఆర్థిక పునరుద్ధరణపై కేంద్ర ప్రభుత్వం తక్షణ స్పష్టత ఇవ్వాలని భారత జాతీయ కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. ఆర్థిక బలం ప్రసంగాలతో కాదు బాధ్యతాయుతమైన పాలనతో, దృఢమైన చర్యలతోనే సాధ్యం.

# గ్లోబల్ మీడియా - సత్యానికి ప్రతిబింబమా లేక స్వార్థ ప్రయోజనాల కథనమా?



డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169

*ఈ డిజిటల్ యుగంలో, మనం నిద్రలేచినప్పటి నుండి రాత్రి పడుకోబోయే వరకు సమాచార ప్రవాహంలో మునిగి తేలుతున్నాం. స్మార్ట్‌ఫోన్ చేతిలోకి రాగానే వేలకొలది వార్తా కథనాలు, సోషల్ మీడియా పోస్టులు, ఇన్ఫ్లుయెన్సర్ల అభిప్రాయాలు మరియు అంతర్జాతీయ ప్రసారాలు మనల్ని చుట్టుముడుతున్నాయి. ప్రపంచవ్యాప్తంగా వందలాది మీడియా సంస్థలు 24/7 మనకు సమాచారం అందిస్తున్నాయి. అయితే, ఈ సమాచార సముద్రంలో మునిగిపోతున్న మనకు అసలు ప్రశ్న ఒకటి ఎదురవుతోంది. మనం వింటున్నది, చదువుతున్నది ఎంతవరకు నిజం? గ్లోబల్ మీడియా మనకు వాస్తవాలను యథాతథంగా అందిస్తోందా లేక తెర వెనుక తమ స్వంత కథనాలను రచిస్తోందా?*

నేటి సంక్లిష్ట ప్రపంచంలో ఈ ప్రశ్న గురించి చర్చించడం అత్యంత ఆవశ్యకం. సైద్ధాంతికంగా చూస్తే, జర్నలిజం అనేది ఒక పవిత్రమైన వృత్తి. దీని ప్రాథమిక లక్ష్యం నిష్పాక్షికంగా సత్యాన్ని వెలుగులోకి తీసుకురావడం. ప్రజాస్వామ్య వ్యవస్థలో కార్యనిర్వాహక, శాసన మరియు న్యాయ వ్యవస్థల తర్వాత మీడియాను నాలుగో స్తంభం (Fourth Estate) గా పరిగణిస్తారు. ప్రభుత్వాలను జవాబుదారీగా ఉంచడం, అధికారంలో ఉన్నవారి తప్పులను ఎండగట్టడం, అవినీతిని బయటపెట్టడం మరియు సామాన్య ప్రజల గొంతుకగా మారడం మీడియా బాధ్యత. అయితే, ప్రస్తుత ప్రపంచ పరిస్థితులను పరిశీలిస్తే, ఈ ఆదర్శాలకు మరియు వాస్తవికతకు మధ్య ఒక అగాధమైన అంతరం కనిపిస్తోంది. CNN, BBC, Al Jazeera, FoI News వంటి ప్రపంచ ప్రసిద్ధ సంస్థలు టెక్నాలజీ పరంగా ఎంతో ఎదిగినప్పటికీ, విశ్వసనీయత విషయంలో మాత్రం వెనుకబడుతున్నాయి. అమెరికాలో నిర్వహించిన ఒక సర్వే ప్రకారం, కేవలం 36% మంది మాత్రమే మీడియాను నమ్ముతున్నారట. అంటే మెజారిటీ ప్రజలు వార్తలను అనుమానంతోనే చూస్తున్నారు. ఇది కేవలం ఒక దేశానికో, ప్రాంతానికో పరిమితం కాలేదు; ప్రపంచవ్యాప్తంగా ఇదే ధోరణి కనిపిస్తోంది. గ్లోబల్ మీడియా ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు 'పక్షపాతం' (Bias). నేడు దాదాపు ప్రతి మీడియా సంస్థ ఒక రాజకీయ, ఆర్థిక లేదా సాంస్కృతిక ఎజెండాను కలిగి ఉంటోంది. నిష్పాక్షిక వార్తల కంటే అభిప్రాయ ఆధారిత వార్తలు (Opinion`based news) ఎక్కువయ్యాయి. ఉదాహరణకు, మధ్య ప్రాచ్య దేశాల్లో (Middle East) జరిగే సంఘర్షణలను పశ్చిమ దేశాల మీడియా ఒక రకంగా చూపిస్తే, అరబ్ దేశాల మీడియా మరో కోణంలో చూపిస్తుంది. ఇక్కడ వాస్తవం ఒక్కటే కావచ్చు, కానీ దానిని ప్రదర్శించే శైలిలో భూమికి ఆకాశానికి ఉన్నంత తేడా ఉంటోంది. అమెరికా రాజకీయాలను గమనిస్తే, FoI News సంప్రదాయవాద రిపబ్లికన్ల వాణిని వినిపిస్తే, మీచీదీజ మరియు జచీచీ ప్రగతిశీల డెమోక్రాట్ల వైపు మొగ్గు చూపుతాయి. రష్యాకు చెందిన RT (Russia Today) లేదా చైనాకు చెందిన CGTN వంటి సంస్థలు తమ ప్రభుత్వాల ప్రచార సాధనాలుగా పనిచేస్తున్నాయనే విమర్శలు ఉన్నాయి. ఈ పక్షపాతం వల్ల సామాన్య ప్రజలు ఏది నిజమో తెలుసుకోలేక




అయోమయానికి గురవుతున్నారు. మరో ఆందోళనకరమైన అంశం మీడియా రంగం కేవలం కొద్దిమంది బిలియనీర్లు మరియు కార్పొరేట్ దిగ్గజాల చేతుల్లోకి వెళ్లడం. రూపెర్ట్ మర్డోక్ (News Corp), డిస్నీ, కామ్కాస్ట్ వంటి కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా వందలాది ఛానళ్లను, పత్రికలను నియంత్రిస్తున్నాయి. ఒక వ్యాపారవేత్త లేదా కార్పొరేషన్ ఒక మీడియా సంస్థను నడుపుతున్నప్పుడు, వారి వాణిజ్య ప్రయోజనాలకు వ్యతిరేకంగా వార్తలు వచ్చే అవకాశం ఉంటుందా? ఖచ్చితంగా ఉండదు. నేడు వార్తలు అంటే సమాచారం కాదు, అది ఒక ఉత్పత్తి (Product). TRP రేటింగ్స్, ఆన్‌లైన్ క్లిక్స్, అడ్వర్టైజింగ్ రెవెన్యూ వంటి అంశాలే ఏ వార్తకు ఎంత ప్రాధాన్యత ఇవ్వాలో నిర్ణయిస్తున్నాయి. దీనివల్ల సెన్సేషనలిజం (సంచలనం) పెరిగిపోయింది. నిజమైన ప్రజా సమస్యల కంటే, సెలబ్రిటీల వ్యక్తిగత విషయాలు లేదా వివాదాస్పద అంశాలకే ఎక్కువ సమయం కేటాయిస్తున్నారు. క్లిక్‌బైట్ హెడ్‌లైన్స్‌తో పాఠకులను ఆకర్షించడం ద్వారా నాణ్యమైన జర్నలిజం ప్రాణాలు కోల్పోతోంది. 2016 తర్వాత ప్రపంచమంతటా వినిపిస్తున్న మాట ఫేక్ న్యూస్ . ఇది కేవలం అబద్ధం మాత్రమే కాదు, ఒక పథకం ప్రకారం ప్రచారం చేయబడే తప్పుడు సమాచారం. సోషల్ మీడియా రాకతో వార్తా సేకరణ మరియు పంపిణీ ప్రజాస్వామ్యీకరించబడిన మాట వాస్తవమే కానీ, అది ఒక ద్విముఖ ఖడ్గంలా మారింది. వాట్సాప్ యూనివర్సిటీలు, ఫేస్‌బుక్ గ్రూపులలో వచ్చే సమాచారం నిజమో కాదో నిర్ధారించుకోకుండానే వైరల్ అయిపోతోంది. COVID-19 మహమ్మారి సమయంలో ఈ సమస్య తీవ్రతను మనం కళ్లారా చూశాం. వైరస్ పుట్టుక నుండి టీకాల పనితీరు వరకు వందలాది పరస్పర విరుద్ధమైన వార్తలు వచ్చాయి. కొన్ని మీడియా సంస్థలు ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తే, మరికొన్ని అత్యంత ప్రమాదకరమైన వైరస్‌ను సామాన్య జలుబుగా చిత్రీకరించాయి. ఈ గందరగోళం వల్ల ప్రాణనష్టం కూడా సంభవించింది. ఇది మీడియా బాధ్యతారాహిత్యానికి పరాకాష్ట. గ్లోబల్ మీడియాలో మరో లోపం భౌగోళిక వివక్ష. ఐరోపాలో లేదా అమెరికాలో ఒక చిన్న సంఘటన జరిగినా గంటల తరబడి లైవ్ కవరేజీ ఇచ్చే మీడియా, ఆఫ్రికా లేదా ఆసియా దేశాల్లో వేలాదిమంది చనిపోతున్నా పట్టించుకోదు. ఉదాహరణకు, పారిస్‌లో జరిగే ఉగ్రదాడికి వచ్చే ప్రచారం, నైజీరియాలో లేదా యెమెన్‌లో జరిగే దాడులకు రాదు. ఇది మానవ జీవన విలువను ప్రాంతాన్ని బట్టి మీడియా కొలుస్తోందా అనే అనుమానాన్ని కలిగిస్తోంది. యుద్ధాల విషయంలో కూడా భాషా ప్రయోగం చాలా కీలకంగా మారింది. ఒక పక్షాన్ని స్వాతంత్ర్య సమరయోధులు అని పిలిచిన మీడియా, మరో పక్షాన్ని ఉగ్రవాదులు అని ముద్ర వేస్తుంది. ఇదంతా ప్రేక్షకుల మనస్తత్వాలను ప్రభావితం చేయడానికి చేసే ఒక సున్నితమైన ప్రాపగండా .

Twitter (X), Facebook, TikTok వంటి వేదికలు మనకు ప్రత్యక్షంగా వార్తలను అందిస్తున్నాయి. ఇప్పుడు ప్రతి పౌరుడూ ఒక రిపోర్టరే. అయితే, సోషల్ మీడియా అల్గారిథమ్‌లు మనం దేనిని ఇష్టపడతామో దానినే మనకు చూపిస్తాయి. దీనివల్ల ఎకో ఛాంబర్స్ (Echo Chambers) ఏర్పడుతున్నాయి. అంటే మన అభిప్రాయాలను సమర్థించే వార్తలే మనకు కనిపిస్తాయి తప్ప, భిన్నమైన వాస్తవాలు మన దాకా చేరవు. ఇది సమాజంలో అసహనాన్ని, విద్వేషాన్ని పెంచుతోంది. ఈ విపత్కర పరిస్థితుల్లో మీడియాను తిట్టడం వల్ల ప్రయోజనం లేదు. ఒక వినియోగదారుడిగా మనం మారాలి. ఏదైనా వార్తను చూడగానే నమ్మేయకుండా, అది ఎక్కడి నుండి వచ్చింది? దాని వెనుక ఉన్న మూలాలు ఏమిటి? అని ప్రశ్నించడం నేర్చుకోవాలి. ఒకే విషయాన్ని రెండు మూడు వేర్వేరు ప్లాట్‌ఫారమ్‌లలో (విభిన్న సిద్ధాంతాలు గల సంస్థల్లో) చదవడం వల్ల కొంతవరకు నిజాన్ని గ్రహించవచ్చు. అనుమానాస్పద వార్తలను ధృవీకరించుకోవడానికి ఆల్ట్ న్యూస్ లేదా ఇతర అంతర్జాతీయ ఫ్యాక్ట్-చెక్ వెబ్‌సైట్లను ఉపయోగించాలి. కార్పొరేట్ ఒత్తిడి లేని లాభాపేక్ష లేని (Non-profit) మీడియా సంస్థలకు మద్దతు ఇవ్వాలి. నాణ్యమైన జర్నలిజం కావాలంటే దానికి మూల్యం చెల్లించడానికైనా సిద్ధపడాలి. మీడియా సంస్థలు కూడా తమ కోల్పోయిన విశ్వసనీయతను తిరిగి పొందేందుకు పారదర్శకతను పాటించాలి. వార్తల్లో తప్పులు దొర్లితే వెంటనే బహిరంగంగా క్షమాపణలు చెప్పే సంస్కృతిని అలవరచుకోవాలి. గ్లోబల్ మీడియా నిజం చెబుతోందా లేక కథ రాస్తోందా? అనే ప్రశ్నకు సమాధానం రెండు అని చెప్పక తప్పదు. నేటి సమాచార ప్రపంచంలో పాలు, నీళ్లు కలిసిపోయి ఉన్నాయి. వాటిని వేరు చేసి నిజాన్ని గ్రహించాల్సిన బాధ్యత హంసలాగా పాఠకులపైనే ఉంది. మీడియా సంస్థలు కేవలం లాభాల వేటలో పడితే, ప్రజాస్వామ్య వ్యవస్థ కుప్పకూలిపోయే ప్రమాదం ఉంది. నిజమైన జర్నలిజం అనేది అధికారంలో ఉన్నవారిని ప్రశ్నించాలి తప్ప, వారికి భజన చేయకూడదు. అలాగే, అది సామాన్య ప్రజల జీవితాల్లో వెలుగు నింపాలి తప్ప, వారిలో భయాన్ని, ద్వేషాన్ని నింపకూడదు. మనం నిష్క్రియ వినియోగదారులుగా కాకుండా, చైతన్యవంతమైన పౌరులుగా ఉంటేనే సత్యం బ్రతికి బట్టకడుతుంది. సత్యం ఎప్పుడూ కఠినంగా ఉండవచ్చు, కానీ అది మాత్రమే సమాజాన్ని సరైన దిశలో నడిపిస్తుంది.

# సిటీ జీవితంలో బయట ఆహారం అవసరమా? అలవాటా?

*"ఆరోగ్యమే మహాభాగ్యం", "అతి అన్నది అమృతాన్నికూడా విషంగా మార్చుతుంది" అనే సామెతలు మనకు ఆరోగ్య పరిరక్షణ ఎంత ముఖ్యమో తెలియజేస్తాయి. నేటి ఆధునిక సిటీ జీవితంలో బయట ఆహారం (Outside Food) చాలా సాధారణంగా మారిపోయింది. ఒకప్పుడు ప్రత్యేక సందర్భాల్లో మాత్రమే హోటల్‌కి వెళ్లి తినేవారు. కానీ ఇప్పుడు బయట ఆహారం మన రోజువారీ జీవితంలో ఒక భాగంగా మారింది. ఉదయం టీతో మొదలు పెట్టి రాత్రి భోజనం వరకు బయటే తినేవారు చాలామంది ఉన్నారు.*

ప్రస్తుతం నగరాల్లో జీవనశైలి పూర్తిగా మారిపోయింది. చాలా మంది ఉద్యోగాలు, వ్యాపారాలు మరియు ఇతర పనులతో బిజీగా ఉంటున్నారు. ఉదయం త్వరగా పని కోసం బయలుదేరి, సాయంత్రం ఆలస్యంగా ఇంటికి చేరుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లో ఇంట్లో వంట చేయడానికి సమయం మరియు శక్తి చాలాసార్లు ఉండదు. అందువల్ల చాలా మంది బయట ఆహారం మీద ఆధారపడుతున్నారు.
ముఖ్యంగా మొబైల్ టెక్నాలజీ అభివృద్ధి వల్ల బయట ఆహారం మరింత సులభంగా అందుబాటులోకి వచ్చింది. కొన్ని నిమిషాల్లోనే మొబైల్‌లో ఆర్డర్ చేస్తే ఆహారం ఇంటికే చేరుతుంది. ఈ సౌకర్యాన్ని అందిస్తున్న Swiggy మరియు Zomato వంటి యాప్‌లు ఇప్పుడు మన జీవితంలో ఒక ముఖ్యమైన భాగంగా మారాయి. వీటి ద్వారా హోటల్‌కి వెళ్లకుండా ఇంట్లోనే వివిధ రకాల ఆహారాన్ని సులభంగా పొందవచ్చు.
ఇంకా ఒక ముఖ్యమైన కారణం రుచుల వైవిధ్యం (Variety). బయట హోటల్స్, రెస్టారెంట్లు మరియు చిన్న చిన్న బండ్లలో అనేక రకాల వంటకాలు లభిస్తాయి. పిజ్జా, బర్గర్, నూడుల్స్, బిర్యానీ వంటి కొత్త రుచులు పిల్లలు మరియు యువతను ఎక్కువగా ఆకర్షిస్తున్నాయి. ఇంట్లో సాధారణంగా ఒకే రకం ఆహారం ఉంటే, బయట మాత్రం ఎన్నో రకాల ఎంపికలు ఉంటాయి. అందువల్ల బయట ఆహారం తినడం ఒక అలవాటుగా మారుతోంది.
మరొక ముఖ్యమైన అంశం ఆర్థిక అవకాశాలు (Economic Opportunities). చిన్న food stall లేదా tiffin center ప్రారంభించడానికి పెద్ద పెట్టుబడి అవసరం ఉండదు. కాబట్టి చాలా మంది




యువకులు మరియు కుటుంబాలు ఈ రంగాన్ని ఒక ఉపాధి మార్గంగా ఎంచుకుంటున్నారు. నగరాల్లో జనాభా పెరగడం, ఉద్యోగాల కోసం ఇతర ప్రాంతాల నుంచి ప్రజలు రావడం వల్ల food business కి ఎవమ్ఖిఅఎ కూడా పెరిగింది. అందుకే రోజు రోజుకీ హోటల్స్, రెస్టారెంట్లు మరియు చిన్న చిన్న బండ్లు సంఖ్య పెరుగుతోంది. ఎంతోమందికి ఫుడ్ బిజినెస్ జీవనాధారం అయింది.
అయితే బయట ఆహారం పూర్తిగా తప్పు కాదు. కొన్నిసార్లు ప్రయాణంలో ఉండటం, అనారోగ్యం, లేదా ప్రత్యేక సందర్భాల్లో బయట తినడం అవసరం అవుతుంది. కానీ తరచుగా బయట ఆహారం తినడం వల్ల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాలు ఉండవచ్చు. ఎక్కువ నూనె, ఉప్పు మరియు మసాలాలు ఉన్న ఆహారం వల్ల ఊబకాయం, జీర్ణ సమస్యలు, షుగర్ మరియు రక్తపోటు వంటి సమస్యలు వచ్చే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పిల్లలు ఎక్కువగా యిబఅని food తినడం వల్ల వారి ఆరోగ్యంపై దీర్ఘకాలిక ప్రభావం పడుతుంది.
అదనంగా, హైజీన్ సరిగ్గా పాటించకపోవడం, కల్తీ పదార్థాలు వాడటం వల్ల food poisoning వంటి సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది. అలాగే మన gut health కూడా దెబ్బతినే అవకాశం ఉంటుంది.
ఇంకా ఒక ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఇంట్లో పనులను కుటుంబ సభ్యులు కలిసి పంచుకుని చేసుకుంటే శ్రమ తగ్గుతుంది. అలా చేస్తే వంట చేయడం కూడా సులభంగా మారుతుంది. అందరూ కలిసి కూర్చొని భోజనం చేయడం వల్ల కుటుంబ సభ్యుల మధ్య ప్రేమ, అనుబంధం మరియు ఆనందం పెరుగుతాయి. అందువల్ల ఎంత బిజీ అయినా కొంత సమయం కేటాయించి ఇంటి ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం చాలా అవసరం.
అందువల్ల బయట ఆహారాన్ని పూర్తిగా మానేయాల్సిన అవసరం లేదు. కానీ అది పరిమితంగా ఉండాలి. వారానికి ఒకటి లేదా రెండు సార్లు మాత్రమే బయట ఆహారం తీసుకోవడం మంచిది. అలాగే ఆరోగ్యకరమైన ఆహారాన్ని ఎంచుకోవడం కూడా చాలా ముఖ్యమైన విషయం.
చివరగా చెప్పాలంటే, సిటీ జీవితంలో బయట ఆహారం ఒక అవసరంగా మారినప్పటికీ, మన ఆరోగ్యాన్ని కాపాడుకోవడం మన చేతుల్లోనే ఉంది. సమయాన్ని సరిగ్గా నిర్వహిస్తూ, ఇంటి ఆహారానికి ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా ఆరోగ్యకరమైన మరియు సంతోషకరమైన జీవితం గడపవచ్చు.



**జి. రజని రెడ్డి**
నవల రచయిత

# ఎడిటోరియల్

# సంపాదకీయం.. ముంచుకొస్తున్న మంచినీటి సమస్య !

ఎండలు ముదురుతున్నాయి. ఇప్పుడే 40 డిగ్రీలకు చేరువలో ఉన్నాం. రానున్న రెండు నెలలు దారుణంగా ఉండే పరిస్థితులు కానవస్తున్నాయి. వాతావరణశాఖ కూడా ఇదే హెచ్చరిక చేస్తోంది. పశ్చిమాసియా యుద్ధం వల్ల వాతావరణంలో వేడి పెరిగిందని కూడా ఆందోళన వస్తోంది. అయితే ఇది ఎంతవరకు నిజమన్నది పక్కన పెడితే ఎండలు మాత్రం ముదురుతున్నాయి. ఇప్పటికే వేసవి మొదలు కావడంతో దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తాగునీటి కొరత తీవ్రమైంది. 2030 నాటికి దేశంలోని 21 ప్రధాన నగరాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటే ప్రమాదం వుందని గణాంకాలు చెబుతున్నాయి. పర్యావరణ విధ్వంసం కూడా దీనికి ప్రధాన కారణం. మనం భూగర్భ జలాలను, నీటి వనరులను కోల్పోవడమే కాదు, ఉన్న నీటిని కూడా విషపూరితం చేస్తున్నామని అనేక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. స్వచ్ఛమైన నీరు అందించడం ప్రభుత్వాల బాధ్యత. ప్రజల ప్రాథమిక హక్కులను కూడా కాపాడలేని పరిస్థితిలో ప్రభుత్వాలున్నాయి. దేశంలో ఏటా 3.77 కోట్ల మంది కలుషిత నీటి వల్ల వ్యాధుల బారిన పడుతున్నారు. డయేరియా వంటి వ్యాధులతో ప్రాణాలు కోల్పోతున్నారు. లక్ష్యాలు గొప్ప వుంటే సరిపోదు, వాటి అమలు కూడా అంతే గొప్పగా వుండాలి. కాగితాలపై కనిపించే ప్రణాళికలు ఆచరణలో అమలుకు నోచుకోవాలి. పారదర్శకత లేని వ్యవస్థలో



ప్రజాప్రయోజనం కనిపించదని తెలుసుకోవాలి. ఈ క్రమంలో ప్రజలు జాగరూకులై ఉండాల్సిందే. ఏటా ఎండాకలం అనగానే మంచినీటి సమస్య, సాగునీట సమస్యలు వస్తున్నాయి. ఏళ్లు గడుస్తున్నా పక్కా ప్రణాళికలు లేకపోవడం వల్ల ఈ సమస్యలు వస్తున్నారు. దేశవ్యాప్తంగానూ, తెలుగు రాష్ట్రాల్లోనూ సాగు,తాగునీటి సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి. చివరి భూములకు నీరు అందక అప్పుడే రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి కోసం అనేక జిల్లాల్లో సమస్యలు ఉన్నాయి. ఈ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే చర్యలు చేపట్టడం లేదు. జనాభా పెరుగుదల కారణంగా నీటి సరఫరా సమస్యలు వస్తున్నాయి. నీటి వనరులు లేని ప్రాంతాల్లో తీవ్రమైన నీటి ఒత్తిడిని ఎదుర్కొంటున్నారు. ఇది సామాజిక, ఆర్థిక అభివృద్ధిని ప్రభావితం చేస్తున్నది. భవిష్యత్తరాలకు సురక్షిత నీటిని అందించాలన్న లక్ష్యం నీరుగారి పోతోంది. నీటిని సంరక్షించుకోకపోతే, భవిష్యత్ అంధకారమౌతుందని, జీవకోటి మనుగడ ప్రశ్నార్థకమవు తుందని గుర్తించడం లేదు. భూమిలో బోర్లు వేసి నీటిని తోడుతున్నా, నీటిని రీఛార్జ్ చేయలేక పోతున్నాం. మానవాళి మనుగడకు నీరే ప్రాణాధారం. అని గుర్తించి అందుకు అనుగుణంగా గట్టి చర్యలు తీసుకోవడం లేదు. నీరు లేకుండా జీవం లేదు. నీటి లభ్యత వున్న నదీ పరివాహక ప్రాంతాలు, తీరప్రాంతాల్లోనే ప్రాచీన నాగరికతలు, ఆధునిక సమాజాలు అభివృద్ధి చెందాయి. భవిష్యత్‌లో ఎదురయ్యే నీటి సంక్షోభాలను అధిగమించేందుకు, ప్రజల్లో అవగాహన కల్పించే ప్రయత్నాలు జరగడం లేదు. నేటికీ ప్రపంచ వ్యాప్తంగా 200 కోట్ల మందికి పైగా ప్రజలకు రక్షిత తాగునీరు అందుబాటులో లేదు. నీటి సమస్య ముందుగా బాధించేది మహిళలనే. ఇప్పటికీ ట్రైబల్ ఏరియాలో నీటికోసం నానా అవస్థలు పడుతున్నారు. ప్రతిరోజూ 20కోట్ల మంది భారతీయులు సుదూరాలకు నడిచివెళ్లి నీటిని తెచ్చుకుంటున్నట్లు నివేదికలు చెబుతున్నాయి. వీరిలో అత్యధికులు మహిళలు, బాలికలే. ఐదేళ్లలో గ్రామీణ ప్రాంతాల్లోని ప్రతి ఇంటికీ కొళాయి ద్వారా రక్షిత మంచినీరు అందిస్తామని 2019లో ఆర్భాటంగా 'జల్ జీవన్ మిషన్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. ఈ పథకం 2024 నాటికి పూర్తికావాల్సి వుండగా, చాలా రాష్ట్రాల్లో అసలు అమలుకే నోచుకోలేదు. దీంతో ఈ పథకం కాలపరిమితిని 2028 వరకూ పొడిగించడంతో పాటు, కేటాయిం పులను కూడా రూ.8.69 లక్షల కోట్లకు పెంచుతూ ఇటీవల ప్రధాని మోడీ అధ్యక్షతన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. తెలంగాణలో మిషన్ భగీరథ ప ఏరుతో భారీ కుంభ కోణం చేసిన గత బిఆర్ఎస్ పాలకులు దానిని కప్పిపుచ్చుకునేందుకు నానా గడ్డీ కరుస్తున్నారు. చెరువుల పునరుద్ధరణ, మిషన్ భగీరథ పేరుతో వేలకోట్లు దండుకున్నారు. మనకు జీవనదులు, సహజ నీటి చెరువులు పుష్కలంగా ఉన్నా వాటి నీటిని పూర్తిస్థాయిలో వాడుకునేలా ప్రయత్నాలు జరగడం లేదు. జరిగే ప్రయత్నాల వెనక భారీ కుంభకోణాలు దాగి వుంటున్నాయి. జల్ జీవన్ మిషన్ సహా ప్రభుత్వ నీటి పథకాలన్నిటినీ చిత్తశుద్ధితో అమలు చేస్తే, బొట్టు బొట్టు భద్రం చేస్తే.. ప్రజలు నీటి గండం నుంచి గట్టెక్కుతారు. నదీ జలాలను సక్రమంగా పొలాలు, ఇళ్లకు మళ్లించేలా ప్రణాకలు చేపట్టలి. రాష్ట్రాల మధ్య జలజగడాలను ఆపి, నీటి సద్వినియోగం చేసుకోవాలి. ఏటా లక్షల క్యూసెక్కులు సముద్రం లో కలిసి పోకుండా ప్రణాళికులు చేపట్టాలి. అప్పుడే సాగు, తాగునీటి సమస్యలకు చెక్ పడుఉతంది.

## ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకుంటాం

### - అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సంచలన ప్రకటన





**వాషింగ్టన్,మార్చి30( వెలుతురు):**

ఇరాన్‌కు అత్యంత కీలకమైన, ఆర్థిక జీవనాడి అయిన ఖర్గ్ ద్వీపాన్ని అమెరికా స్వాధీనం చేసుకునే అవకాశం ఉందని అగ్రరాజ్య అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్నారు. ఒక్కసారి తీవ్ర దాడులు మొదలుపెడితే, ఖర్గ్ ద్వీపాన్ని చాలా తేలికగా స్వాధీనం చేసుకుంటామని అన్నారు. 'ఖర్గ్ ద్వీపాన్ని స్వాధీనం చేసుకోవడం అమెరికాకు పెద్ద విషయం కాదు. మా ఎదుట చాలా ఆప్షన్లు ఉన్నాయి. ఆ ద్వీపాన్ని మేం స్వాధీనం చేసుకోవచ్చు.. చేసుకోకపోవచ్చు. కొన్నాళ్లు మా ఆధీనంలో ఉంచుకోవచ్చు. ఇరాన్ వద్ద ఆత్మరక్షణ కోసం ఇంకేమీ మిగలలేదని అనుకోవడం లేదు. కానీ, ఒక్కసారి మేం దాడి మొదలుపెడితే.. ఖర్గ్ ద్వీపాన్ని చాలా సులభంగా స్వాధీనం చేసుకుంటాం. ఇరాన్‌పై భూతల దాడులు చిట్టచివరి ఆప్షన్ మాత్రమే' అని ట్రంప్ పేర్కొన్నారు అంతేకాదు.. ఇరాన్ హర్మూజ్‌లో టోలు వసూలుచేస్తున్నట్లు వచ్చిన వార్తల పైనా ట్రంప్ స్పందించారు. అదే నిజమైతే అమెరికా దానిని రెండు నిమిషాల్లో మూసేయిస్తాయని భరోసా ఇచ్చారు. సౌదీ, ఖతార్, యూఏఈ, బహ్రెయిన్ దేశాలు ఇరాన్‌పై తిరగబడుతున్నాయన్నారు. ఇక అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ ట్రిపోలి దాదాపు 3,500 మంది మెరైన్లతో పశ్చిమాసియాకు చేరుకొంది. ఇది ఈనెల 27న తమ సెంట్రల్ కమాండ్ పరిధిలోకి వచ్చినట్లు అధికారులు ధ్రువీకరించారు. యూఎస్ఎస్ ట్రిపోలిపై ఎఫ్-31లు సహా పలు యుద్ధ విమానాలను మోహరించవచ్చు. యూఎస్ఎస్ బాక్సర్‌తోపాటు శాన్‌డిగో నుంచి వచ్చిన ఇతర నౌకాదళ యూనిట్లు, అదనపు బలగాలూ పశ్చిమాసియాకు చేరుకున్నాయి.

## బీహార్ శాసనమండలికి నితీశ్ కుమార్ రాజీనామా

### - బిజెపి అధ్యక్షుడు నితిన్ నబీ కూడా రాజీనామా



**పాట్నా,మార్చి30( వెలుతురు):**

బీహార్ ముఖ్యమంత్రి నితీష్‌కుమార్ శాసనమండలికి సోమవారం రాజీనామా చేశారు. మార్చి 16వ తేదీన ఆయన రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ ఎన్నిక అనంతరం రాజ్యంగ నిబంధనలకు అనుగుణంగా నితీష్ కుమార్ శాసనమండలికి రాజీనామా చేశారు. రాజ్యసభకు ఎన్నికైన 14 రోజుల్లో నితీష్ శాసనసభ సభ్యత్వాన్ని వదులుకున్నారు. అలాగే బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ కూడా బీహార్ శాసనమండలికి రాజీనామా చేశారు. ఆయన కూడా మార్చి 16న రాజ్యసభకు ఎన్నికయ్యారు. ఈ నేపథ్యంలో ఆయన కూడా శాసనమండలికి రాజీనామా చేశారు. కాగా, 2005లో ఎన్‌డిఎ కూటమి తరపున నితీష్‌కుమార్ ముఖ్యమంత్రి పదవిని చేపట్టారు. ఇక బిజెపికి మద్దతుగా, ఆ తర్వాత ఆ పార్టీని వ్యతిరేకిస్తూ మహాగట్బంధన్ వైపు మద్దుతుగా నిలిచి తన సిఎం పదవిని కాపాడుకున్నారు. 2013, 2017, 2022, 2024లో పార్టీలు మారుతూ సిఎంగా కొనసాగారు. 2025లో అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి రికార్డు స్థాయిలో విజయం సాధించి పదవ సారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు.

## బంగారం ధరల్లో ఒడిదుడుకులు

### - స్వల్పంగా తగ్గిన పసిడి రేట్లు

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**

పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల కారణంగా బంగారం ధరలు రోజు రోజుకూ తగ్గుతున్నాయి. డాలర్ రేటు పెరగటం బంగారం ధరలు పతనమవ్వడానికి మరో కారణంగా మార్కెట్ నిపుణులు చెబుతున్నారు. గతేడాది పెట్టుబడిదారులకు అద్భుతమైన రిటర్న్స్ ఇచ్చిన బంగారం.. ఇప్పుడు కంటతడి పెట్టిస్తోంది. యుద్ధం మొదలవ్వడానికి ముందు 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర 1.90 లక్షల రూపాయల వరకు వెళ్లింది. యుద్ధం మొదలవ్వగానే బంగారం ధరలు ధమాల్ అని పడిపోయాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ ప్రకారం హైదరాబాద్ మార్కెట్‌లో 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,48,090 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,750 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,11,070 దగ్గర ట్రేడ్ అయింది. సోమవారం 24 క్యారెట్‌పై 810 రూపాయలు.. 22 క్యారెట్‌పై 750 రూపాయలు.. 18 క్యారెట్‌పై 610 రూపాయలు తగ్గింది. సోమవారం ఉదయం 10 గంటల ప్రాంతంలో.. 10 గ్రాముల స్వచ్ఛమైన 24 క్యారెట్ బంగారం ధర 1,47,280 దగ్గర.. 22 క్యారెట్ బంగారం ధర 1,35,000 దగ్గర.. 18 క్యారెట్ బంగారం ధర 1,10,460 దగ్గర ట్రేడ్ అవుతోంది.

## బడ్జెట్‌లో లక్షల కోట్లు.. వ్యవసాయ కూలీల భృతి... ఎత్తేసిన సర్కార్!

*తెలంగాణ రాష్ట్రంలో రాజకీయాలు ఎన్నికల సమయాల్లో హామీల వర్షం కురిపించడం, అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ హామీలను మరిచిపోవడం అనే సాంప్రదాయాన్ని మరోసారి బహిర్గతం చేస్తున్న పరిస్థితులు కనిపిస్తున్నాయి. ప్రజాస్వామ్యంలో ఓటు ఒక సాధారణ పౌరుడి అత్యంత శక్తివంతమైన ఆయుధం. ఆ ఓటును గెలుచుకోవడానికి రాజకీయ పార్టీలు ఆకర్షణీయమైన హామీలను ఇస్తాయి. అయితే ఆ హామీల వెనుక ఉన్న నిబద్ధత, ఆచరణలో చూపే నిజాయితీ చాలా సందర్భాల్లో ప్రశ్నార్థకంగా మారుతోంది. తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ అధికారం చేపట్టిన తర్వాత వ్యవసాయ కూలీలకు ఇచ్చిన హామీల విషయంలో కనిపిస్తున్న నిర్లక్ష్యం ఈ సమస్యను మరింత స్పష్టంగా చూపిస్తోంది.*



**మన్నారం నాగరాజు**
సామాజిక రాజకీయ విశ్లేషకులు.

ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వ్యవసాయ కూలీలను లక్ష్యంగా చేసుకుని "ఇందిరమ్మ ఆత్మీయ భరోసా" అనే పథకాన్ని ప్రకటించింది. ఈ పథకం ద్వారా ప్రతి వ్యవసాయ కూలీకి ఏడాదికి రూ.12,000 ఇవ్వాలని, అంటే నెలకు రూ.1,000 చొప్పున సహాయం అందించాలని హామీ ఇచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్న లక్షలాది కూలీలకు ఇది ఒక ఆశాకిరణంగా కనిపించింది. రోజువారీ కూలి పనులపై ఆధారపడి బతికే ఈ వర్గానికి ఈ సహాయం కనీస భరోసాగా భావించారు. కానీ అధికారంలోకి వచ్చిన తర్వాత 19 నెలలు గడిచినా ఈ హామీ అమలు విషయంలో ప్రభుత్వం చూపుతున్న జాప్యం, నిర్లక్ష్యం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.

జనవరి 26, 2025న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పథకాన్ని ప్రారంభించినట్లు ప్రకటించినప్పటికీ, ఆచరణలో మాత్రం ఆశించిన స్థాయిలో అమలు జరగలేదు. రబీ సీజన్‌కు రూ.6,000, ఖరీఫ్ సీజన్‌కు రూ.6,000 చొప్పున రెండు దఫాలుగా చెల్లిస్తామని చెప్పినా, రెండు సీజన్లు పూర్తయిన తర్వాత కూడా చాలా మంది కూలీలకు ఈ డబ్బులు అందలేదు. ఇది కేవలం పరిపాలనా లోపం మాత్రమేనా? లేక పథకం పట్ల ఉన్న నిర్లక్ష్యానికి నిదర్శనమా? అనే ప్రశ్నలు సహజంగానే తలెత్తుతున్నాయి.

ఇంకా తీవ్రమైన విషయం ఏమిటంటే, వ్యవసాయ కూలీల సంఖ్య విషయంలో ప్రభుత్వం చూపిస్తున్న అస్పష్టత. 2011 జనగణన ప్రకారం తెలంగాణలో సుమారు 60 లక్షల వ్యవసాయ కూలీలు ఉన్నారని అధికారికంగా గుర్తించారు. కానీ ఇప్పుడు ప్రభుత్వం ఈ సంఖ్యను కేవలం 17 లక్షలకు కుదించడం అనేక అనుమానాలకు తావిస్తోంది. ఒకవైపు ఎన్నికల సమయంలో లక్షలాది కూలీలను ఓటర్లుగా పరిగణించి హామీలు ఇవ్వడం, మరోవైపు అమలు సమయంలో వారిలో పెద్ద భాగాన్ని పథకం పరిధి నుంచి తప్పించడం అనేది ఒక విధంగా మోసం చేసినట్లే అనిపిస్తోంది.

ఈ పథకానికి అర్హులుగా గుర్తించిన 15 లక్షల మందిలో కూడా కేవలం 88,887 మందికే రూ.6,000 చెల్లించబడింది. అంటే మొత్తం అర్హులలో చాలా చిన్నశాతం మాత్రమే లబ్ధి పొందింది. ఇది ప్రభుత్వ నిబద్ధతపై పెద్ద ప్రశ్నార్థక చిహ్నం వేస్తోంది. రాష్ట్ర బడ్జెట్ సుమారు రూ.3 లక్షల కోట్లకు చేరుకున్న ఈ సమయంలో, అత్యంత పేద వర్గాలకు చెందిన వ్యవసాయ కూలీలకు కనీస భరోసా ఇవ్వడం ప్రభుత్వానికి భారంగా మారడం విచిత్రంగా ఉంది. గ్రామీణ తెలంగాణలో వ్యవసాయ కూలీల జీవితం ఎంత కష్టసాధ్యమో అందరికీ తెలిసిందే. సంవత్సరంలో కొన్ని నెలలు మాత్రమే వ్యవసాయ పనులు దొరుకుతాయి. మిగిలిన కాలంలో పని లేకపోవడంతో వారు పట్టణాలకు వలస వెళ్ళాల్సి వస్తోంది. నిర్మాణ పనులు, చిన్నచిన్న కార్మిక పనులు, అనధికార రంగంలో కూలి పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ వలసల వల్ల కుటుంబాలు విచ్ఛిన్నమవుతున్నాయి, పిల్లల విద్య దెబ్బతింటోంది, ఆరోగ్య సమస్యలు పెరుగుతున్నాయి.

ఉపాధి హామీ పథకం (వీ+చీ=జు+రూ) ద్వారా సంవత్సరానికి 100 రోజుల పని కల్పిస్తామని చెబుతున్నా, ఆ పని కూడా సకాలంలో అందడం లేదు. పని దొరికినా రోజుకు వచ్చే కూలి రూ.200 చుట్టూ ఉండటం వల్ల అది జీవనానికి సరిపోదు. కొన్ని ప్రాంతాల్లో ఇంకా తక్కువే లభిస్తోంది. ఇలాంటి పరిస్థితుల్లో ప్రభుత్వం అదనపు ఆర్థిక సహాయం అందించడం అత్యవసరం. కానీ ప్రభుత్వం పెట్టిన అర్హత నిబంధనలు కూడా కూలీలను మరింత ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.

ఉదాహరణకు, కనీసం 20 రోజులు ఉపాధి హామీ పనికి హాజరైన వారికే ఈ భృతి అందిస్తామని పెట్టిన నిబంధన అనేకమందిని పథకం నుంచి దూరం చేస్తోంది. పని దొరకకపోవడం వల్ల లేదా ఇతర కారణాల వల్ల ఆ 20 రోజులు పూర్తి చేయలేని వారు సహాయం కోల్పోతున్నారు. ఇది నిజంగా అర్హులైన పేదలపై మరింత అన్యాయం చేస్తున్నట్లు భావించవచ్చు.

ఇక మరో ముఖ్యమైన అంశం చిన్న మరియు సూక్ష్మ రైతుల పరిస్థితి. తెలంగాణలో ఒక ఎకరం లోపు భూమి ఉన్నవారు సుమారు 24 లక్షల మంది, రెండు ఎకరాల లోపు ఉన్నవారు మరో 17 లక్షల మంది ఉన్నారు. వీరందరూ సాంకేతికంగా రైతులుగా పరిగణించబడుతున్నా, వాస్తవానికి వారిలో చాలా మంది జీవనోపాధి కోసం కూలి పనులపైనే ఆధారపడుతున్నారు. తమ భూమిలో సంవత్సరం పొడవునా పని దొరకదు. వర్షాధార వ్యవసాయం, నీటి కొరత, పెట్టుబడి సమస్యలు వీరిని కూలీల స్థితికి నెట్టేస్తున్నాయి.

అందువల్ల ఈ వర్గాన్ని కూడా వ్యవసాయ కూలీలుగా పరిగణించి భృతి అందించాల్సిన అవసరం ఉంది. కానీ ప్రస్తుతం అమలవుతున్న విధానాలు ఈ వాస్తవాలను పరిగణలోకి తీసుకోవడం లేదు. ఇది గ్రామీణ ఆర్థిక వ్యవస్థలో ఉన్న అసమానతలను మరింత పెంచుతోంది.

ప్రస్తుత ధరల ప్రకారం ఒక సాధారణ కుటుంబం కనీస అవసరాలను తీర్చుకోవాలంటే నెలకు కనీసం రూ.20,000 నుండి రూ.25,000 వరకు ఖర్చు అవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంవత్సరానికి రూ.12,000 కూడా సరిపోదు. అయినప్పటికీ ఆ కనీస సహాయం కూడా అందకపోవడం పరిస్థితి ఎంత దయనీయంగా ఉందో చూపిస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని సంఘాలు, కూలీల సంఘాలు నెలకు కనీసం రూ.4,000 చొప్పున భృతి ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాయి. అంటే సంవత్సరానికి రూ.48,000. ఇది పెద్ద మొత్తం అనిపించినా, రాష్ట్ర బడ్జెట్ పరిమాణాన్ని చూస్తే సాధ్యమే. ఇతర రంగాల్లో ప్రభుత్వం భారీ రాయితీలు, సబ్సిడీలు ఇస్తోంది. కార్పొరేట్ సంస్థలకు పన్ను సడలింపులు, ప్రోత్సాహకాలు రూపంలో లక్షల కోట్లు వెచ్చిస్తోంది. అదే సమయంలో అత్యంత పేద వర్గాలకు చెందిన కూలీలకు కొన్ని వేల రూపాయలు ఇవ్వడానికి సంకోచించడం సమంజసం కాదు. ఇది ప్రాధాన్యతల విషయంలో ఉన్న వ్యత్యాసాన్ని స్పష్టంగా చూపిస్తోంది.

ఇంకా ఒక ముఖ్యమైన అంశం రాజకీయ బాధ్యత. అధికార పార్టీ మాత్రమే కాకుండా ప్రతిపక్ష పార్టీలు కూడా ఈ విషయంలో తమ బాధ్యతను నిర్వర్తించాలి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను గుర్తు చేస్తూ, అమలు కోసం ఒత్తిడి తీసుకురావాలి. కానీ చాలాసార్లు ప్రతిపక్షాలు కూడా ఈ విషయాన్ని రాజకీయ ఆరోపణలకే పరిమితం చేస్తాయి. కూలీల సమస్యలు ప్రధాన చర్చాంశంగా మారడం లేదు.

ఈ పరిస్థితి కొనసాగితే ప్రజాస్వామ్యంపై ప్రజల నమ్మకం దెబ్బతింటుంది. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలు కేవలం ఓట్లు కోసం మాత్రమే అన్న భావన బలపడుతుంది. ఇది ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి అనుకూలం కాదు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రభుత్వాలు తమ హామీలను గౌరవించాలి, వాటిని సమయానికి అమలు చేయాలి.

వ్యవసాయ కూలీలు దేశ ఆర్థిక వ్యవస్థలో అత్యంత కీలకమైన వర్గం. వారి కష్టంతోనే ఆహార ఉత్పత్తి జరుగుతుంది. అయినప్పటికీ వారు ఎదుర్కొంటున్న జీవన పరిస్థితులు అత్యంత దయనీయంగా ఉన్నాయి. ఈ విరోధాభాసాన్ని సరిచేయడం ప్రభుత్వాల బాధ్యత. కేవలం పథకాలు ప్రకటించడం సరిపోదు, వాటిని సమర్థవంతంగా అమలు చేయాలి.

తెలంగాణలో ప్రస్తుత పరిస్థితి చూస్తే, వ్యవసాయ కూలీల సమస్యలు ఇంకా పరిష్కారం కోసం ఎదురుచూస్తున్నాయి. హామీలు ఇవ్వడం ఒక విషయం, వాటిని అమలు చేయడం మరో విషయం. ఈ రెండింటి మధ్య ఉన్న అంతరం ఎంత ఎక్కువగా ఉంటే, ప్రజల అసంతృప్తి అంత ఎక్కువగా ఉంటుంది. ప్రభుత్వం ఈ విషయాన్ని గమనించి వెంటనే చర్యలు తీసుకోవాలి.

ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాన్ని పూర్తి స్థాయిలో అమలు చేయడం, అర్హులైన అందరికీ సహాయం అందించడం, నిబంధనలను సరళీకరించడం, చిన్న రైతులను కూడా పథక పరిధిలోకి తీసుకురావడం వంటి చర్యలు తీసుకుంటేనే ఈ పథకం తన లక్ష్యాన్ని సాధిస్తుంది. లేకపోతే ఇది కూడా మరో ఎన్నికల హామీగా మాత్రమే మిగిలిపోతుంది.

చివరగా చెప్పాలంటే, వ్యవసాయ కూలీల సమస్యలు కేవలం ఆర్థిక సమస్యలు మాత్రమే కాదు, అవి సామాజిక న్యాయం, సమానత్వం, మానవ గౌరవం వంటి విలువలతో కూడుకున్నవి. ఈ వర్గాన్ని ఆదుకోవడం ద్వారా మాత్రమే సమాజంలో సమతుల్యత సాధ్యమవుతుంది. ప్రభుత్వం తన బాధ్యతను గుర్తించి, మాట నిలబెట్టుకుంటేనే ప్రజాస్వామ్యానికి నిజమైన అర్థం ఉంటుంది. లేకపోతే "హామీలు ఒకటి అమలు మరోటి" అనే విమర్శలు మరింత బలపడతాయి.

## ములుగు జిల్లాలో ఈదురుగాలుల వర్షం

### - చెట్టుకూలి రోడ్డుపై పడడంతో ట్రాఫిక్ జామ్

**ములుగు,మార్చి30( వెలుతురు):**

జిల్లాలో ఈదురుగాలులతో కూడిన భారీ వర్షం పడింది. ఏటూరునాగారం -తాడ్వాయి మధ్య ఉరుములు, మెరుపులతో భారీ వర్షం పడింది. భారీ ఈదురుగాలులతో రహదారులపై చెట్లు పడిపోయాయి. దీంతో కిలోమీటర్ మేర ట్రాఫిక్ జామ్ అయ్యింది. వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. జేసీపీ సాయంతో చెట్లను తొలగించి పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసారు. మరో వైపు రాష్ట్రంలోని పలు జిల్లాలకు వర్ష సూచన చేసింది వాతావరణ శాఖ. హైదరాబాద్ తో పాటు జగిత్యాల,కామారెడ్డి, ఆసిఫాబాద్, మంచిర్యాల, మెదక్, మేడ్చల్, ములుగు,నాగర్ కర్నూలు, నల్గొండ,రంగారెడ్డి, సంగారెడ్డి,సిద్దిపేట,వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు,మెరుపులతో తేలికపాటి వర్షానికి చాన్స ఉంది. హైదరాబాద్ లో మార్చి 30న రాత్రి భారీ వర్షం పడే అవకాశం ఉందని తెలిపింది. ఉరుములు ,మెరుపులతో కూడిన వర్షం పడుతుందని చెప్పింది. టోలీ చౌకీ, నాంపల్లి,మలక్ పేట, ఆసిఫ్ నగర్, కార్వాన్, గోషామహల్,మెహదీపట్నం, చార్మినార్, అత్తాపూర్ ,మసాబ్ ట్యాంక్,కూకట్ పల్లికి అలర్ట్ జారీ చేసింది. ఖైరతాబాద్,అబిడ్స్ ,సికింద్రాబాద్,ఉప్పల్, ఎల్బీనగర్, చార్మినార్ ,కంటోన్మెంట్ ,కాప్రా,మల్కాజ్ గిరిలో తేలికపాటి మోస్తారు వర్షం పడే అవకాశం ఉందని హెచ్చరించింది.



https://epaper.velthuru.com

హైదరాబాద్ - రంగారెడ్డి వెలుతురు

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన బిగ్ టీవీ జర్నలిస్ట్ ముచ్చర్ల నాగేష్ కు ఆర్థిక సహాయం చేసిన టిడబ్ల్యూజెఎఫ్ యూనియన్ జర్నలిస్టులు

**- జర్నలిస్ట్ నాగేష్ కుటుంబానికి అండగా ఉంటాం**



**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 30:**
ఇబ్రహీంపట్నం బిగ్ టీవీ ఇబ్రహీంపట్నం నియోజకవర్గం జర్నలిస్టు ముచ్చర్ల నాగేష్ ఇటీవలరోడ్డు ప్రమాదం లో గురైన విషయం తెలిసిందే విషయం తెలుసుకున్న టీడబ్ల్యూజేఎఫ్ యూనియన్ జర్నలిస్టులు నాగేష్ ను ఎలాగైనా ఆదుకోవాలనే దృఢ నిశ్చయంతో సంకల్పించారు కొంతమంది జర్నలిస్టులు ఎవరికి తోచిన విధం గా వారు సాయం చేశారు అలా మొత్తంగా పోగుచేసి నాగేష్ కు రూ.20 వేల రూపాయల ఆర్థిక సాయం యూనియన్ ఆధ్వర్యంలో అందజేశారు భవిష్యత్తులో కూడా అన్నివిధాల అండగా ఉంటామని టి డబ్ల్యూ జి ఎఫ్ యూనియన్ జర్నలిస్టులు నాగేష్ కు భరోసా కల్పించారు ఈకార్యక్రమంలో టి డబ్ల్యూ జె ఎఫ్ యూ నియన్ రాష్ట్ర నాయకులు జోగు శ్రీనివాస్ జిల్లా నాయకులు పంది వెంకటేష్ నియోజకవర్గ అధ్యక్షులు పల్లా టి జగన్ ఉపాధ్యక్షులు పంది శ్రీను లింగం.యూనియన్ నాయకులు పంది క్రాంతి కుమార్ జోగు అంజి యాట మహేష్ సైదులు తదితరులుపాల్గొన్నారు.

## ప్రజావాణికి 33 ఫిర్యాదులు ప్రజావాణిలో వచ్చిన ప్రజల సమస్యలు శ్రద్ధ చూపి వెంటనే పరిష్కరించాలని అధికారులకు ఆదేశం

**- రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి నారాయణరెడ్డి**





**రంగారెడ్డి జిల్లా కార్యాలయంలో ప్రజావాణిలో ఫిర్యాదులు ఇవ్వటానికి క్యూలైన్లో నిలుచున్న ప్రజలు**

**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 30:**
ఇబ్రహీంపట్నం నియోజకవర్గం కొంగరకలాన్ రంగారెడ్డిజిల్లా కలెక్టరేట్ సోమవారం సమీకృత జిల్లాకార్యా ల యాల సముదాయ సమావేశమందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి33 ఫిర్యాదులు అందాయి ప్రజలనుండి వివిధ అంశాలకు సంబంధించిన ఫిర్యాదుల వినతిపత్రాలు జిల్లాకలెక్టర్ సి నారాయణరెడ్డి అద నపు కలెక్టర్ రెవెన్యూ చంద్రారెడ్డితో కలిసి స్వీకరించారుఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాప్రజల స మస్యలను పరిష్కరించడంలో అధికారులు మరింత శ్రద్ధ కనబరచాలని వచ్చిన ఫిర్యాదులు వెంటనే పరిష్క రించాలని అధికారులకు సూచించారు ప్రతిసోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమము కేవలం సమ స్యలు విని దరఖాస్తులు స్వీకరించే విధంగా కాకుండా, పరిష్కారాల వేదికగా నిలిచేలా ప్రతిఒక్కరు పని చే యాలని ఫిర్యాదులు స్వీకరించిన వెంటనే పరిష్కారం చూపాలని అధికారులకు సూచించారు ప్రజావాణి కా ర్యక్రమాన్నిసమస్యలు పరిష్కరించే వేదికగా మార్చాలని తెలిపారు ఫిర్యాదులు సమర్పించడానికి వచ్చిన ప్ర జలకు అవసరమైన సూచనలు సహాయం అందించడంలో అధికారులు సిబ్బందిచొరవ చూపాలని అన్నారు ఇతర శాఖలు25మొత్తం33 దరఖస్తులు అందాయి ఈప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవె న్యూ చంద్రారెడ్డి జిల్లా రెవెన్యూ అధికారి సంగీత వివిధ శాఖలజిల్లా అధికారులు మున్సిపల్ అధికారులు మండలతహశీల్దారులు కలెక్టరేట్ సూపరింటెంట్లు సంబంధిత అధికారులు తదితరులుపాల్గొన్నారు

## సాయిబాబా నగర్ మరియు రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలించిన కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్.




**కుత్బుల్లాపూర్ (వెలుతురు ప్రతినిధి) మార్చి 30:**
సోమవారం కుత్బుల్లాపూర్ జోన్ జోనల్ కమిషనర్ పింకేష్ కుమార్, IAS కొంపల్లి సర్కిల్-56 పరిధిలో పర్యటించారు. ఈ సందర్భంగా సాయిబాబా నగర్ మరియు రాజీవ్ గృహకల్ప ప్రాంతాలలో శానిటేషన్ పనులను పరిశీలించారు.ప్రత్యేకంగా జ&ణ (Construction & Demolition) వ్యర్థాల ఎత్తివేత పనులను సమీక్షిస్తూ, వీటిని సమయానికి పూర్తిగా తొలగించేలా అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచడం, ఎక్కడైనా వ్యర్థాలు పేరుకుపోకుండా నిరంతర పర్యవేక్షణ చేయాలని సూచించారు.అలాగే డిప్యూటీ కమిషనర్ ఎన్. కృష్ణా రెడ్డి సంబంధిత అధికారులతో కలిసి పనుల పురోగతిని వివరించారు. ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శుభ్రత ప్రమాణాలను మరింత మెరుగుపరచాలని, సిబ్బంది క్రమం తప్పకుండా ఫీల్డ్‌లో పనిచేయాలని జోనల్ కమిషనర్ ఆదేశించారు.ఈ కార్యక్రమంలో DEE తిరుపతి , AE కృప, శానిటేషన్ సూపర్వైజర్ కె. పోతా రెడ్డి మరియు మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## వనస్థలిపురంలో ఇమ్మిట్రిక్స్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ ప్రారంభోత్సవం

**- విద్యార్థులు గుర్తింపు ఉన్న కన్సల్టెన్సీలనే సంప్రదించా**

**- ప్రారంభోత్సవం సందర్భంగా ప్రెస్ మీట్ లో జయంత్ రెడ్డి పలు సూచనలు**

**వనస్థలిపురం వెలుతురు మార్చి 30:**





విదేశీ విద్య, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారికి, వ్యాపారాలు చేసుకొనేవారికి ఇమ్మిట్రిక్స్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ అద్భుత సేవలందిస్తున్నదని ఆ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ జయేందర్ రెడ్డి అన్నారు. విద్యార్థులు గుర్తింపు ఉన్న కన్సల్టెన్సీలనే సంప్రదించాలి ప్రారంభోత్సవం సందర్భంగా ప్రెస్ మీట్ లో జయంత్ రెడ్డి పలు సూచనలు విదేశీ విద్య, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారికి, వ్యాపారాలు చేసుకొనేవారికి ఇమ్మిట్రిక్స్ ఓవర్సీస్ కన్సల్టెన్సీ అద్భుత సేవలందిస్తున్నదని ఆ సంస్థ నిర్వాహకులు జయేందర్ రెడ్డి ,నవీన్ అన్నారు. సోమవారం వనస్థలిపురం డివిజన్ పరిధిలోని జీవన్ సాయి హాస్పిటల్ ఎదురుగా ఆరోవ బ్రాంచ్ ని స్థాపించిన సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ కేవలం 10 లక్షలు లోనే విదేశీ విద్యని అభ్యసించవచ్చని అంతేకాకుండా విదేశాల్లో చదువుకునేటప్పుడు పార్ట్ టైం జాబ్ అకామిడేషన్ ని కూడా మేమే ఏర్పాటు చేస్తామని ఈ సందర్భంగా తెలిపారు.

**జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవాలి**

విదేశాల్లో చదువు, ఉద్యోగాల కోసం ప్రయత్నించేవారు చాలా జాగ్రత్తగా ప్రణాళిక వేసుకోవాలని జయేందర్ రెడ్డి సూచించారు. ఎవరెవరినో నమ్మి వీసాల కోసం డబ్బులు ఖర్చు చేసి మోసపోవద్దని, గుర్తింపు ఉన్న కన్సల్టెన్సీలను మాత్రమే సంప్రదించాలన్నారు. బీటెక్ విద్యార్థులు వైయాక్సిస్ కన్సల్టెంట్ ద్వారా శిక్షణ పొందితే భవిష్యత్తులో ఎక్కడకు వెళ్లాలన్నా దగ్గరుండి సహకరిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో స్థానిక డివిజన్ మాజీ కార్పొరేటర్ రాగుల వెంకటేశ్వర రెడ్డి, హస్తినాపురం డివిజన్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ దేంది శశిధర్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మెరుగు రమేష్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## ఆరుట్ల గ్రామంలో శ్రీశ్రీశ్రీ కంఠమహేశ్వరస్వామి దేవాలయంలో 4వ సోమవారం అన్నదాన కార్యక్రమం అన్నదాన ప్రభువు బొగ్గులపల్లి రాకేష్ రెడ్డి

**- అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్న వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్**

**- అన్నదానం కార్యక్రమం నిర్వహిస్తున్న శివస్వాముల గురుస్వామి లొంగరీ యాదగిరి, సుంకరి రఘునాథ్ గౌడ్ కు ప్రత్యేక ధన్యవాదాలు**



**మంచాల వెలుతురు మార్చి 30:**
మంచాల మండలం ఆరుట్ల గ్రామం .శ్రీశ్రీశ్రీ కంఠ మహేశ్వరస్వామి దేవాలయంలో శివ స్వాములగురుస్వామి లొంగరీ యాదగిరి శివభక్తుడుసుంకరి రఘునాథ్ గౌడ్ ఆధ్వర్యంలో4వ సోమవారంరోజుకంఠ మహేశ్వర స్వామి దేవాలయంలో శివలింగానికి కంఠమహేశ్వరస్వామికి ప్రత్యేకపూజలుశివలింగానికి అభిషేకంచేసి ఈ సోమవారం అన్నదాన ప్రభువు బొగ్గులపల్లి రాకేష్ రెడ్డి సహకారంతో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చే శారు అన్నదాన కార్యక్రమంలో వైయస్సార్ మాధగోని జంగయ్యగౌడ్ పాల్గొని సందర్భంగా మాట్లాడుతూ పది మందికి కడుపు నింపాలి ప్రజలకు సేవ చేయాలి అని ఉద్దేశంతో కంకణం కట్టుకొని శివస్వాముల గురు స్వామి లొంగరీ యాదగిరి శివభక్తుడు సుంకరి రఘునాథ్ గౌడ్ ప్రతిసోమవారం రోజు తెల్లవారుజామునే కం ఠమ హేశ్వరస్వామి దేవాలయంవద్దకు చేరుకొని దేవాలయాన్ని శుభ్రంచేసి కంఠమహేశ్వర స్వామికి శివలిం గానికి ప్రత్యేక పూజలుచేసి అన్నదానం నిర్వహిస్తూ పదిమంది కడుపు నింపుతూ గౌడసంఘం పెద్దల సహా యంతో దాతల సహాయంతో సమయానికి దాతలు సహకారం చేసిన చేయకుండా సొంత డబ్బులతో సేవ చేస్తు గ్రామంలో అన్నదానం ఏర్పాటు చేసి ఆదర్శంగా నిలుస్తున్న శివ స్వాముల గురుస్వామి లొంగరీ యాద గిరి శివ భక్తుడు సుంకరి రఘునాథ్ గౌడ్ కు వారికి సహకరిస్తున్న భక్తులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు అన్నదాన కార్యక్రమంలో అయ్యప్పస్వాముల గురుస్వామి లొంగరీదాసు నూకంరాజుముదిరాజ్ రమేష్ నా యక్ మాడపాకులశేఖర్ మారగోనినాగేష్ గౌడ్ అంతటి దశరథగౌడ్ మద్దిభాష జోగుఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు

## మధ్యాహ్నం భోజన కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

**- శాంతియుతంగా సమస్యలు చెప్పుకోవడానికి కలెక్టర్ కార్యాలయం వెళుతుంటే అక్రమఅరెస్టు చేయడం సరైన పద్ధతికాదు అక్రమ అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు**

**- మధ్యాహ్న భోజనం కార్మికుల యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వప్న**




**ఇబ్రహీంపట్నం వెలుతురు మార్చి 30:**
ఇబ్రహీంపట్నం మధ్యాహ్న భోజనం కార్మికుల రాష్ట్ర అధ్యక్షురాలు సప్న మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇ చ్చిన హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వం అప్పుడు ఇచ్చిన హామీలు అడిగితే ఇప్పుడు అరెస్టులు చేస్తు న్నారు చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని నిర్వహించకుండా అరెస్టులు అరెస్టులతో మాపోరాటాలను ఆపలేరు మధ్యాహ్న భోజనపథకం కార్మికుల యూనియన్ రాష్ట్రఅధ్యక్షురాలు స్వప్న ఎన్నికల ముందు ఇచ్చిన హామీ లు అమలు చేయాలని డిమాండ్ చేస్తే అరెస్టులు చేయడం ఎంతవరకు న్యాయమని మధ్యాహ్నభోజన ప థకం కార్మికుల యూనియన్ రాష్ట్రఅధ్యక్షురాలు స్వప్నకాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఈ అరెస్టులను ఖండిస్తూ ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ ముందు నిరసన తెలియజేయడం జరిగిందిఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ఇచ్చిన హామీలు మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని అడగడానికి నేడు చలోకలెక్టరేట్ చేపట్టడం జరిగింది ఈ కార్యక్రమానికి వెళుతున్న మ ధ్యాహ్న భోజన పథకం కార్మికులను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం ఎంతవరకు న్యాయమని అన్నారు మీరు ఇచ్చిన హామీలు మర్చిపోలేమని వాటిని అమలు చేసేవరకు కార్మికుల పోరాటం ఆగదని అన్నారు కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో మధ్యాహ్న భోజన కార్మికులకు10,000 రూపాయలు ఫిక్స్ వేత నం అలాగే ఈఎస్ఐ పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పిస్తామని హామీ ఇచ్చిందని గుర్తు చేశారు అయితే ప్రభు త్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా ఆ హామీలు అమలు కాలేదని విమ ర్శించారు వెంటనే పదివేల ఫిక్స్ వేతనం అమలు చేయడంతో పాటు ఈఎస్ఐ పీఎఫ్ లాంటి కార్మిక హక్కులను వర్తింపజే యాలని డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లానాయకులు పోచమోని కృష్ణ మ ధ్యాహ్న భోజన కార్మిక యూనియన్ జిల్లానాయకులు సరిత కల్పన పద్మ శిరీష రాధ పరమేశ్వరి నరేందర్ సుజాత కార్మికులు తదితరులుపాల్గొన్నారు

## ప్రజావాణి లో 117 దరఖాస్తులు

**- జిల్లా పాలనాధికారి ఆశిష్ సాంగ్వాన్**



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 30**
సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమంలో 117 దరఖాస్తులు వచ్చాయని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. ఈ సందర్భంగా వివిధ ప్రాంతాల నుండి వచ్చిన అర్జీలను అర్జీదారులు తమ సమస్యల పై జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్, అదనపు కలెక్టర్ విక్టర్, మధుమోహన్, సీఈఓ చందర్, ఆర్ డి ఓ యన్ వి గిరి లు అర్జీలను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయా శాఖలకు సంబంధించిన వివిధ రకాల సమస్యల పై వచ్చిన అర్జీలను స్వీకరించి సంబంధిత అధికారులకు ఇస్తూ తక్షణమే స్పందించి పరిష్కరించాలని ఆదేశించారు. ఈ గ్రీవెన్స్ లో జిల్లా కలెక్టర్ జిల్లా అధికారులనుద్దేశించిమాట్లాడుతూ అర్జీదారుల నుండి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి పెండింగ్ లో లేకుండా వెంట వెంటనే పరిష్కరించాలని, పరిష్కారం కాని దరఖాస్తుల పై వివరంగా దరఖాస్తుదారునికి తెలపాలని అన్నారు. ఈ ప్రజావాణి లో వివిధ శాఖల జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## అబిడ్స్ లో అనుమానిత మృతదేహం లభ్యం



**బషీర్ బాగ్ వెలుతురు 30 మార్చి :**
అబిడ్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో అనుమానిత మృతదేహం కేఫ్ బహార్ దగ్గర లభించింది దారిన వెళ్లే వాళ్ళు పోలీస్ కు సమాచారం అందించారు పోలీసులకు సమాచారం అందించిన వెంటనే పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా హాస్పిటల్ కు తరలించారు ఈ మృతదేహం ఎవరికైనా తెలిసిన వాళ్ళు ఉంటే అబిడ్స్ పోలీస్ స్టేషన్ ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు 87126 61243

## మధ్యప్రాచ్యంలో యుద్ధాన్ని ఆపండి

**- కేంద్రాన్ని కోరుతూ అసెంబ్లీ తీర్మానం**

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**
అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఆపేలా కేంద్రం చొరవ చూపాలని తెలంగాణ శాసన సభ తీర్మానం చేసింది. ఈ తీర్మానాన్ని తెలంగాణ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క సభలో ప్రవేశపెట్టారు. మధ్యప్రాచ్యంలో యుద్ధం వల్ల దాదాపు 4 వేల మంది మరణించారని ఉపముఖ్యమంత్రి ఆవేదన వ్యక్తం చేశారు. యుద్ధ ప్రభావం ఆసియా దేశాలపై తీవ్రంగా పడుతోందని.. ఆర్థిక విధ్వంసం జరుగుతోందని తెలిపారు. యుద్ధ ప్రభావం భారత్‌పై ఎక్కువగా ఉందని భట్టి పేర్కొన్నారు. ఆయా దేశాల మధ్య ఉద్రిక్తతలు ఆగకపోతే ప్రపంచ దేశాల భవిష్యత్తు మరింత ఆందోళనకరంగా మారొచ్చని అభిప్రాయపడ్డారు. ఇది ఇప్పుడు ఆగకపోతే మూడో ప్రపంచ యుద్ధానికి దారి తీయవచ్చని హెచ్చరించారు. అమెరికా, ఇజ్రాయెల్ – ఇరాన్ యుద్ధాన్ని ఖండిస్తున్నామని.. ఆయా దేశాల మధ్య శాంతి పరిఢవిల్లాలని ఆకాంక్షించారు. యుద్ధాన్ని ఆపే దిశగా భారత ప్రభుత్వం ప్రయత్నం చేయాలని తీర్మానం చేస్తున్నట్లు భట్టి విక్రమార్క ప్రకటించారు.

## అధికారికంగా మంథని ప్రముఖుల జయంతి, వర్ధంతి

**- కౌన్సిల్ లో చర్చించి నిర్ణయం తీసుకుంటాం**

**- మంథని మున్సిపల్ చైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్**

**- రావికంటి రామయ్య గుప్తకు ఘన నివాళి**





**మంథని వెలుతురు మార్చి 30:**
వివిధ రంగాల్లో ప్రతిభ చూపి మంథనికి గర్వకారణమైన ప్రముఖుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అధికారికంగా నిర్వహించే విషయంలో కౌన్సిల్లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని మంథని మున్సిపల్ ఛైర్మన్ ఒడ్నాల శ్రీనివాస్ తెలిపారు. ప్రజాకవి, మంత్రకూట వేమన రావికంటి రామయ్య గుప్తా 17వ వర్ధంతి సందర్భంగా సోమవారం వారి విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. మంథని ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులను చక్కగా చూసుకోవాల్సిన బాధ్యత సంతానంపై ఉంటుందన్నారు. తల్లిదండ్రులను నిర్లక్ష్యం చేసే వారి వేతనంలో 15% కోత విధించేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం చట్టం చేసిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దివంగత ప్రజానేత దుద్దిళ్ల శ్రీపాదరావు జయంతిని వారి తనయుడు, మంత్రి శ్రీధర్ బాబు ఏటా ఘనంగా చేస్తూ వారి స్ఫూర్తిని చాటుతున్నారని కొనియాడారు. అదే బాటలో రావికంటి రామయ్య గుప్త తనయులు వారి జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా నిర్వహించడం ప్రశంసనీయమన్నారు. రావికంటి రామయ్య గుప్త ఉపాధ్యాయునిగా కవిగా, సమాజానికి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. మంథని ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఎల్లంకి వంశీధర్ మాట్లాడుతూ మంథనిలో కొలువుదీరిన వైశ్య ప్రముఖులు రావికంటి రామయ్య గుప్తా, గుండా నాగరాజుల జయంతి, వర్ధంతి కార్యక్రమాలను ఏటా తమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించాలని తీర్మానించినట్లు తెలిపారు. కాంగ్రెస్ నాయకుడు శశి భూషణ్ కాచె, బీజేపీ నాయకుడు బోగోజు శ్రీనివాస్, విశ్రాంత ఉపాధ్యాయుడు పవిత్రం భూమయ్య, మంథని విద్యార్థి యువత వ్యవస్థాపక అధ్యక్షుడు కొండెల మారుతి, రావికంటి రామయ్య గుప్త తనయుడు, జర్నలిస్ట్ శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు. కొమురవెల్లి సమ్మయ్య, ఇల్లెందుల కిషోర్, రావికంటి సదానందం, సతీష్, రేపాల రమేష్, కొంతం రమేష్, రాచర్ల నాగరాజు, దొంతుల రాజేందర్, గుండా హరీష్, శైలజ, చంద్రకాంత్, ఇల్లెందుల సత్యనారాయణ, రాజమౌళి గౌడ్ తదితరులు పాల్గొని రావికంటి రామయ్య గుప్తకు ఘనంగా నివాళులు అర్పించారు.

## మౌలాలి డివిజన్‌లో డ్రైనేజీ పనులకు వేగం మైనంపల్లి హనుమంతరావు చొరవతో త్వరలో ప్రారంభం

**మల్కాజిగిరి, మార్చి 30 వెలుతురు:**
మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు ప్రత్యేక చొరవతో, రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహకారంతో మౌలాలి డివిజన్‌లో అభివృద్ధి పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే ఆమోదం పొందిన డ్రైనేజీ పనులను తక్షణమే ప్రారంభించాలని స్థానిక ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు కృషి చేస్తున్నారు.ఈ నేపథ్యంలో, 186 మౌలాలి డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్ నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కాలనీవాసులు కలిసి వాటర్ బోర్డు అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించారు. మైనంపల్లి హనుమంతరావు ఆదేశాల మేరకు ఈ వినతిపత్రం సమర్పించినట్లు వారు తెలిపారు.ఈ సందర్భంగా అధికారులతో జరిగిన చర్చలో, డ్రైనేజీ పనులను ఆలస్యం లేకుండా త్వరలోనే ప్రారంభిస్తామని వారు హామీ ఇచ్చారు. ముఖ్యంగా నెహ్రూ నగర్, ఎస్పీ నగర్, భారత్ నగర్ మరియు హనుమాన్ నగర్ ప్రాంతాల్లో చాలా కాలంగా ఎదురుచూస్తున్న ఈ పనులు అతి త్వరలో ప్రారంభమవుతాయని అధికారులు వెల్లడించారు.ప్రాంత ప్రజలు డ్రైనేజీ సమస్యలతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, ఈ పనులు ప్రారంభం కానుండటం పట్ల కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేశారు. మైనంపల్లి హనుమంతరావు చొరవతో ఈ సమస్య పరిష్కారం దిశగా అడుగులు పడటం అభినందనీయమని స్థానికులు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో 186 డివిజన్ అధ్యక్షుడు పోతుల వినోద్ యాదవ్‌తో పాటు సీనియర్ కాంగ్రెస్ నాయకులు వెంకన్న, ఫారుక్, మంద భాస్కర్ మాదిగ, చందు, గడ్డం సత్తన్న, నర్సింగరావు, ప్రేమ్ షకీల్, ఎల్లం, పాండురంగ చారి, కృష్ణ, భీమ్రాజ్, కుమార్, యాకూబ్ పాల్గొన్నారు. అదేవిధంగా నెహ్రూ నగర్ కాలనీ ట్రెజరర్ విజయ్ కుమార్, మహిళా నాయకురాలు మహమూద్, జాన్ బి, పద్మ మరియు ఇతర కార్యకర్తలు, స్థానిక ప్రజలు హాజరయ్యారు.మొత్తానికి, మౌలాలి డివిజన్‌లో దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న డ్రైనేజీ సమస్యకు త్వరలో పరిష్కారం లభించనున్నదనే ఆశలు వ్యక్తమవుతున్నాయి.



https://epaper.velthuru.com

నల్గొండ వెలుతురు

# అక్రమ అరెస్టులు ప్రజా ఉద్యమాలను ఆపలేవు

**- చెరువుగట్టు మాజీ సర్పంచ్ బాలకృష్ణ ఆగ్రహం**




**నార్కట్‌పల్లి వెలుతురు మార్చి 30:** అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో పాత బకాయిల చెల్లింపుల కోసం చేపట్టనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి ముందు పలువురు నాయకులను పోలీసులు అర్ధరాత్రి అరెస్ట్ చేయడం పై చెరువుగట్టు మాజీ సర్పంచ్ బాలకృష్ణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో గ్రామానికి సేవలందించిన సర్పంచ్‌లకు ఇలాంటి అవమానాలు ఎదురవుతాయని ఊహించలేదని ఆయన అన్నారు. గత ప్రభుత్వ హయాంలో పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేస్తూ నేడు అసెంబ్లీ ముట్టడికి సిద్ధమవుతున్న సమయంలో, పోలీసుల చర్యలు ప్రజాస్వామ్య హక్కులను హరించేవిగా ఉన్నాయని విమర్శించారు. అర్ధరాత్రి సమయంలో అరెస్టు చేసి నార్కట్‌పల్లి పోలీస్ స్టేషన్‌కు తరలించడం అన్యాయమని పేర్కొన్నారు. తక్షణమే పాత బకాయిలను విడుదల చేయాలని, లేకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. ఈ అరెస్టు అయిన వారిలో చిన్న నారాయణపురం మాజీ సర్పంచ్ కొత్త నరసింహ యాదవ్ కూడా ఉన్నారు.

# గ్రామ అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తా

**- ప్రజా ఆరోగ్యమే లక్ష్యంగా ముందుకు సాగుతా**

**- కందిమల్ల గోపాల్ రెడ్డి సర్పంచ్ నీర్నంల**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 30:** నీర్నంల గ్రామంలో విపరీతమైన దోమలు ఉండడం ద్వారా గ్రామ ప్రజల ఆరోగ్యం బాగుండాలని గ్రామ ప్రజల కోరిక మేరకు గత 15 రోజుల క్రితం దోమల నివారణ నూతన మిషను కొనుగోలు చేసి సోమవారం రోజు గ్రామపంచాయతీ సిబ్బంది సహకారంతో,దోమల మందు గ్రామంలో ఉన్న ప్రతి వార్డు తిరుగుతూ గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి దోమల మందు పిచికారి చేయించడం జరిగినది. మంచి కార్యక్రమం చేస్తున్న గ్రామ సర్పంచ్ కందిమల్ల గోపాల్ రెడ్డి మరియు వారి పాలకవర్గానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపినారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆవుల శ్రీశైలం యాదవ్ వార్డ్ మెంబర్లు చిన్నపాక రమేష్, పెరుమాండ్ల నవీన్, ముత్యాల కిషన్, శా నగొండ .మల్లికార్జున్, నాగటి ఉపేందర్, బోయిన ఐలమ్మ, నోముల ఉమారాణి, కట్ట తనుశ్రీ , శానకొండ. రవళి తదితరులు పాల్గొన్నారు. పాలకవర్గానికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

## రామన్నపేట నియోజవర్గ సాధన సమితి ఆధ్వర్యంలో పల్లివాడ , ఎల్లంకి, సర్నేనిగూడెం సర్పంచులకు సన్మానం..

**- రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్రరమేష్ గౌడ్.**



**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 30:** నియోజవర్గ సాధనే లక్ష్యంగా పనిచేస్తున్న రామన్నపేట నియోజక సాధన సమితి ఆధ్వర్యంలో అందరి సహకారం ఉండాలని ఆలోచనతో ఈ మధ్యనే ఎన్నికైన సర్పంచులకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేయడం జరిగింది. అందులో భాగంగానే పల్లివాడ సర్పంచ్ ఖమ్మంపాటి శ్రీనివాస్ కి ,ఎల్లంకి సర్పంచ్ ఈడెం రాధా, శ్రీనివాస్ కి, సర్నేనిగూడెం సర్పంచ్ గంగాదేవి, స్వామి కి సన్మానం చేయడం జరిగింది. రామన్నపేట నియోజకవర్గాన్ని సాధించుకుందామని సర్పంచ్ తో జరిగిన చర్చలో వారు సానుకూలంగా స్పందించి ఎలాగైనా రామన్నపేటని నియోజకవర్గంగా చూడాలని మాకు ఉందని మేము కూడా అందులో భాగస్వాములమై సహకరిస్తామని చెప్పారని రామన్నపేట నియోజకవర్గ సాధన సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎర్ర రమేష్ గౌడ్ అన్నారు. సన్మాన కార్యక్రమాలలో పోష బోయిన మల్లేశం, నియోజకవర్గ సాధన సమితి కార్యదర్శి గడ్డం యాదగిరి , ఏండి. ఫజల్, నకరెకంటి అశోక్, బోయిన ఆనంద్, పెండెం రవీందర్, పోచ బోయిన మల్లేష్, దండుగుల రాములు, వనం చంద్రమౌళి, శ్రీ రామోజీ నరసింహ చారి, తదితరులు పాల్గొన్నారు..

# సమకాలీన పురోగతి అను అంశం పైన జాతీయ సదస్సు కార్యక్రమం

**- ప్రభుత్వ డిగ్రీ కళాశాల రామన్నపేట**




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 30:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అర్థశాస్త్రం, వాణిజ్యశాస్త్రం మరియు భౌతికశాస్త్రం విభాగాల ఆధ్వర్యంలో "ఉన్నత విద్యలో అభివృద్ధి చెందుతున్న ఆవిష్కరణలు మరియు సమకాలీన పురోగతి" అను అంశం పైన రేపు జాతీయ సదస్సు నిర్వహించబడుతుందని కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం తెలియజేశారు. ఈ సదస్సు ప్రారంభ సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి ఉపాధ్యక్షులు ఆచార్య ఇటిక్యాల పురుషోత్తం, కీలకోపన్యాసకులుగా హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ సిహెచ్. కృష్ణారెడ్డి , అతిథులుగా మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య కె. అంజిరెడ్డి, ఉస్మానియా విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య జి.నరేష్ రెడ్డి, ప్రత్యేక అతిథులుగా స్థానిక సర్పంచ్ గరికపాటి సత్యనారాయణ, ఈడెం రాధా శ్రీనివాస్,టి. మురళీధర్ వస్తున్నారని అన్నారు. అదేవిధంగా ముగింపు సమావేశానికి ముఖ్యఅతిథిగా తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు, ప్రముఖకవి డాక్టర్ ఏనుగు నరసింహారెడ్డి ఐఏఎస్, అతిథులుగా కేరళ కేంద్రీయ విశ్వవిద్యాలయం అధ్యాపకులు డాక్టర్ బందారు రామకృష్ణ, జేఎన్టీయూ అధ్యాపకులు డాక్టర్ సురేష్ శ్రీపాద, చేవెళ్ల డిగ్రీ కళాశాల అధ్యాపకులు ప్రొఫెసర్ డాక్టర్ ఎస్ఏ మాలిక్ తదితరులు వస్తున్నారని తెలియజేశారు. అంతేకాకుండా ఈ సదస్సులో ఆయా విశ్వవిద్యాలయాల, డిగ్రీ కళాశాలల అధ్యాపకులు సుమారు 40 మంది పాల్గొని పత్ర సమర్పణ చేస్తారని తెలియజేశారు. సదస్సు నిర్వాహకులు డాక్టర్ పి. వెంకటేశ్వరరావు, డాక్టర్ జె. చిన్నబాబు, డాక్టర్ జి. సునీత మాట్లాడుతూ ఒకరోజు జరిగే ఈ జాతీయ సదస్సులో పరిసర ప్రాంతాలలోని ఆయా కళాశాలల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

## పోలగోని భాస్కర్ గౌడ్ జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 30:** సోమవారం రోజున హైదరాబాదులో పెద్ద అంబర్పేట్ ఇసుక లారీల అడ్డ అధ్యక్షుడు పోలగోని భాస్కర్ గౌడ్ గారి జన్మదినోత్సవ వేడుకల్లో పాల్గొన్న మునుగోడు కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్, పెద్ద అంబర్పేట్ యూనియన్ ఉపాధ్యక్షుడు బలరాం గౌడ్, జాజుల ప్రభాకర్, పాలకూరల మహేష్, మునుకుంట్ల శ్రీనివాస్ గౌడ్, మునుకుంట్ల నరసింహ గౌడ్, మునుగుంట్ల శేఖర్, పెద్దగోని నరసింహ గౌడ్, రేలగడ్డ రవీందర్, సురిగి రమేష్, కొండూరు వెంకన్న, మునుకుంట్ల కుమార్ తదితరులు పాల్గొన్నారు

# యాదగిరిగుట్ట సమగ్ర అభివృద్ధికి కృషి

**- యాదగిరిగుట్ట మున్సిపాలిటీ బడ్జెట్ ప్రత్యేక సమావేశంలో మున్సిపల్ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్**

**యాదగిరిగుట్ట , మార్చి 30 ( వెలుతురు )** యాదగిరిగుట్ట మున్సిపాలిటీని అన్ని రంగాలలో సమగ్రంగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తున్నామని యాదగిరిగుట్ట మున్సిపాలిటీ చైర్పర్సన్ గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ అన్నారు సోమవారం యాదగిరిగుట్ట మున్సిపల్ సమావేశ మందిరంలో బడ్జెట్ ప్రత్యేక సమావేశాన్ని సుదీర్ఘంగా నిర్వహించారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యాదగిరిగుట్ట మున్సిపాలిటీలో సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ ప్రజలకు అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తున్నామని అన్నారు ఈ మొట్టమొదటి బడ్జెట్ సమావేశంలో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు మున్సిపాలిటీ పరిధిలోని వివిధ రంగాలకు అవసరమయ్యే ఖర్చులు ఫోను మరింత పెద్ద ఎత్తున మున్సిపాలిటీకి ఆదాయం పెంచుకునేందుకు పలు కీలక తీర్మానాలు చేశామని తెలిపారు. దేవస్థానం నుండి రావాల్సిన 30% గ్రాంట్ సాధించేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ మేరకు ఒక తీర్మానం చేశామని త్వరలో ప్రభుత్వ విప్ ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ను కలిసి ఈ మేరకు దేవస్థానం నుండి రావాల్సిన 30% గ్రాంట్ విషయమై వివరిస్తామని తెలిపారు . ఎమ్మెల్యే సహకారంతో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రిని ఇతర ప్రభుత్వ పెద్దలను కలిసి దేవస్థానం నుండి 30% గ్రాంట్ ను సాధిస్తామని తెలిపారు . దీనివల్ల యాదగిరిగుట్ట మున్సిపాలిటీకి అనేక విధాలుగా లబ్ది చేకూరుతుందని అన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని అనేక సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా వివిధ శాఖలకు సంబంధించిన బడ్జెట్ వివరాలను సభ్యులకు వివరించి అందరి అభిప్రాయాలతో పలు తీర్మానాలను ప్రవేశపెట్టి ఆమోదించారు. కాగా మున్సిపల్ చైర్ పర్సన్ శ్రీమతి గుండ్లపల్లి వాణి భరత్ గౌడ్ గారి అధ్యక్షతన 2026-27 సంవత్సరం యొక్క బడ్జెట్ అంచనా సమావేశం అనురాగ్ జయంతి, జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి సమీక్ష నిర్వహించారు. జనరల్ ఫండ్ ఆదాయం 6.83 కోట్లు, ప్రభుత్వ గ్రాంట్లు ద్వారా ఆదాయం 18.90కోట్లు మొత్తం ఆదాయం: 25.73 కోట్లు. పారిశుద్ధ్య నిర్వహణ 1.16, గ్రీన్ బడ్జెట్ 0.57 కోట్లు, వాటర్ సప్లై నిర్వహణ 0.46 కోట్లు, పరిపాలన ఖర్చు 0.52 కోట్లు, ప్రజా సౌకర్యాలు 0.23 కోట్లు, వార్డు వారీగా అభివృద్ధి ఖర్చు 0.28 కోట్లు మరియు ఇతర ఖర్చులు మొత్తం ఖర్చు 6.60 కోట్లకు బడ్జెట్ ను కమిటీ ముందు ప్రవేశపెట్టగా, అట్టి బడ్జెట్ ను హాజరు అయిన సభ్యులు అందరూ ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో వైస్ చైర్మెన్ బరిగే రమ్య, కౌన్సిలర్స్ బోడ రాధ , బూడిద మధు , కాటబత్తిని స్వప్న, బిట్టు సరోజ , కర్రె మాధవి , పెలిమెల్లి లావణ్య , పేరబోయిన సత్యనారాయణ, సాదునేని ధనలక్ష్మి , ముక్కెర్ల మల్లేష్ , బబ్బూరి శ్రీధర్ కమీషనర్ యం. లింగస్వామి యు.శారద, కార్యాలయ మేనేజర్ , పి.సురేందర్, శానిటరీ ఇన్ స్పెక్టర్ యల్. రవీందర్, సీనియర్ అసిస్టెంట్ కె. రజిని, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.




## ఉపాధి హామీలో రెండు నెలల పెండింగ్ బిల్లులు వెంటనే చెల్లించాలి

**- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య**



**నార్కట్ పల్లి వెలుతురు మార్చి 30:** నార్కట్‌పల్లి మండలం లింగోటం గ్రామంలో సోమవారం నిర్వహిస్తున్న ఉపాధి హామీ పనులను తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి నారి ఐలయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్మికులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ కింద పనిచేస్తున్న కూలీలకు రెండు నెలలుగా వేతనాలు చెల్లించలేదని, వెంటనే బకాయిలను విడుదల చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. చట్టం ప్రకారం వారం వారం వేతనాలు చెల్లించాల్సి ఉండగా, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం అమలు లోకి వచ్చిన తరువాత సకాలంలో చెల్లింపులు జరగడం లేదని విమర్శించారు. కేంద్ర బడ్జెట్‌లో ఉపాధి హామీకి తగిన నిధులు కేటాయించకపోవడం వల్ల కార్మికులు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. పెండింగ్ వేతనాలు పెరిగిపోవడంతో గ్రామీణ కార్మికుల జీవనం కష్టమైందన్నారు. పనిచోట్ల రోజుకు రెండు సార్లు ఫోటోలు తీయాలనే నిబంధన వల్ల కార్మికులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయని, ఈ విధానాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఉపాధి హామీ నిధుల విషయంలో కేంద్రం 60 శాతం, రాష్ట్రం 40 శాతం భాగస్వామ్యం విధానాన్ని అమలు చేయడం వల్ల రాష్ట్రాలపై భారం పెరుగుతోందని పేర్కొన్నారు. గతంలో మొత్తం నిధులను కేంద్రం అందించేదని, అదే విధానం కొనసాగించాలని కోరారు. పనిచోట్ల తాగునీరు, వైద్య సదుపాయాలు వంటి ప్రాథమిక సౌకర్యాలను వెంటనే కల్పించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉపాధి హామీ చట్టంలో మార్పుల పేరుతో తీసుకొస్తున్న కొత్త బిల్లులను ఉపసంహరించుకునే వరకు పోరాటం కొనసాగించాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా సహాయ కార్యదర్శి చెరుకు పెద్దలు, మండల కార్యదర్శి దండు నాగరాజు, గ్రామ అధ్యక్షులు మంగ దొడ్ల పద్మమ్మ, ఉపాధ్యక్షులు కుంభగోని అండమ్మ, కార్యదర్శి డెంకెల పద్మ తదితరులు పాల్గొన్నారు.

## ఉజ్జ్వలప్రజ్వలల 'ఓణి' వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ చిలువేరు ఆశీర్వాదం..

**- మానుకోట మున్సిపల్ వైస్ చైర్మన్ సూర్నపు, కామ సంజీవఆశీస్సులు..**

**- వి ఆర్ ఎన్ గార్డెన్స్‌లో అంగరంగ వైభవంగా నూతన వస్త్రఫల పుష్పాలంకరణ..**

**- అతిథులను సాదరంగా ఆహ్వానించి సత్కరించిన పిల్లి సుధాకర్‌రామశ్రీ దంపతులు..**



**మహబూబాబాద్ వెలుతురు మార్చి 30:** మహబూబాబాద్ పట్టణంలోని వీఆర్ఎన్ (వి ఆర్ ఎన్) గార్డెన్స్ శనివారం ఒక అపురూప వేడుకకు వేదికైంది. పిల్లి సుధాకర్‌రామశ్రీ దంపతుల గారాల పట్టీలు ఉజ్జ్వల, ప్రజ్వలల నూతన వస్త్రాలంకరణ (ఓణి వేడుక) మరియు ఫల పుష్పాలంకరణ కార్యక్రమం అత్యంత వైభవోపేతంగా, కన్నులపండువగా జరిగింది. పచ్చని తోరణాలు, రంగురంగుల విద్యుత్ దీపాల అలంకరణలతో గార్డెన్స్ ప్రాంగణం కళకళలాడింది.

**ముఖ్య అతిథి సందడి:**

ఈ వేడుకకు గోపా డివిజన్ అధ్యక్షులు సమ్మి గౌడ్ ఫౌండేషన్ అధినేత సమ్మయ్య గౌడ్ ముఖ్యఅతిథిగా విచ్చేశారు.. నూతన వస్త్రాలంకరణలో మెరిసిపోతున్న బాలికలు ఉజ్జ్వల, ప్రజ్వలలను ఆయన ప్రత్యేకంగా ఆశీర్వదించి, వారి భవిష్యత్తు ఉజ్వలంగా ఉండాలని ఆకాంక్షించారు. ఇంకా ఈ వేడుకకు అతిరథ మహారదులు, రాజకీయ ప్రముఖులు, మాజీ శాసనసభ్యులు, మాజీ ఎంపీ లు, వివిధ కులసంఘాల పెద్దలు హాజరుకాగా నిర్వాహకులు పిల్లి సుధాకర్‌రామశ్రీ దంపతులు ఆయనకు సాదర స్వాగతం పలికి, ఘనంగా సత్కరించారు.

**బంధుమిత్రుల కోలాహలం:**

ఈ వేడుకకు జిల్లా నలుమూలల నుండి కుటుంబ సభ్యులు, ఆత్మీయులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. చిన్నారులకు శుభాకాంక్షలు తెలుపుతూ, పెద్దలు అక్షింతలు వేసి దీవించారు. వచ్చిన అతిథులందరికీ నిర్వాహకులు ఎటువంటి లోటు రాకుండా పసందైన విందు ఏర్పాటు చేశారు. సంగీతం, నృత్యాలు, బంధువుల పలకరింపులతో ఆ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని తలపించింది. తమ ఆహ్వానాన్ని మన్నించి విచ్చేసిన ప్రతి ఒక్కరికీ సుధాకర్ దంపతులు కృతజ్ఞతలు తెలియజేశారు

# రైతుల సేవలో యాదగిరిగుట్ట పిఎసిఎస్

**- సీఈవో గజం ఆంజనేయులు**



**యాదగిరిగుట్ట , మార్చి 30 ( వెలుతురు )** రైతుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ వారికి అండగా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం రైతుల సేవలో ముందుకు సాగుతుందని యాదగిరిగుట్ట పిఎసిఎస్ సీఈవో గజం ఆంజనేయులు అన్నారు. సోమవారం యాదగిరిగుట్ట పిఎసిఎస్ కార్యాలయం ఆవరణలో మహాజన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా అఫీషియల్ పర్సన్ ఇన్చార్జి బి శ్రీనివాస్ తో కలిసి సీఈవో గజం ఆంజనేయులు మాట్లాడారు. రైతులకు సకాలంలో యూరియా కాంప్లెక్స్ ఎరువులు పొటాష్ తదితర అన్ని రకాల వ్యవసాయ మందులు అందిస్తున్నామని అన్నారు ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీ ధరతోనే రైతులకు అన్ని రకాల ఎరువులు మందుల బస్తాలు అందజేస్తున్నామని ఎలాంటి లాభాపెక్ష లేకుండా కేవలం సేవాదృక్పథంతోనే తాము కృషి చేస్తున్నామని అన్నారు . యాదగిరిగుట్ట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కింద 14 గ్రామాలు ఉన్నాయని 2615 సభ్యులు ఉన్నారని తెలిపారు. 160 మందికి వ్యక్తిగత రుణాలు అందించమని చెప్పారు. దీర్ఘకాలిక స్వల్పకాలిక రుణాలు పెద్ద ఎత్తున అందిస్తూ రైతుల శ్రేయస్సు కోసం కృషి చేస్తున్నామని అన్నారు . కంటం గూడెంలో పిఎసిఎస్ ఆధ్వర్యంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని అక్కడి రైతులు కోరారని ఈ విషయాన్ని ఉన్నతాధి కారులకు తెలియజేస్తామని చెప్పారు యాదగిరిగుట్ట పిఎసిఎస్ పరిధిలో కాచారం మాసాయిపేట యాదగిరిగుట్ట సేల్స్ పాయింట్స్ ఏర్పాటు చేశామని చెప్పారు. రైతులకు ఎప్పుడు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పకడ్బందీగా చర్యలు తీసుకుంటున్నామని అన్నారు ఈ సందర్భంగా పలువురు రైతులు తమకు తలెత్తుతున్న సమస్యలను తెలియజేయగా వాటిని పరిష్కరించే దిశగా కృషి చేస్తామని చెప్పారు ఈ సందర్భంగా మైలార్ గూడెం సర్పంచ్ మారెడ్డి కొండల్ రెడ్డి , మాసాయిపేట సర్పంచ్ కళ్లెం జహంగీర్ గౌడ్, బహుపేట సర్పంచ్ కవిడే మహేందర్ తదితరులు రైతులకు తలెత్తుతున్న ఇబ్బందులను వారిని ఆదుకునేందుకు పలు సూచనలు చేశారు. వాటిని అన్ని విధాలుగా పరిశీలన చేసి వాటిని అమలు చేసే ప్రయత్నం చేస్తామని ఉన్నతాధికారుల దృష్టికి వాటిని తీసుకెళ్తామని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైతులు రైతు సంఘం నాయకులు మాటూరి బాలయ్య గౌడ్ , వాసు , దండ బోయిన వీరేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఉద్యమకారులు ముందస్తు అరెస్టు




**రామన్నపేట వెలుతురు న్యూస్ మార్చి 30:** ఈనెల 31న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం వాయిదా పడినది. అయినా పోలీసులు అరెస్టు చేశారు. ఉద్యమకారుల ఫోరం పిలుపు లేకున్న మమ్ములను అరెస్టు చేయడం సరికాదన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మైనార్టీ సెల్ షేక్ చాంద్ మాట్లాడుతూ అన్ని సంఘాల నాయకులు ఒక తాటిపై వచ్చి పిలుపు ఇవ్వాలని కోరారు. ఇప్పటికైనా రాజకీయాలకు అతీతంగా తెలంగాణ ఉద్యమకారులు పోరాటం చేయాలని, ప్రతి ఒక్క నిక్కాస ఉద్యమకారుడు మన డిమాండ్ నెరవేర్చే వరకు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ఉద్యమకారుల ప్రధానమైన డిమాండ్. రాష్ట్ర ప్రభుత్వం కమిటీ వేసి నిజమైన ఉద్యమకారుల గుర్తించి వారికి గుర్తింపు కార్డులు ఇవ్వాలి.ప్రతి ఉద్యమకారుడికి 250 చదరపు గజాల స్థలం 25 వేల రూపాయల పింఛన్ ఇవ్వాలి. తెలంగాణ ఉద్యమంలో పాల్గొని అమరులైన కుటుంబాలను, ఆదుకోవాలి. తెలంగాణ ఉద్యమకారులకు 10 లక్షల రూపాయల మెడికల్ సౌకర్యం కల్పించాలి.ఉద్యమకారుల ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి పదివేల కోట్ల రూపాయలతో ఉద్యమకారుల ఆదుకోవాలి.ఉద్యమకారులపై ఉన్న కేసులను అన్ని ఎత్తివేయాలి.ఇట్లు షేక్ చాంద్ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మైనార్టీ సెల్ అధ్యక్షులు నోముల శంకర్ తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రామన్నపేట మండల అధ్యక్షులు ఈ కార్యక్రమంలో ఉద్యమకారుల ఫోరం మండల ఉపాధ్యక్షులు బొడ్డుపల్లి లింగయ్య.ఉద్యమ నాయకులు ఎండి ఇమామ్ సాబ్. బోగారం మాజీ ఉపసర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

## రామలింగేశ్వర స్వామి ఆలయానికి ఏసీ బహుకరణ



**మోత్కూర్, మార్చి 30,(వెలుతురు న్యూస్ ):** మోత్కూర్ శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయానికి సోమవారం నాడు మోత్కూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీమతి నూనెముంతల విమలా వెంకటేశ్వర్లు దంపతులు రూ " 50,000 /- విలువైన ఏసీ బహుకరించడం జరిగింది. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకొని గర్భాలయంలో ఏసీ ఏర్పాటు కు ముందుకొచ్చిన మార్కెట్ కమిటీ చైర్మన్ నూనెముంతల విమలా వెంకటేశ్వర్లు దంపతులను ఆలయ కమిటీ చైర్మన్ గుండగోని రామ చంద్రు గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కార్యదర్శి అవిశెట్టి అవిలుమల్లు, ఆలయ కమిటీ ప్రతినిధులు బుర్ర యాదయ్య, పట్వారి అంజయ్య, బయ్యని రాజు, బుర్ర నర్సయ్య,బందెల రవి,ఉయ్యాల అంజయ్య, బొల్లేపల్లి సీతయ్య, బుర్ర కృష్ణ, తొట్ల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఆటో బోల్తా: తల్లీ కుమారుడు మృతి

**కామారెడ్డి,మార్చి30( వెలుతురు):** కామారెడ్డి జిల్లా తాడ్వాయి మండల శివారులో ఘోర ప్రమాదం జరిగింది. ఆటో బోల్తాపడిన ఘటనలో తల్లీకుమారుడు మృతి చెందగా.. 11 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను కామారెడ్డి ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఓ వేడుకకు వెళు ్తుండగా ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో గ్రామంలో విషాదం అలముకుంది.

## మోత్కూర్ నియోజకవర్గ కేంద్రం ఏర్పాటు చేయాలని గ్రీవిన్స్ లో కలెక్టర్ ,అడిషనల్ కలెక్టర్ లకు వినతి



**మోత్కూర్, మార్చి 30, (వెలుతురు న్యూస్ ):** రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన లో మోత్కూర్ ను నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టరేట్ లో నిర్వహించిన గ్రీవిన్స్ లో కలెక్టర్ అనురాగ్ జయంతి, అడిషనల్ కలెక్టర్ వెంకారెడ్డి గార్లకు నియోజకవర్గ సాధన సమితి ప్రతినిధులు స్వయంగా అందజేశారు.మోత్కూర్, అడ్డగుడూర్, ఆత్మకూరు (ఎం) ,గుండాల మండలాల తో పాటు మరో మండలాన్ని కలుపుతూ మోత్కూర్ నియోజకవర్గ ఏర్పాటు చేయాలని విన్నవించారు.పాత రామన్నపేట నియోజకవర్గంలో ని మండలాలు గతంలో చేసిన నియోజకవర్గాల పునర్విభజనలో ఆయా మండలాలు చిన్నాభిన్నం అయ్యాయని, దీంతో నాలుగు మండలాలలో అభివృద్ధికి నోచుకోలేదన్నారు.ఇప్పటికే మోత్కూర్ రెవెన్యూ డివిజన్ గా ఏర్పాటు చేయాలి.ఇక్కడి ప్రజలు కోర్ట్ పనుల కోసం ,పోస్ట్ మార్టం కోసం కనీసం బస్సు సౌకర్యం కూడా లేని రామన్నపేట కి సుమారు 35 కి.మీ వెళ్లాల్సివస్తుంది. ఇటు రెవెన్యూ పనుల నిమిత్తం సుమారు 40 కి.మీ దూరంలో ఉన్న భువనగిరి కి వెళ్లాల్సి వస్తుంది. గుండాల,ఆత్మకూర్ మండలాల ప్రజలు ఆలేరు,భువనగిరి కోర్టు లకు ,పోస్ట్ మార్టం కోసం భువనగిరి ఏరియా ఆసుపత్రికి వెళు_న్నారు.దీంతో ఇక్కడి ప్రజల సమయం వృధా కావడంతో పాటు,అదనంగా డబ్బులు వెచ్చించాల్సి వస్తుంది. మోత్కూర్ లోనే రెవెన్యూ డివిజన్, కోర్ట్,పోస్ట్ మార్టం,30 పడకల ఆసుపత్రి ఏర్పాటు చేస్తే పరిపాలన సౌకర్యవంతంగా మారుతుందని విన్నవించారు .కావున రాబోయే అసెంబ్లీ నియోజకవర్గాల పునర్విభజన లో మోత్కూర్ ని నియోజకవర్గ కేంద్రంగా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం, అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సాధన సమితి ప్రతినిధులు గుజ్జ సోమనర్సయ్య, ధబ్బేటి సోంబాబు లు ఉన్నారు.

## ధర్మ పరిరక్షణలో అవధూత గిరి సేవలు ప్రశంసనీయం

**- మాధవానంద సరస్వతి...**

**- బర్ధిపూర్ శ్రీ దత్తగిరి మహారాజ్ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు...**

**- పీఠాధిపతికి ఘన సన్మానం...**





**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:** సనాతన ధర్మ పరిరక్షణ, విశ్వ మానవ ధర్మ ప్రచారం, పేదలకు వైదిక విద్య అందించడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అవధూత గిరి మహారాజ్ సేవలు అభినందనీయమని రంగంపేట (బసవకళ్యాణ్) పీఠాధిపతి మాధవానంద సరస్వతి తెలిపారు. సోమవారం సంగారెడ్డి జిల్లా ఝరాసంగం మండలంలోని బర్ధిపూర్ శ్రీ దత్త క్షేత్రంను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆశ్రమానికి వచ్చిన మాధవానంద సరస్వతికి ఆలయ రాజగోపురం వద్ద శ్రీపాద స్వామి వైదిక పాఠశాల విద్యార్థులు వేదమంత్రాలు, మంగళ వాయిద్యాలతో ఘనంగా స్వాగతం పలికారు. తరువాత జ్యోతిర్లింగాలు, దత్తాత్రేయ స్వామి మందిరం, ఆదిశంకరాచార్యుల అద్దాల మండపం, పంచవృక్షాలు, గోమందిరం తదితర దేవాలయాలను ఆయన దర్శించారు. అనంతరం ఆశ్రమ పీఠాధిపతి అవధూత గిరి మహారాజ్‌ను మాధవానంద సరస్వతి పూలమాల, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాతృశ్రీ అనసూయ మాత, ఆనందగిరి మాత, నందిని గిరి, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మల్గి మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి అక్రమ అరెస్ట్

**- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా మధ్యలోనే అదుపులోకి తీసుకున్న పోలీసులు...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:**




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండల పరిధిలోని మల్గి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ జట్గొండ మారుతిని పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినట్లు స్థానిక నాయకులు ఆరోపించారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం నిర్వహించనున్న అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి బయలుదేరిన సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. అసెంబ్లీ ముట్టడికి వెళ్లేందుకు బయలుదేరిన జట్గొండ మారుతిని మధ్య మార్గంలోనే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. అనంతరం ఆయనను హదనూర్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ జట్గొండ మారుతి మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు గడిచినా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పటికీ చెల్లించకుండా కాలయాపన చేస్తోందని మండిపడ్డారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు అప్పులు చేసి పూర్తి చేసిన మాజీ సర్పంచులకు మూడు సంవత్సరాలు గడిచినా బిల్లులు ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బిల్లులు చెల్లించలేక ప్రభుత్వమే పోలీసులను, అధికారులను ముందుకు నెట్టి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందని విమర్శించారు. ఇలా అక్రమ అరెస్టులు చేస్తూ ఎంతకాలం ప్రజలను మోసం చేస్తారని ప్రశ్నించారు. పెండింగ్‌లో ఉన్న మాజీ సర్పంచుల బిల్లులను తక్షణమే చెల్లించాలని ప్రభుత్వాన్ని జట్గొండ మారుతి డిమాండ్ చేశారు. ఈ అరెస్టును తీవ్రంగా ఖండిస్తున్నట్లు మాజీ సర్పంచులు, స్థానిక నాయకులు తెలిపారు.

## కోహిర్ ప్రభుత్వ ఆసుపత్రి సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు వినతి

**- అందుబాటులో లేని డాక్టర్లు...**

**- పోస్ట్‌మార్టం విభాగం లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలు...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:** సంగారెడ్డి జిల్లా కోహిర్ మండల ప్రజలు ఎదుర్కొంటున్న ఆసుపత్రి సమస్యలపై కోహిర్‌కు చెందిన ఫిర్దౌస్ సర్వార్ జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందజేసి కోహిర్ ప్రభుత్వ ఆసుపత్రిలో ఉన్న సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోహిర్ ప్రభుత్వం ఆసుపత్రిలో అనేక సమస్యలు నెలకొన్నాయని తెలిపారు. ఆసుపత్రిలో పోస్ట్‌మార్టం విభాగం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. డాక్టర్లు చాలా సమయాల్లో ఆసుపత్రిలో అందుబాటులో ఉండడం లేదని, రోగులతో సరైన విధంగా ప్రవర్తించడం లేదని ఆరోపించారు. అదేవిధంగా ఆసుపత్రిలో ల్యాబ్ సదుపాయం కూడా సరిగా పనిచేయడం లేదని, ఏ రోగంతో వెళ్లినా ఒకే విధమైన టాబ్లెట్ ఇవ్వడం జరుగుతోందని వినతి పత్రంలో తెలిపారు. కోహిర్ మండల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌ను ఫిర్దౌస్ సర్వార్ కోరారు.

## అంగన్వాడి స్కూల్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి...

**- రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్..**



**కరీంనగర్ వెలుతురు మార్చి 30:** అంగన్వాడీ స్కూల్ లలో అందే సేవలను వినియోగించుకోవాలని కరీంనగర్ రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ మహేశ్వర్ సూచించారు. ప్రజా పాలనా ప్రగతి ప్రణాళిక లో భాగంగా కోతిరాంపూర్ అంగన్వాడీ సెంటర్లో ప్రీ స్కూల్ మేళా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధి ఆర్డీవో మహేశ్వర్ జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, సిడిపిఓ సబితా , 39 డివిజన్ కార్పొరేటర్ ఉమాసం గణేష్, కార్పొరేటర్ పాడిశెట్టి వసంతలక్ష్మి భూమయ్య లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీవో మహేశ్వర్ మాట్లాడుతూ ప్రైవేట్ స్కూల్కు దీటుగా అంగన్వాడీ స్కూల్ లు గొప్పగా పనిచేస్తున్నాయని, ఆట పాటలతో విద్య ను బోధించడం జరుగుతుందని చెప్పారు. డి డబ్ల్యు ఓ సరస్వతి మాట్లాడుతూ గర్భవతులు , బాలింతలు అంగన్వాడీ సెంటర్ లొ లభించే పౌష్టికహారం బాలామృతం తీసుకోవాలని సూచించారు సీడీపీఓ సబితా మాట్లాడుతూ ప్రీ స్కూల్ ప్రాధాన్యత, మొదటి 1000 రోజుల లో తీసుకోవాల్సిన జాగ్రత్త, పోషకహారం గురుంచి తల్లులకు ఈ సందర్భంగా అవగాహన కల్పించారు .పి & జి ప్రతం మాస్టర్ ట్రయినర్ రాజేందర్ పిల్లలకు ఐదు అభివృద్ధి ల పైన ఆటలు ఆడించారు. దాదాపు 200 మంది పిల్లలు ఆటలు, పాటలు, కథ, సంభాషణ, పూర్వ గణిత భావనలు తల్లి తండ్రులను మంత్ర ముగ్ధులను చేసాయి. భాష, మేధా, సాంఘిక అభివృద్ధి, సృజనత్మాకత గురించి పిల్లలకు వివరిస్తూ వారికీ రిపోర్ట్ కార్డు సీడీపీఓ సబితా సూపెర్వైసోర్ అరుణ నిర్మల రేణుక చేతుల మీద అందించడం జరిగింది. ప్రీస్కూల్ వస్తువుల ప్రదర్శన అందరినీ ఆకట్టుకుంది ఈ కార్యక్రమం లో బి సి సతీష్ ,టీచర్స్ స్వరూప శ్యామల, సరిత ,పిల్లలు తల్లిదండ్రులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## జనగణన2027 తొలి విడతలో భాగంగా ఇండ్ల గణన ప్రక్రియను సమర్ధవంతంగా నిర్వహించాలి



**కామారెడ్డి జిల్లా ప్రతినిధి (వెలుతురు) మార్చి 30**



జనగణన– 2027 తొలి విడతలో బాగంగా ఇండ్ల ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలని డైరెక్టర్ ఆఫ్ సెన్సస్ భారతి హోళీకేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి అన్ని జిల్లాల కలెక్టర్లు, జిల్లా జనగణన అధికారులతో జనగణన, ఇండ్ల గణన విధానాలు, మ్యాప్ తయారీ, ఎన్యుమరేటర్లు సూపర్వైజర్ల నియామకంపై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, జనగణన కార్యక్రమంలో ఇండ్ల గణనను కచ్చితంగా నిర్వహించాల్సిన అవసరం ఉందని తెలిపారు. ప్రక్రియ నిర్వహణలో సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా డిజిటల్ పద్ధతిలో గణన చేపట్టాలని సూచించారు. దేశంలో తొలిసారిగా జనగణన పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడుతోందని పేర్కొన్నారు. మే 11 నుండి జూన్ 9 వరకు ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, ఈ సమయంలో కుటుంబాల వివరాలను పూర్తిగా నమోదు చేయనున్నట్లు తెలిపారు. ముందస్తు సన్నాహక పనులు వెంటనే ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. యాప్ నిర్వహణలో సాంకేతిక సమస్యలు తలెత్తినట్లయితే వెంటనే పరిష్కరించాలని సూచించారు. మండలాల వారీగా ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం చేపట్టి, ఎన్యుమరేటర్ బ్లాక్/హౌస్ లిస్టింగ్ బ్లాక్‌లను రూపొందించాలని, క్షేత్రస్థాయిలో సమర్థవంతంగా విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ మాట్లాడుతూ, ఇప్పటికే సంబంధిత అధికారులకు శిక్షణ ఇవ్వడం జరుగుతున్నదని తెలిపారు. జిల్లాలో జనగణన2027 తొలి విడత ఇండ్ల గణనను అధికారులు, సిబ్బంది సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తామని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా ప్రక్రియను పూర్తి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విక్టర్, మధుమోహన్, సబ్ కలెక్టర్ కిరణ్మయి, ముఖ్య ప్రణాళిక అధికారి రఘునందన్ రావు , సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## జహీరాబాద్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు తట్టు నారాయణ అక్రమ అరెస్ట్

**- మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల కోసం అసెంబ్లీ ముట్టడికి వెళ్తుండగా ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకున్న పోలీసులు...**



**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు తట్టు నారాయణను పోలీసులు అక్రమంగా అరెస్ట్ చేసినట్లు పార్టీ నాయకులు ఆరోపించారు. మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లుల చెల్లింపుల కోసం అసెంబ్లీ ముట్టడికి బయలుదేరుతున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. జహీరాబాద్ మండలానికి చెందిన తట్టు నారాయణతో పాటు మాజీ సర్పంచులు చందర్ చౌహన్, చిన్నా రెడ్డి, కరుణ్ రాజ్‌లను ఈ రోజు ఉదయం వారి ఇళ్ల వద్దే పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. అనంతరం వారిని జహీరాబాద్ రూరల్ పోలీస్ స్టేషన్ కు తరలించినట్లు పార్టీ నాయకులు పేర్కొన్నారు. ఈ సందర్భంగా తట్టు నారాయణ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తయినా మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను ఇప్పటికీ చెల్లించకుండా కాలయాపన చేస్తోందని ఆరోపించారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు అప్పులు చేసి పూర్తి చేసిన మాజీ సర్పంచులకు మూడు సంవత్సరాలు గడిచినా బిల్లులు ఇవ్వడం లేదని మండిపడ్డారు. బిల్లులు చెల్లించలేక ప్రభుత్వమే పోలీసులను, అధికారులను ముందుకు నెట్టి నాయకులను అక్రమంగా అరెస్ట్ చేస్తోందని ఆయన విమర్శించారు. ప్రజలకు సేవ చేయాలనే ఉద్దేశంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసిన మాజీ సర్పంచులు ఇప్పుడు అప్పుల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి మాజీ సర్పంచుల పెండింగ్ బిల్లులను తక్షణమే చెల్లించాలని, లేకపోతే రాబోయే రోజుల్లో రాష్ట్రవ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని తట్టు నారాయణ హెచ్చరించారు. ఈ అరెస్టులను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పార్టీ నాయకులు తెలిపారు.

## క్రికెట్ బెట్టింగ్‌లకు యువత దూరంగా ఉండాలి

**- యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న అక్రమ జూదాలపై పోలీసుల హెచ్చరిక....**

**- పట్టణ ఎస్.ఐ. వినయ్ కుమార్...**

**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:**




క్రికెట్ బెట్టింగ్‌లు మరియు ఇతర అక్రమ జూదాలకు దూరంగా ఉండాలని యువత, విద్యార్థులకు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణ ఎస్ ఐ కె. వినయ్ కుమార్ సూచించారు. యువత సులభంగా డబ్బు సంపాదించాలనే ఆశతో బెట్టింగ్‌ల వైపు ఆకర్షితులవుతున్నారని, ఇది వారి భవిష్యత్తును పూర్తిగా నాశనం చేసే ప్రమాదం ఉందని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిదండ్రులు ఎంతో కష్టపడి సంపాదించిన డబ్బును బెట్టింగ్‌లకు ఖర్చు చేయవద్దని సూచించారు. కష్టపడకుండా డబ్బు సంపాదించాలనే ఆలోచన యువతను అప్పుల ఊబిలోకి నెడుతుందని, ఒకసారి బెట్టింగ్ అలవాటు పడితే దానిలో నుంచి బయటపడటం చాలా కష్టమని ఆయన అన్నారు. క్రికెట్‌ను క్రీడగా మాత్రమే చూడాలని, దానిని బెట్టింగ్‌గా మార్చి జీవితాన్ని ప్రమాదంలో పెట్టుకోవద్దని ఆయన తెలిపారు. బెట్టింగ్ వంటి అక్రమ కార్యకలాపాల్లో పాల్గొంటే పోలీసు కేసులు నమోదయ్యే అవకాశముందని, అలా జరిగితే భవిష్యత్తులో ప్రభుత్వ ఉద్యోగాలు, పాస్‌పోర్ట్ వెరిఫికేషన్ వంటి విషయాల్లో ఇబ్బందులు ఎదురవుతాయని హెచ్చరించారు. అంతేకాకుండా బెట్టింగ్‌లో డబ్బు కోల్పోయిన వారు మానసిక ఒత్తిడికి గురవుతున్నారని, కొంతమంది ఆత్మహత్యల వంటి దారుణ నిర్ణయాలు కూడా తీసుకుంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాంటి పరిస్థితులు తలెత్తకుండా యువత ముందుగానే అప్రమత్తంగా ఉండాలని ఆయన కోరారు. ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ లేదా అక్రమ నగదు లావాదేవీలు జరుగుతున్నట్లు సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 కు లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఆయన పేర్కొన్నారు. "నేటి యువతే రేపటి దేశ భవిష్యత్తు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని గడపాలి" అని ఎస్.ఐ. వినయ్ కుమార్ పేర్కొన్నారు.

## పటాన్‌చెరులో ప్రభుత్వ భూమి ఆక్రమణలపై ఎంఆర్‌ఓకు కాంగ్రెస్ నాయకుల ఫిర్యాదు



**పటాన్‌చెరు వెలుతురు మార్చి 30:**



పటాన్‌చెరు మండలం పరిధిలోని పోచారం గ్రామ సర్వే నెంబర్ 62లో జరుగుతున్న ప్రభుత్వ భూమి ఆక్రమణలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సుమారు 42 ఎకరాల విస్తీర్ణం కలిగిన ఈ ప్రభుత్వ స్థలంలో కొందరు అక్రమంగా ఇళ్లు, ఇతర నిర్మాణాలు చేపట్టారని ఆరోపిస్తూ సోమవారం నాడు కాంగ్రెస్ నాయకులు ఎంఆర్‌ఓకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. సర్వే నెంబర్ 62తో పాటు నక్షా బాట పోచారం గ్రామం, రామేశ్వరబండ, ఇంద్రేశం మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 453 మధ్య ఉన్న పౌనదిని సమగ్రంగా సర్వే చేయాలని వారు డిమాండ్ చేశారు. అక్రమ నిర్మాణాల వల్ల విలువైన ప్రభుత్వ భూమి కబ్జాకు గురవుతోందని పేర్కొంటూ, తక్షణమే అధికారులు స్పందించి హద్దులు గుర్తించి రక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ప్రభుత్వ భూములను కాపాడటంతో పాటు చట్టవిరుద్ధంగా ఆక్రమణలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ నాయకులు అధికారులను విజ్ఞప్తి చేశారు.

## జంతువులకు లెక్కలు ఉంటాయి కానీ బీసీలకు ఉండవా ??

**- ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి ప్రారంభమయ్యే జనగణనలో బీసీలని కూడా లెక్కించాలి**

**- కేంద్ర ప్రభుత్వానికి బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ లింగంగౌడ్ విజ్ఞప్తి**




**హైదరాబాద్ వెలుతురు మార్చి 30:** కేంద్ర ప్రభుత్వం చేపట్టే జనగణనలో బీసీలని కూడా లెక్కించాలనీ బీసీ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ జాజుల లింగంగౌడ్ కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.కేంద్ర ప్రభుత్వం రెండు దఫాలుగా జరిపే కులగణనలో కేవలం ఎస్సీ,ఎస్టీ కుటుంబాల ఇళ్ల వివరాలే సేకరిస్తూ బీసీలను విస్మరించడం సరికాదన్నారు.బీసీ కుటుంబాలను కూడా లెక్కిస్తేనే భవిష్యత్తులో బీసీ సమగ్ర కులగణన డేటా సంపూర్ణంగా మొదటిసారిగా అధికారికంగా అందుబాటులోకి వస్తుందని ఆయన తెలిపారు.కుక్కలను బర్రెలను మిగతా జంతువులను లెక్కిస్తున్న ప్రభుత్వం బీసీలను ఎందుకు లెక్కించడం లేదన్నారు.ఏప్రిల్ ఒకటి, 2026 రోజున ప్రారంభమయ్యే కుటుంబాల లెక్కింపు కోసం జరిగే 33 కాలంలో తోపాటు 34వ కాలంగా ఓబీసీ కుటుంబాలను కూడా చేర్చాలని ఆయన కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## కిష్టాపురం గ్రామానికి చెందిన చేపూరి ఎల్లమ్మను హైదరాబాద్ బసవతారక హాస్పిటల్ లో ఆరోగ్య విషయాలు అడిగి తెలుసుకున్న సురిగి నరసింహా గౌడ్



**హైదరాబాద్ వెలుతురు మార్చి 30:** సోమవారం రోజున మునుగోడు మండలం కిష్టాపురం గ్రామంలో శ్రీ చేపూరు ఎల్లమ్మ కు హైదరాబాదులో గల క్యాన్సర్ హాస్పిటల్ బసవతారక ము లో చికిత్స పొందుతున్న చేపూరు ఎల్లమ్మను ఆరోగ్య పరిస్థితులు అడిగి తెలుసుకున్న మునుగోడు మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు సురిగి నరసింహ గౌడ్ పెద్ద అంబర్పేట్ ఇసుక లారీల యూనియన్ ఉపాధ్యక్షుడు మునుకుంట్ల బలరాం గౌడ్ పాలుట్ల ప్రేమ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

### మైసూరు పాపన్న మహారాజ్ ప్రోగ్రామ్ కి బయలుదేరిన బోయపల్లి లింగస్వామి గౌడ్, విబుది వెంకటేశ్వర్లు



**హైదరాబాద్ వెలుతురు మార్చి 30:**

# మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నాం

- గొట్టిగర్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ విశ్వనాథ్...
- స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తాం...
- జిల్లా బీఆర్ఎస్ నాయకులు భూమన్న

**జహీరాబాద్ వెలుతురు మార్చి 30:**



గ్రామన్ని సమూలంగా అభివృద్ధి చేస్తూ గ్రామంలో మౌలిక వసతుల కల్పనలకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నామని గొట్టిగర్ పల్లి గ్రామ సర్పంచ్ రాథోడ్ విశ్వనాథ్ అన్నారు. సోమవారం నాడు సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ నియోజకవర్గం పరిది కోహిర్ మండలంలోని గొట్టిగర్ పల్లి గ్రామంలోని గొల్ల కుర్మా కాలనిలో ఎమ్మెల్యే మణిక్ రావు ద్వారా కేటాయించిన 5 లక్షల నిధులతో గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణం పనులకు సర్పంచ్ విశ్వనాథ్, బీఆర్ఎస్ జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మపురం భూమన్న బృందం టెంకాయకొట్టి భూమిపూజ చేసి పనిని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక ఎన్నికల్లో ఇచ్చిన హామీలను 100 శాతం అమలు చేసి గ్రామ అభివృద్ధి కోసం అహర్నిశలు కృషి చేస్తామాని, గ్రామ అభివృద్ధి కోసం ఎమ్మెల్యే మణిక్ రావు 5 లక్షలు కేటాయించారని, త్వరలో మరిన్ని పనులను స్థానిక ఎమ్మెల్యే చొరవతో చేపడతామని, గ్రామ అభివృద్దే ద్యేయంగా ముందుకు సాగుతామని అన్నారు. కార్యక్రమంలో గ్రామ ఉప సర్పంచ్ షికారి మారుతి, మెంబర్లు సురేష్, సుదర్శన్, మాజీ సర్పంచులు మొహమ్మద్ సాదఖ్ అలీ, అనసుజమ్మ తుక్కప్ప, జిల్లా సీనియర్ నాయకులు లక్ష్మపురం భూమన్న, మాజి ఉప సర్పంచ్ వాసు నాయక్, మాజి చెరువు చైర్మన్ ఎల్లారెడ్డి, డీలర్ బల్వంత్ రెడ్డి, నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ నేత రామ్ నరసింహ గౌడ్ ను ముందస్తు అరెస్ట్ చేసి చైతన్యపూరి పోలీస్ స్టేషన్ తరలించిన పోలీసులు




**ఎల్ బి నగర్ వెలుతురు మార్చి 30:**

రామకృష్ణా పురం డివిజన్, "బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్ గారిని చైతన్యపూరి పోలీస్ స్టేషన్ పోలీసులు" ఈరోజు ఉదయం నాలుగు గంటలకు ముందస్తు హౌస్ అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్ కు తరలించరు . ఈ సందర్భంగా రామ్ నరసింహ గౌడ్ మాట్లాడుతూ " మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డికి చెందిన రాఘవ కన్‌స్ట్రక్షన్స్ సంస్థ చేస్తున్న అక్రమ మైనింగ్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున నేపథ్యంలో తమను అన్యాయంగా అరెస్ట్ చేశారని ఆయన ఆరోపించారు .. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమ క్రషర్లతో మూసీ, గండిపేట కలుషితం అవుతున్నాయని,మూసీ పక్కన ఉన్న నిరుపేదల ఇండ్లకు ఒక న్యాయం పొంగులేటి కంపెనీకి ఒక న్యాయమా?అని ఆయన ప్రశ్నించారు? రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అక్రమాలపై మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తక్షణమే రాజీనామా చేయాలి! ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సర్కార్‌కు ధైర్యం ఉంటే 'సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని డాక్టర్ రామ్ నరసింహ గౌడ్ డిమాండ్ చేశారు.

# రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం సాంస్కృతిక కార్యదర్శిగా పాలకుర్ల సుధ గౌడ్





**రంగారెడ్డి , వెలుతురు మార్చి 30:**

రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం సాంస్కృతిక కార్యదర్శిగా పాలకుర్ల సుధ గౌడ్ విజయం సాధించారు. గురువారం జరిగిన ఎన్నికల్లో లెక్కింపు ప్రక్రియ తర్వాత అదే రోజు రాత్రి రిటర్నింగ్ అధికారి కొండల్ రెడ్డి ఫలితాలు ప్రకటించారు. రంగారెడ్డి జిల్లా కోర్టుల న్యాయవాదుల సంఘం అధ్యక్షుడిగా గోలి విప్లవరెడ్డి, ఉపాధ్యక్షుడు బొడ్డు రమేశ్ కుమార్, ప్రధాన కార్యదర్శి వొద్యారపు రవికుమార్, సంయుక్త కార్యదర్శి పులిమామిడి మల్లేశ్, మహిళా సంయుక్త కార్యదర్శి అర్చన, కోశాధికారి మాధవి, గ్రంథాలయ కార్యదర్శి ప్రసాద్, క్రీడా కార్యదర్శి బాపు భీంరావు, సాంస్కృతిక కార్యదర్శి పాలకుర్ల సుధ ఎన్నికయ్యారు. వీరితో పాటు నరేశ్ అగిరిశెట్టి, నగేశ్ బానోతు, విజయ్కుమార్ పెద్దబురి, ఎం. సత్యనారాయణ, శ్రీవాణి, శ్రీలత, స్రవంతి కార్యవర్గ సభ్యులుగా గెలుపొందారు

# పొంగులేటిని బర్తరఫ్ చేయండి

- గవర్నర్‌కు బిఆర్ఎస్ విజ్ఞప్తి



**హైదరాబాద్,మార్చి30 వెలుతురు:**

ప్రతిపక్షాన్ని సీఎం రేవంత్‌రెడ్డి బెదిరించే ప్రయత్నం చేస్తున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ అంశంలో సభా సంఘం వేయాలని కోరితే సీఐడీని అడ్డుపెట్టుకుని మంత్రి పొంగులేటిని రక్షించే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పార్టీ నేతలతో కలిసి లోక్‌భవన్‌లో గవర్నర్ శివప్రతాప్ శుక్లాను కేటీఆర్ కలిశారు. ఈ సందర్భంగా పొంగులేటిపై ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ పెద్దలే గద్దలుగా మారి అవినీతికి పాల్పడుతున్నారని కేటీఆర్ విమర్శించారు. ఈ అంశంపై గవర్నర్‌కు ఫిర్యాదు చేశామని.. స్వతంత్ర విచారణకు ఆదేశించాలని కోరినట్లు చెప్పారు. మంత్రి పొంగులేటిని బర్తరఫ్ చేయాలని గవర్నర్‌ను కోరామన్నారు. గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాతో సోమవారం బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు భేటీ అయ్యారు. లోక్ భవన్‌కు వెళ్లిన బీఆర్ఎస్ బృందం మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ అక్రమాలపై చర్యలు తీసుకోవాలని గవర్నర్‌కు వినతి పత్రం అందజేశారు. హైకోర్టు జడ్జితో విచారణ చేయించాలని విజ్ఞప్తి చేశారు. వేల కోట్ల ప్రజా సంపదను మంత్రి పొంగులేటి అక్రమ మైనింగ్ ద్వారా కొల్లగొడుతున్నారని బీఆర్ఎస్ శాసన సభా పక్ష బృందం ఆరోపించింది. ఈ సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, బీఆర్ఎస్ ఎల్పీ డిప్యూటీ లీడర్ హరీష్ రావు, మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు పాల్గొన్నారు. ఆదివారం కూడా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మైనింగ్ వ్యవహారంపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ఆందోళన చేసిన విషయం తెలిసిందే. మంత్రి పొంగులేటి రాఘవ కన్ స్ట్రక్షన్ ద్వారా అక్రమ మైనింగ్?కు పాల్పడుతూ ప్రభుత్వానికి ఆదాయానికి గండి కొడుతున్నారని బీఆర్ఎస్ ఆరోపించింది. రాఘవ కన్‌స్ట్రక్షన్స్ మైనింగ్‌పై వ్యవహారాలపై హౌస్ కమిటీ వేయాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో గత పదేండ్ల కాలంలో జరిగిన ప్రతి అక్రమ మైనింగ్‌పై పూర్తిస్థాయిలో సీబీ సీ-ఐడీ విచారణకు ఆదేశిస్తున్నట్టు అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు.

# 2027 జనగణన (జవలంబం-2027) నిర్వహణకు సంబంధించి అధికారులు సమర్థంగా పనిచేయాలి - జిల్లా కలెక్టర్ ప్రతిమ సింగ్

**మెదక్ వెలుతురు 30 మార్చి -2026:**

సోమవారం ఐడీఓసీ కార్యాలయంలో ప్రణాళిక శాఖ ఆధ్వర్యంలో ఫీల్డ్ ట్రైనర్స్ కు జన గణన ప్రక్రియపై శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ 2027 జనగణన రెండు దశల్లో నిర్వహించబడుతుందని, మొదటి దశలో హౌస్ లిస్టింగ్ మరియు హౌసింగ్ సెన్సస్ ఉంటుందని తెలిపారు. ఈ దశలో సర్వే ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి గృహాల వివరాలు సేకరిస్తారని స్పష్టం చేశారు. వాటిలో గృహ పరిస్థితులు, అందుబాటులో ఉన్న సౌకర్యాలు, కుటుంబాల ఆస్తుల సమాచారం నమోదు చేస్తారని అన్నారు. ఈ వివరాలు రెండో దశ జనగణనకు ప్రామాణిక ఆధారంగా ఉపయోగపడతాయన్నారు. ఈ దశలో ఫీల్డ్ వర్క్‌తో పాటు 15 రోజుల స్వీయ నమోదు అవకాశం కూడా ఉంటుందని తెలిపారు. రెండో దశలో జనాభా గణన ఉంటుందని, ఎన్యూమ రేటర్లు ప్రతి ఇంటి నుండి ప్రజల వ్యక్తిగత వివరాలు



నమోదు చేస్తారన్నారు. ఇందులో జనాభా గణాంకాలు, సామాజిక, సాంస్కృతిక, ఆర్థిక వివరాలు, వలసలు, జననాల వివరాలు తదితర సమాచారం సేకరిస్తారని సూచించారు. ఫీల్డ్ వర్క్ అనంతరం 5 రోజుల రివిజన్ రౌండ్ నిర్వహించి వివరాలను ధృవీకరించాలని పేర్కొన్నారు. జిల్లా స్థాయిలో సర్వేను పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నందున అధికారులు ఎలాంటి పొరపాట్లుకు తావులేకుండా లేకుండా





సమగ్రంగా వివరాలు నమోదు చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రతి ఇంటిని తప్పకుండా సర్వే చేసి ఎఫిషియెన్సీ మరియు అక్యురసీతో పని చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డీఈఓ విజయ, జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి, డిపిఓ యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# జహీరాబాద్ మున్సిపల్ బడ్జెట్ ప్రజా పక్షపాతిగా ఉండాలి

- పారిశుధ్య కార్మికుల సమస్యలు పరిష్కరించాలి...
- వార్డుల వారీగా సమాన నిధులు కేటాయించాలి...
- బడ్జెట్ సమావేశంలో గళమెత్తిన కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్...

**జహీరాబాద్ వెలుతురు, మార్చి 30:**

సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన బడ్జెట్ సాధారణ సర్వసభ్య సమావేశంలో కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ ప్రజా సమస్యలపై గట్టిగా స్పందించారు. ముఖ్యంగా కార్మికులు మరియు సామాన్య ప్రజల సమస్యలకు ప్రాధాన్యం ఇవ్వకుండా బడ్జెట్ రూపొందించడాన్ని ఆయన తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, మున్సిపల్ బడ్జెట్ అనేది కేవలం అంకెలతో నింపిన పత్రం కాకుండా ప్రజల అవసరాలను ప్రతిబింబించేలా ఉండాలని ఆయన స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న



తాగునీటి సమస్యలు, డ్రైనేజీ సమస్యలు, వీధి దీపాల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదని ఆయన గుర్తు చేశారు. ముఖ్యంగా మున్సిపల్ పారిశుధ్య కార్మికుల సమస్యలను ప్రస్తావిస్తూ, పట్టణాన్ని శుభ్రంగా ఉంచే కార్మికులకు కనీస సౌకర్యాలు కూడా కల్పించడంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. పారిశుధ్య కార్మికులకు రావాల్సిన పెండింగ్ వేతనాలను వెంటనే విడుదల చేయాలని, వారికి పీఎఫ్, ఈఎస్ఐ వంటి సామాజిక భద్రతా సౌకర్యాలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే కార్మికులకు అవసరమైన రక్షణ పరికరాలు సమయానికి అందించకపోవడం వల్ల వారి ఆరోగ్యం ప్రమాదంలో పడుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. మాస్కులు, గ్లౌజులు, బూట్లు వంటి రక్షణ పరికరాలు అందించకుండా కార్మికులను పని చేయించడం అన్యాయమని అన్నారు. పట్టణ అభివృద్ధి విషయంలో వార్డుల వారీగా నిధుల కేటాయింపులో వివక్ష చూపకూడదని ఆయన స్పష్టం చేశారు. అన్ని వార్డుల్లో సమానంగా అభివృద్ధి పనులు చేపట్టాలని, ముఖ్యంగా డ్రైనేజీ వ్యవస్థను ఆధునీకరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. వేసవి కాలం సమీపిస్తున్న నేపథ్యంలో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా ముందుగానే చర్యలు తీసుకోవాలని, నీటి సరఫరాపై ప్రత్యేక ప్రణాళిక రూపొందించాలని అధికారులను కోరారు. అదేవిధంగా పట్టణంలోని వీధి దీపాల నిర్వహణపై కూడా ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజలు చెల్లించే పన్నుల నిధులు దుర్వినియోగం కాకుండా పారదర్శకతతో పనులు చేపట్టాలని, అవినీతికి తావులేకుండా బడ్జెట్ అమలు జరగాలని ఆయన హెచ్చరించారు. ప్రజల సమస్యలు పూర్తిగా పరిష్కారం అయ్యే వరకు తన పోరాటం కొనసాగుతుందని కౌన్సిలర్ అప్పం శ్రావణ్ కుమార్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు

# గిగ్‌వర్కర్ల రక్షణకు బిల్లు

- ఆమోదించిన తెలంగాణ అసెంబ్లీ

**హైదరాబాద్,మార్చి30 వెలుతురు:**

గిగ్ వర్కర్ల బిల్లును తెలంగాణ అసెంబ్లీ ఆమోదించింది. గిగ్ వర్కర్ల బిల్లును కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి అసెంబ్లీ లో ప్రవేశపెట్టగా ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చ సందర్భంగా సోమవారం అసెంబ్లీలో మాట్లాడిన మంత్రి వివేక్.. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామని అన్నారు. గిగ్ వర్కర్లతో స్వయంగా మాట్లాడి డ్రాఫ్ట్ బిల్లు రెడీ చేశామని అన్నారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల డ్రాఫ్ట్ బిల్లుపై కంపెనీలతో 5 సార్లు మీటింగులు పెట్టామని...చట్టం తీసుకొస్తే కంపెనీలకు ఎలాంటి నష్టం ఉండదని వివరించామన్నారు. గిగ్ వర్కర్లకు ప్రభుత్వం అండగా స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్లను పట్టించుకోకపోతే అగ్రిగేటర్లకు పెనాల్టీ వేస్తామన్నారు వివేక్. మొదటిసారి తప్పు చేస్తే రూ. 50 వేలు, రెండోసారి రూ. లక్ష, మూడోసారి తప్పు చేస్తే రూ. లక్షా 50 వేలు పెనాల్టీ విధిస్తామని స్పష్టం చేశారు మంత్రి వివేక్. గిగ్ వర్కర్ల కోసం ప్రత్యేకంగా సంక్షేమ నిధి ఏర్పాటు చేస్తామని అన్నారు.



ఫిర్యాదుల కోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేస్తామని అన్నారు. గిగ్ కార్మికుల రిజిస్ట్రేషన్, పర్యవేక్షణకు 'సామాజిక భద్రత , సంక్షేమ బోర్డు'ను ఏర్పాటు చేస్తారు. ఇందులో మహిళలు, దివ్యాంగులకు ప్రాతినిధ్యం ఉంటుంది.ప్లాట్‌ఫాం ఆధారిత కార్మికులందరికీ ప్రత్యేక గుర్తింపు సంఖ్య (యూఐడీ) కేటాయిస్తారు. దీని ద్వారా ప్రభుత్వ పథకాలు నేరుగా వారికి అందుతాయి. అగ్రిగేటర్లు (సంస్థలు) జరిపే లావాదేవీల నుంచి 1శాతం నుంచి 2 వరకు నిధులను సేకరించి, వాటిని సంక్షేమ నిధికి జమ చేస్తారు. ఈ నిధిని కార్మికుల బీమా, యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ , పెన్షన్, ప్రసూతి ప్రయోజనాలకు ఉపయోగిస్తారు. యాజమాన్యాలకు, కార్మికులకు మధ్య వచ్చే తగాదాలను పరిష్కరించేందుకు బలోపేతమైన యంత్రాంగాన్ని ఏర్పాటు చేస్తారు. ఇబ్బందుల నివారణకు ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు పనిచేస్తాయి. కార్మికులను పనిలో నుంచి తొలగించినా లేదా పేమెంట్లు ఆపేసినా.. తక్షణమే ఫిర్యాదు చేసేందుకు 'ఎ÷-లాట్‌ఫాం స్థాయి కమిటీలు' జిల్లా స్థాయి అధికారులతో కూడిన యంత్రాంగం ఉంటుంది. ఇంతకాలం యాప్ కంపెనీలు ఏ ప్రాతిపదికన ఆర్డర్లు ఇస్తున్నాయి, పేమెంట్లు ఎలా లెక్కిస్తున్నాయి అనే దానిపై స్పష్టత ఉండేది కాదు. ఇకపై యాప్ కంపెనీలు ఇష్టమొచ్చినట్లు రేట్లు తగ్గించడం, కార్మికులను ఇబ్బంది పెట్టడం కుదరదు. కార్మికులకు ఇచ్చే పేమెంట్లలో పారదర్శకత ఉండాలి. నిబంధనలు ఉల్లంఘించే సంస్థలకు జరిమానాలు విధిస్తారు.

# పౌర స్వేచ్ఛను హరించే బిల్లు

- ఇదొక క్రూరమైన ఆయుధం
- విమర్శకుల నోళ్లు మూయించే కుట్ర
- హేట్ స్పీచ్ బిల్లుపై కెటిఆర్ విమర్శలు

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన 'తెలంగాణ హేట్ స్పీచ్ అండ్ హేట్ క్రైమ్స్ (ప్రివెన్షన్) బిల్లు' పై భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఈ బిల్లును పౌర స్వేచ్ఛను హరించే ఒక 'క్రూరమైన ఆయుధం'గా కేటీఆర్ అభివర్ణించారు. సోమవారం ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వం తన విమర్శకుల నోళ్లు మూయించేందుకే ఇటువంటి నిరంకుశ చట్టాలను తీసుకువస్తోందని కేటీఆర్ మండిపడ్డారు.ఈ బిల్లు చట్టరూపం దాల్చితే రాజ్యాంగం కల్పించిన భావప్రకటన స్వేచ్ఛకు, ప్రజాస్వామ్య మూలాలకే ముప్పు వాటిల్లుతుందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. సామాజిక సామరస్యాన్ని కాపాడటం ప్రభుత్వ బాధ్యతే అయినప్పటికీ, ఈ బిల్లులోని నిబంధనలు అత్యంత అస్పష్టంగా ఉన్నాయని ఆయన విమర్శించారు. 'అమలు యంత్రాంగం ఆధారాల కంటే అధికారుల వ్యక్తిగత



అభిప్రాయాలకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చేలా ఈ బిల్లు రూపకల్పన జరిగింది. ఇది కచ్చితంగా దుర్వినియోగానికి దారితీస్తుందని కేటీఆర్ పేర్కొన్నారు. బిల్లులో ఉపయోగించిన 'వ్యతిరేక భావాలు ప్రేరేపించడం','సామాజిక సమగ్రతను దెబ్బతీయడం' వంటి పదాలకు స్పష్టమైన న్యాయ పరిమితులు లేవని కేటీఆర్ అన్నారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టే ప్రతిపక్ష నేతలు, జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలను లక్ష్యంగా చేసుకునేందుకే ఈ పదజాలాన్ని పొందుపరిచారని ఆరోపించారు. ప్రభుత్వ నిర్ణయాలను విమర్శిస్తే వాటిని 'ఫేక్ న్యూస్'గా ముద్రవేసి జైలుకు పంపే ప్రమాదం పొంచి ఉందన్నారు. శ్రేయా సింఘల్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో సుప్రీంకోర్టు ఇచ్చిన చారిత్రాత్మక తీర్పును ఈ సందర్భంగా కేటీఆర్ గుర్తుచేశారు. కేవలం ప్రత్యక్ష హింసకు ప్రేరేపించే మాటలపైనే నియంత్రణ ఉండాలని, విమర్శ లేదా వ్యంగ్యం శిక్షార్హం కాదని కోర్టు స్పష్టం చేసిందని ఆయన తెలిపారు. ఈ పరిమితిని మించి చట్టాలు చేయడం ఆర్టికల్ 19(1)(జీ) ప్రకారం రాజ్యాంగ ఉల్లంఘనే అవుతుందని స్పష్టం చేశారు. ఏడు నుంచి పది సంవత్సరాల వరకు జైలు శిక్షలను ప్రతిపాదించడం ద్వారా ప్రజల్లో భయోత్పాతాన్ని సృష్టించాలని ప్రభుత్వం చూస్తోందని కేటీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. 'జర్నలిస్టులు, విద్యార్థులు, సామాన్యులు తమ అభిప్రాయాలను పంచుకోవాలంటేనే భయపడేలా ఈ శిక్షలు ఉన్నాయి. ఇప్పటికే దేశంలో హేట్ స్పీచ్‌పై తగినన్ని చట్టాలు ఉండగా, అదనంగా ఈ చట్టం తీసుకురావడంలో ఆంతర్యం ఏమిటి..?'అని కేటీఆర్ ప్రశ్నించారు. వెంటనే ఈ బిల్లును పున: పరిశీలించాలని, ప్రజాస్వామ్య విలువలను గౌరవిస్తూ అణచివేత ధోరణిని వీడాలని కేటీఆర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు

- సెలెక్ట్ కమిటీకి పంపిన స్పీకర్
- బిల్లును వ్యతిరేకించిన బిజెపి

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**

తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ బిల్లు ను రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. స్పీకర్ ఈ బిల్లును సెలెక్ట్ కమిటీకి సిఫార్సు చేశారు. ఈ బిల్లును గత సోమవారం రాష్ట్ర మంత్రి మండలి ఆమోదించింది. ఈ బిల్లుతో ఇక విద్వేష పూరిత ప్రసంగాలకు చెక్ పడనుంది. మతం, కులం, లింగం లేదా ఇతర కారణాల వల్ల సమాజంలో విద్వేషం, అశాంతిని రేకెత్తించే ప్రసంగాలు, రచనలు లేదా సోషల్ మీడియా పోస్టులను అరికట్టడానికి ఉద్దేశించిన చట్టమే హేట్ స్పీచ్ బిల్లు. ఇటువంటి చర్యలకు పాల్పడేవారిపై కఠినమైన జరిమానాలు, 7 ఏళ్ల వరకు జైలు శిక్షలు విధించడం, ఈ నేరాలను నాన్-బెయిలబుల్‌గా పరిగణించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. విద్వేష పూరిత ప్రసంగాలు మొదటి సారి రుజువు అయితే ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడే అవకాశం ఉంటుంది. శిక్షతోపాటు రూ. 50 వేలు జరిమానా విధిస్తారు. ఇదే ఘటన మరోసారి పునరావృతమైతే జైలు శిక్ష పదేళ్లు, రూ. లక్ష జరిమానా విధిస్తారు. ఇటీవల కాలంలో సోషల్ మీడియాలో విద్వేష పూరిత ప్రకటనలు, ప్రసంగాలు సైతం పెరిగాయని ప్రభుత్వం భావిస్తోంది. దీంతో ఇకపై సంఘం, సమూహం, సమావేశాల్లో ద్వేషపూరిత ప్రసంగాలు, రెచ్చగొట్టేలా వ్యాఖ్యలు ఉండొద్దని ప్రభుత్వం నిర్ణయించింది. మతం, జాతి, కులం, వర్గం, స్త్రీ, పురుష, లైంగిక, జన్మస్థలం, నివాసం, భాష, అశక్తత, తెగలకు వ్యతిరేకంగా వ్యాఖ్యలు, ప్రసంగాలు ఉండొద్దని ఈ బిల్లును తీసుకొచ్చింది. మాటల ముద్రణ, ప్రచురణ, ఎలక్ట్రానిక్ మాధ్యమం/సాధనాల ద్వారా సమాచార మార్పిడి ఉన్నా ఈ చట్టం పరిధిలోకి వస్తాయి. ఈ బిల్లు ద్వారా ఎలాంటి అసభ్యకర కంటెంట్, సందేశం, సమాచారం ఉంటే వాటిని తొలగించాలని ఎలక్ట్రానిక్ మీడియాతో పాటు సర్వీస్ ప్రొవైడర్లను హెచ్చరించే అధికారం అధికారులకు ఉంటుంది.

ఇక మీద సోషల్ మీడియాలో ఇష్టం వచ్చినట్లు మాట్లాడినా?, రెచ్చగొట్టే పోస్టులు చేసినా జైలు శిక్ష తప్పదు! అయితే హేట్ స్పీచ్ బిల్లు అత్యంత ప్రమాదకరమని బిజెపి ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలిపారు. రాజకీయ కక్షసాధింపులకే హేట్ స్పీచ్ బిల్లు అన్నారు. తెలంగాణ అసెంబ్లీలో హేట్ స్పీచ్ ప్రివెన్షన్ బిల్లును సెలక్ట్ కమిటీకి స్పీకర్ గడ్డం ప్రసాద్ రిఫర్ చేశారు. ఈ సందర్భంగా ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడారు. ఆధారాలు లేకున్నా అరెస్ట్ చేసేలా బిల్లు ఉందని, చట్టాలు ప్రజల రక్షణ కోసం ఉండాలి.. ప్రజల గొంతు నొక్కడానికి కాదని విమర్శించారు. ఇలాంటి చట్టం చేసేముందు హౌస్ కమిటీ వేయాలని.. చర్చ సాగాలని డిమాండ్ చేశారు. సెక్షన్ 4 అనేది ప్రజాస్వామ్యానికి డెత్ వారెంట్ అని.. హేట్ స్పీచ్ బిల్లును వ్యతిరేకిస్తున్నామని ఏలేటి మహేశ్వర్ రెడ్డి తెలియజేశారు.

# వట్టినాగులపల్లి కుటుంబ భూసమస్యను రాజకీయం చేయడం తగదు

- వట్టినాగులపల్లి భూముల సమస్య కేవలం కుటుంబ వ్యవహారం
- కుటుంబ సమస్యను రాజకీయం చేయడం తగదు
- దీనికి మంత్రి పొంగులేటి, వారి కుటుంబానికి సంబంధం లేదు
- కేటీఆర్, హరీష్‌రావులు ఒకవైపే విని ఆరోపణలు చేయడం న్యాయమా?
- ఇరుపక్షాల వాదన విన్నాక మీరే తీర్పుచెప్పండి
- రూ.1200 కోట్లు భూమి అంటారా? రూ. 600 కోట్లకు కొనుగోలు చేస్తారా?
- కేటీఆర్‌ను సూటిగా ప్రశ్నించిన భూ యజమానులు
- ఈ భూముల వ్యవహారం కోర్టులో ఉంది
- ఇక్కడ ఆక్రమణలు జరగలేదు- కబ్జాలు అంతకంటే లేవు
- కోర్టులో కేసు ఉండగా గోడ కట్టడంపై మేం అభ్యంతరం తెలిపాం
- దీనికి మంత్రి శ్రీనివాసరెడ్డికి ఏం సంబంధం?
- కేవలం 3 ఎకరాల కుటుంబ సమస్యను జఠిలం చేస్తున్నారు
- ఈ సరిహద్దు సమస్య తీరితే మళ్లీ కుటుంబాలు ఒక్కటవుతాయి
- ఈ సరిహద్దు సమస్యపై అన్ని ఆధారాలు తెస్తాం, కేటీఆరే పరిశీలించి న్యాయం చెప్పాలి
- ఈ భూములకు సర్వే చేయిస్తే అసలు నిజాలు తెలుస్తాయి
- మాకు చట్టబద్ధంగా ఇచ్చిన భూమిలోనే డెవలప్‌మెంట్ కార్యక్రమాలు చేపట్టామన్న సిద్ధార్థ గాదె, న్యూజెన్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్ స్పష్టీకరణ
- కేవలం రాజకీయాల కోసం మా పార్టనర్ హర్ష పేరును ప్రస్తావిస్తూ మంత్రి పొంగులేటికి అక్రమాలు ఆపాదించడం సరికాదు
- ఈ భూముల సరిహద్దు సమస్యల్లో రాజకీయ జోక్యం వల్ల చాలా న్యూజెన్‌పై ఆధారపడ్డ కుటుంబాలు ఇబ్బంది పడుతున్నాయి
- మేం కేవలం డెవలపర్స్ మాత్రమే. వారి కుటుంబ సమస్యతో మాకేంటి సంబంధం? మేం ఇప్పటివరకు జోక్యం చేసుకోలేదు, భవిష్యత్తులో చేసుకోబోం



**హైదరాబాద్ వెలుతురు మార్చి 30:**
వట్టినాగులపల్లి సర్వే నెంబర్ 245 వ్యవసాయ భూమి లో జరుగుతున్న భూ వివాదానికి రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డికి గానీ వారి కుటుంబానికి గాని ఎలాంటి సంబంధం లేదని,రాఘవ కన్స్ట్రక్షన్స్ కు తాము ఏలాంటి డెవలప్మెంట్ అగ్రిమెంట్ చేయలేదని వట్టినాగులపల్లి యజమానులు స్పష్టం చేశారు. మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి తన అధికార బలాన్ని ఉపయోగించి స్థలాన్ని కబ్జా చేయడానికి యత్నిస్తున్నారనే బిఆర్ఎస్ నాయకుల ఆరోపణలో ఏమాత్రం వాస్తవం లేదు.ఈ భూవివాదంలో మంత్రి పొంగిలేటి శ్రీనివాస్ రెడ్డి ని, రాఘవ కన్స్ట్రక్షన్స్ ని ఎందుకు లాగుతున్నారో అర్థం కావడం లేదు.మా కుటుంబానికి సంబంధించిన స్థలాల బౌండరీ ల విషయంలో మాకు వివాదం ఉంది. దీనికి సంబంధించిన విషయాలను పూర్తి ఆధారాలతో మీడియా ముందు ఉంచుతున్నాం.

భూమి విలువపై తప్పుడు ప్రచారం చేస్తున్నారు..అదే భూమిని రూ.600 కోట్లకు కేటీఆర్‌కు భేషరతుగా ఇవ్వడానికి సిద్దంగా ఉన్నాం. నిజంగా విలువ ఉంటే కొనుగోలు చేయడానికి సిద్ధమా అని ప్రశ్నించారు.

వట్టినాగులపల్లి భూవ్యవహారంపై సోమవారం నాడు సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో భూయజమానులు పూర్తి వివరాలను మీడియా ముందు ఉంచారు. ఈ సమావేశంలో భూ యజమానులు అవినవ్ షా, సుధీర్ కుమార్ షా, అక్షయ్ షా , న్యూజెన్ డెవెలపర్స్ ఎండీ సిద్దార్ధ్ గాదె ఏమన్నారంటే..

**అవినవ్ షా, భూయజమాని**

రంగారెడ్డి జిల్లా గండిపేట మండలం వట్టినాగులపల్లిలోని సర్వే నెంబర్ 259లో తనకు ఒక ఎకరం భూమి ఉందని, సతీష్ షా తనకు తండ్రి సమానులని అవినవ్ షా పేర్కొన్నారు. గత పదేళ్లుగా ఆయన సలహాతోనే పని చేస్తున్నానని, భూమిని డెవలప్‌మెంట్‌కు ఇచ్చే ముందు కూడా ఆయనను సంప్రదించానని తెలిపారు. ఇది కేవలం కుటుంబ వివాదమని, దీనిని ఎందుకు రాజకీయం చేస్తున్నారో అర్థం కావడం లేదని అవినవ్ షా ఆవేదన వ్యక్తం చేశారు. హరీశ్ రావు, కేటీఆర్ గార్లు కేవలం ఒకవైపే కాకుండా తమ వాదన కూడా వినాలని కోరారు. 2020 నుంచి తాను భూ సర్వే చేయిస్తున్నానని, హైకోర్టు ఆదేశాల ప్రకారం సబ్ డివిజన్, డిమార్కేషన్ జరగాలని కోరుతున్నట్లు తెలిపారు.



భువన్ యాప్ ద్వారా వివరాలు సరిచూసుకోవచ్చని, సర్వే చేయించి ఎవరి భూమి వారికి అప్పగించాలని డిమాండ్ చేశారు. సతీష్ షా ఆస్తిలో అక్రమ రోడ్డు నిర్మించారని, తాను ఆయనను బెదిరించానన్నది అబద్ధమని భగవంతుడి సాక్షిగా చెప్పారు. కేసీఆర్ లేదా రేవంత్ రెడ్డి ఎవరిని పిలిచినా సరే, భూ సర్వే చేయించి నిజానిజాలు తేల్చాలని, అనవసరంగా కుటుంబంలో చీలికలు తీసుకురావద్దని ఆయన కోరారు.

**అక్షయ్ షా, భూయజమాని**

వ్యవస్థలను నిష్పక్షపాతంగా సర్వే చేయనివ్వాలని, ఇది పూర్తిగా కుటుంబ వివాదమని అక్షయ్ షా స్పష్టం చేశారు. రాజకీయ ప్రమేయం వద్దని తాము గతంలోనే కోరామని గుర్తు చేశారు. హరీశ్ రావు, కేటీఆర్ పట్ల గౌరవం ఉన్నప్పటికీ, వారు సతీష్ వైపు నిలిచి ఏకపక్షంగా వ్యవహరించడం సరికాదని అభిప్రాయపడ్డారు. తాము కేవలం సర్వే చేయించమని మాత్రమే కోరుతున్నామని, ఇందులో రాజకీయం ఎందుకని ప్రశ్నించారు. సరిహద్దులను తేల్చి ఎవరి భూమి వారికి అప్పగిస్తే సమస్య పరిష్కారమవుతుందని ఆయన పేర్కొన్నారు.

**సుధీర్ కుమార్ షా, భూయజమాని**

వట్టినాగులపల్లి భూమి తమ కుటుంబానికి చెందినదని, 1969 నుంచి ఈ ఆస్తి కుటుంబం మధ్యనే ఉందని సుధీర్ కుమార్ షా వివరించారు. అన్నదమ్ముల మధ్య భూమి పంపకాల్లో కొంచెం తక్కువ, ఎక్కువ ఉండటం సహజమని, ఏడీ లేదా శాటిలైట్ సర్వే ద్వారా సరిహద్దులు తేలితే వివాదం ముగుస్తుందని చెప్పారు. సర్వే నెంబర్లు 259, 245, 262లలో సర్వే చేయిస్తే, ఎక్కువ ఉన్న వారు వదులుకుంటారని, తక్కువ ఉన్న వారు తీసుకుంటారని తెలిపారు. తమ లక్ష్యం ఒక్కటేనని, భూమిని స్పష్టం చేసుకొని డెవలపర్‌కు ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు.

**సిద్ధార్థ గాదె, న్యూజెన్ కంపెనీ మేనేజింగ్ పార్టనర్**

కేటీఆర్, హరీశ్ రావు వంటి నాయకులు ఏకపక్షంగా మాట్లాడటం సరికాదని సిద్ధార్థ గాదె అన్నారు. తాము కేవలం డెవలపర్స్ మాత్రమేనని, భూ యజమానులు ఇచ్చిన భూమిపై ప్రాజెక్ట్ చేస్తామని స్పష్టం చేశారు. షా కుటుంబ వివాదంతో తమకేం సంబంధమని రాజకీయ నేతలను ప్రశ్నించారు. తమ సంస్థలో పొంగులేటి హర్ష ఒక పార్టనర్ మాత్రమేనని, రాజకీయంగా ఆయనను లేదా మంత్రి పొంగులేటిని టార్గెట్ చేయడం వల్ల వారు ఎంత ఇబ్బంది పడుతున్నారో తెలియదు కానీ.. తప్పుడు ప్రచారం వల్ల కంపెనీ ఇమేజ్ దెబ్బతినడంతో పాటు తమ ఉద్యోగులు, భాగస్వాములు ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. రాఘవ కన్స్ట్రక్షన్స్ పేరును అనవసరంగా వివాదం లాగుతున్నారన్నారు. కాంట్రాక్ట్ తీసుకున్నది న్యూజెన్ కంపెనీ అని స్పష్టం చేశారు. కేటీఆర్ గారు భూమి విలువ రూ.1200 కోట్లు అని చెబుతున్న వారు, అవినవ్ షా కు రూ.600 కోట్లు ఇస్తే అగ్రిమెంట్ క్యాన్సిల్ చేసుకుంటామని అన్నారని వెల్లడించారు. వివాదం కోర్టులో ఉండగా సతీష్ షా గోడ కట్టడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. కేటీఆర్ ఈ విషయాన్ని ప్రజాకోర్టులో పెట్టారు కాబట్టి, ఇరుపక్షాల వాదనలు విని ఆయనే జడ్జ్ చేయాలని, రాజకీయ ఎజెండాతో ఇతరులను ఇబ్బంది పెట్టవద్దని కోరారు.

## చర్చల ద్వారా సమస్యల పరిష్కారం

- ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారు
- సమాంతర ప్రభుత్వాలు నడిపిన మావోయిస్టులు
- నక్సల్స్‌పై హోంమంత్రి అమిత్ షా ప్రకటన



**న్యూఢిల్లీ,మార్చి30( వెలుతురు):**
చర్చల ద్వారానే ఏ సమస్యకైనా పరిష్కారం సాధ్యమని.. తుపాకులతో కాదని కేంద్ర హోం మంత్రి అమిత్ షా అన్నారు. ప్రజలను చంపేవారు దేశభక్తులు ఎలా అవుతారని ప్రశ్నించారు. నక్సలైట్లు తమ సిద్ధాంతాన్ని కూడా విదేశాల నుంచి దిగుమతి చేసుకున్నారు' అని అమిత్ షా తెలిపారు. నక్సలైట్లకు ఆదర్శం భారతీయులెవరూ కాదు.. వారికి మావో ఆదర్శమని అమిత్ షా పేర్కొన్నారు.పార్లమెంట్‌లో ఆయన మాట్లాడుతూ.. మాట్లాడితే ప్రజాస్వామ్యం అంటారు కానీ హింసను ఎలా సమర్థిస్తారని ప్రశ్నించారు. కాంబోడియా, పెరూ, కొలంబియాలో భయంకర రక్తపాతం జరిగిందని పేర్కొన్నారు. దేశాభివృద్ధికి మావోయిస్టు సిద్ధాంతాలు, విధానాలు తీవ్ర ఆటంకం అన్నారు. మావోయిస్టుల రక్తపాత సిద్ధాంతాన్ని ప్రజలంతా వ్యతిరేకిస్తున్నారు. బస్తర్‌లో నక్సల్స్ అనేక ఏళ్లపాటు సమాంతర ప్రభుత్వం నడిపారు. ఆయుధాలు వీడాలని బస్తర్ వెళ్లి పలుసార్లు కోరాం' అని అన్నారు. నక్సలిజం నశించాలని గిరిజనులు కూడా కోరుకుంటున్నారని అమిత్ షా స్పష్టం చేశారు. 'నక్సలిజంపై పోరులో ప్రజలు కూడా మాకు అండగా నిలిచారు. వేల మంది సైనిక బలగాలు, పోలీసులను నక్సల్స్ చంపారు. దేశం కోసం ప్రాణత్యాగం చేసిన సైనికులకు శ్రద్ధాంజలి ఘటిస్తున్నాం. ఇప్పుడు ప్రతి ఒక్కరూ అభివృద్ధినే కోరుకుంటున్నారు.. హింస కాదు. బస్తర్ యువకులను కలిశా.. వాళ్లందరూ నక్సలిజాన్ని వ్యతిరేకించారు. ప్రస్తుత సమాజంలో నక్సలిజానికి తావు లేదు. ఎన్డిఎ పాలనలో మారుమూల ప్రాంతాల్లోనూ అభివృద్ధి జరుగుతోంది. నక్సలైట్ల ఎజెండాలో అభివృద్ధి అన్నది లేదు. నక్సలైట్లు తమ ఉనికి కోసమే పోరాడుతున్నారు. నక్సలైట్లు.. భగత్‌సింగ్, బిర్సాముండా కారు. వాళ్లతో నక్సలైట్లను పోల్చకూడదు. 'రోడ్లు, విద్యుత్ వంటి సదుపాయాలు లేకుండా గిరిజన ప్రాంతాలు ఎలా అభివృద్ధి చెందుతాయి. నక్సల్స్.. చిన్న పిల్లలకు తుపాకులు, ఆయుధ సామాగ్రి ఇచ్చారు. ఏజెన్సీ ప్రాంతాల యువత జీవితాలను నక్సల్స్ నాశనం చేశారు. నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో నిరక్షరాస్యత ఎక్కువగా ఉంది. విద్య, వైద్య, మౌలిక వసతులను కూడా నక్సల్స్ ధ్వంసం చేస్తున్నారు. మనం ప్రజాస్వామ్య దేశంలో ఉన్నాం.. రాజ్యాంగాన్ని స్వీకరించాం. ఆయుధాలు చేపట్టి ప్రజల ప్రాణాలు తీయాలని ఏ సిద్ధాంతాలు చెప్పాయి? ప్రజల ప్రాణాలు తీసే హక్కు ఎవరికీ లేదని నక్సల్స్ గ్రహించాలి. స్కూళ్లు, బ్యాంకులు, ఆస్పత్రులు తగలబెట్టేవారి వల్ల అభివృద్ధి ఎలా సాధ్యం? ఆయుధాలు చేతుల్లోకి తీసుకోవడం ఏ సమస్యకూ పరిష్కారం కాదు. కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల నుంచే నక్సలిజం అభివృద్ధి చెందింది. ఇందిరా గాంధీ వల్లే మావోయిస్టు పార్టీ అన్ని ప్రాంతాలకు విస్తరించిందని అమిషా ధ్వజమెత్తారు.

## అత్తాపూర్‌లో దారుణ ఘటన

- మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారం

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**



హైదరాబాద్ నగరంలోని అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వెలుగు చూసిన ఒక దారుణ ఘటన ఇప్పుడు సభ్య సమాజాన్ని తలదించుకునేలా చేస్తోంది. కనీసం తనపై జరుగుతున్న దాడిని కూడా అర్థం చేసుకోలేని, తన గోడును ఎవరికీ చెప్పుకోలేని ఒక మతిస్థిమితం లేని యువతిపై కామాంధుడు అత్యాచారానికి పాల్పడ్డాడు. ఈ అమానుష ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపుతోంది.అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని హాసన్ నగర్‌లోని మతిస్థిమితం సరిగ్గా లేని ఒక యువతిపై ఈ అఘాయిత్యం జరిగింది. యువతి ఒంటరిగా ఉన్నది గమనించిన ఒక యువకుడు ఇంట్లోకి చొరబడి అత్యాచారానికి పాల్పడ్డాడు. అనంతరం అక్కడ నుంచి పారిపోయాడు. ఇంటికి చేరుకున్న కుటుంబ సభ్యులు యువతి పరిస్థితి గమనించి అత్తాపూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. నిదింతుడు అదే ప్రాంతానికి చెందిన అఖిల్‌గా గుర్తించి అరెస్ట్ చేశారు. వైద్య పరీక్షల కోసం యువతిని ఆస్పత్రికి తరలించారు.

## నష్టాల్లో ఉన్న ప్రభుత్వ రంగసంస్థలను సమీక్షించాలి

- సింగరేణికి సమంబందించి పలు సూచనలు చేసిన కాగ్




**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**
తెలంగాణ ప్రభుత్వ రంగ సంస్థల కార్యకలపాలు, లాభ నష్టాలపై కాగ్ నివేదిక విడుదల అయింది. 2023 మార్చి వరకు పబ్లిక్ సెక్టార్ పనితీరుపై కంప్ట్రోలర్ అండ్ ఆడిటింగ్ జనరల్ కాగ్ కీలక వ్యాఖ్యలు చేసింది. ప్రభుత్వరంగ సంస్థలకు కాగ్ పలు సిఫారసులు చేసింది. నష్టాల్లో ఉన్న కంపెనీల పనితీరుని సమీక్షించాలని సూచించింది. నష్టాల్లో ఉన్న కంపెనీలను ప్రోత్సాహకాలు ఇవ్వడం లేదా పూర్తిగా మూసివేయడం చేయాలని పేర్కొంది. అలాగే సింగరేణి కంపెనీకి కూడా పలు సూచనలు చేసింది. ఓబీఆర్ కాంట్రాక్టుల్లో భద్రతా నిబంధనలు మార్చాలని, బొగ్గు రవాణా ఛార్జీలను సమీక్షించాలని సూచించింది. తవ్విన గనులను తిరిగి నింపడానికి నది ఇసుకకు బదులు ప్రాసెస్ చేసిన బూడిద లేదా గనుల ఉపరితల పదార్థాలను వాడాలని తెలిపింది.రాష్ట్రంలో మొత్తం 83 ప్రభుత్వ రంగ సంస్థలు ఉన్నట్టు, వాటిలో 16 సంస్థలు మూతపడినట్టు లేదా లిక్విడేషన్‌లో ఉన్నట్టు నివేదిక వెల్లడించింది. మిగిలిన 67 సంస్థల్లో 49 ఖాతాలు సమర్పించడంలో ఆలస్యం చేశాయని పేర్కొంది. దీంతో కేవలం 18 సంస్థల పనితీరే విశ్లేషణకు తీసుకున్నట్టు కాగ్ వెల్లడించింది. విశ్లేషణకు తీసుకున్న 18 సంస్థల్లో 11 నష్టాల్లో ఉన్నాయని, కేవలం 6 సంస్థలు మాత్రమే లాభాల్లో ఉన్నాయని కాగ్ తెలిపింది. తొమ్మిది సంస్థల నెట్ విలువ పూర్తిగా నష్టాలతో కరిగిపోయినట్టు వెల్లడించింది. 71 సంస్థలు సమయానికి ఖాతాలు సమర్పించకపోవడంపై ఆందోళన వ్యక్తం చేసింది. 15 సంస్థల్లో 9 స్వతంత్ర డైరెక్టర్ల నియామకం చేయలేదని, ఎక్కడా ఇండిపెండెంట్ డైరెక్టర్ల సమావేశాలు నిర్వహించలేదని పేర్కొంది. 5 సంస్థల్లో ఆడిట్ కమిటీ లేదని, 9 సంస్థల్లో ఎన్ఆర్సీ కమిటీ ఏర్పాటు కాలేదని తెలిపింది.

## అక్రమాల పొంగులేటిని బర్తరఫ్ చేయాల్సిందే

- హౌజ్‌కమిటీ వేసి విచారణ జరపాల్సిందే
- శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి




**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**
రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాల్సిన మంత్రి పొంగులేటి అవినీతి ఒక్కొక్కటిగా బయటపడుతున్నాయని శాసనమండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారి అన్నారు. ప్రభుత్వానికి కట్టాల్సిన డబ్బులు కట్టకుండా, ఎలాంటి అనుమతులు లేకుండా రాఘవ కన్స్టక్షన్స్ కంపెనీ మైనింగ్ అక్రమాలకు పాల్పడిందని ఆయన ఆరోపించారు. ఈ మేరకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిపై మధుసూదనాచారి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం ఉదయం గన్‌పార్క్ వద్ద మీడియాతో మాట్లాడుతూ.. మంత్రి పొంగులేటి అవినీతి మొత్తం సాక్ష్యాలతో సహా హరీశ్ రావు బయటపెట్టారని ఆయన తెలిపారు. ఈ ప్రభుత్వం దుర్మార్గ వైఖరితో బీఆర్ఎస్ శాసనసభ్యులను సస్పెండ్ చేసిందని మధుసూదనాచారి మండిపడ్డారు. ప్రభుత్వ ఆస్తులను కాజేస్తూ అక్రమాలకు పాల్పడుతున్న పొంగులేటిని వెంటనే బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. స్వయంగా సీఎం కూడా ఈ అక్రమాల్లో భాగస్వామ్యంగా ఉన్నారని ఆరోపించారు. పొంగులేటిని తక్షణమే బర్తరఫ్ చేయాలని శాసన మండలిలో డిమాండ్ చేస్తామని తెలిపారు. ఈ ప్రభుత్వం రాజశేఖర్ రెడ్డిని ఆదర్శంగా తీసుకుంటున్నామని పదే పదే చెబుతోందని.. కానీ ఓబులాపురం మైనింగ్ కేసులో అక్రమాలు జరిగాయని చెప్పడంతో నాగం జనార్ధన్ రెడ్డితో సభా సంఘం వేశారని గుర్తు చేశారు. అదే విధంగా పొంగులేటి అక్రమాలపై కూడా సభా సంఘం వేయాలని మధుసూదనాచారి డిమాండ్ చేశారు. ఉదయం గన్‌పార్క్ వద్దకు చేరుకున్న బీఆర్ఎస్ శాసనమండలి సభ్యులు.. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్లకార్డుల ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. మంత్రుల అవినీతిపై హైకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపించాలని డిమాండ్ చేశారు. అక్రమ మైనింగ్‌కు పాల్పడిన మంత్రి పొంగలేటి శ్రీనివాస్ రెడ్డిని వెంటనే బర్తరఫ్ చేయాలంటూ ప్లకార్డులతో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు నిరసన తెలిపారు. వాణి దేవి, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, తక్కిలపల్లి రవీందర్రావు, పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి నిరసనలో పాల్గొన్నారు.

## నగరంలో మరోమారు డ్రగ్స్ కలకలం

- మోకిలాలో రైల్వే ఉద్యోగి అరెస్ట్

**హైదరాబాద్,మార్చి30( వెలుతురు):**
హైదరాబాద్ నగరంలో మరోసారి డ్రగ్స్ కలకలం రేపింది. మోకిలలో డ్రగ్స్ విక్రయిస్తున్న డ్రగ్ పెడ్లర్‌ను పోలీసులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అతని వద్ద నుంచి 40 గ్రాముల కొకైన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన వ్యక్తి రైల్వేశాఖలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు.

సదరు వ్యక్తి.. బెంగళూరు, గోవా నుంచి డ్రగ్స్‌ను తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కారులో డ్రగ్స్ తీసుకొచ్చి హైదరాబాద్‌లో విక్రయిస్తుండగా రైల్వే ఉద్యోగిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ కేసులో గూగుల్‌లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఉద్యోగితో పాటూ మరో వ్యాపారవేత్తను పోలీసులు అరెస్ట్ చేశారు. వీరి వద్ద నుంచి రెండు కార్లను సీజ్ చేశారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## అప్పుల బాధతో కౌలురైతు ఆత్మహత్య

**నారాయణపేట,మార్చి30( వెలుతురు):**
నారాయణపేట జిల్లా కృషఖన మండలం గుడేబడ్లూరులో విషాదం నెలకొంది. అప్పుల బాధతో కృష్ణా నదిలో దూకి కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల్లోకి వెళ్తే.. గుడేబడ్లూరు టై రోడ్డు చెక్‌పోస్టు వద్ద నివాసం ఉండే నాగరాజు (55) కృష్ణా పరివాహక ప్రాంతంలో భూమి కౌలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నాడు. గత రెండేళ్లుగా ఆశించినంతగా వరి పంట దిగుబడి రాలేదు. దీంతో తీవ్రంగా నష్టపోయాడు. ఈ క్రమంలో నిరాశకు లోనైన నాగరాజు.. ఈ సీజన్‌లో పంట వేయలేదు. సాగు కోసం చేసిన అప్పుల తీర్చేందుకు, పొట్ట కూటి కోసం హైదరాబాద్ వచ్చాడు. హైదరాబాద్‌లో చిన్నా చితకా పనిచేస్తున్న నాగరాజు.. రెండు రోజుల క్రితం భార్యాపిల్లలను చూసేందుకు స్వగ్రామానికి వచ్చాడు. ఈ క్రమంలోనే సోమవారం తెల్లవారుజామున 4 గంటలకు కృష్ణ బ్రిడ్జిపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. అప్పుల బాధ భరించలేకనే తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని నాగరాజు భార్య పోలీసులకు తెలిపింది. కౌలు రైతు మృతితో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నారు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వాన్ని స్థానికులు డిమాండ్ చేశారు.

## ఆళ్లకు హైకోర్టులో చుక్కెదురు

- మూడు పిటిషన్లు కొట్టివేసిన హైకోర్టు



**అమరావతి,మార్చి30( వెలుతురు):**
ఇన్నర్ రింగ్ రోడ్డు కేసులో వైసీపీ నేత, మంగళగిరి మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి దాఖలు చేసిన మూడు పిటిషన్లను ఏపీ హైకోర్టు కొట్టివేసింది. ఇన్నర్ రింగ్ రోడ్డు కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించాలని, విజయవాడ ఏసీబీ కోర్టు నుంచి ఎంపీ, ఎమ్మెల్యేల ప్రత్యేక కోర్టుకు కేసును బదిలీ చేసేలా ఆదేశాలు ఇవ్వాలని వైసీపీ నేత పిటిషన్ వేశారు. అలాగే ఈ కేసులో ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఇచ్చిన ముందస్తు బెయిల్‌ను రద్దు చేయాలని కోరుతూ ఆళ్ల రామకృష్ణారెడ్డి వేర్వేరుగా వ్యాజ్యాలను దాఖలు చేశారు. ఈ పిటిషన్లంటిపై హైకోర్టులో విచారణ జరిగింది. దాదాపు మూడు వారాల పాటు విచారణ జరిగిన అనంతం సోమవారం ఉదయం ధర్మాసనం తీర్పు ఇచ్చింది. ఈ వ్యాజ్యాలన్నింటినీ కొట్టివేస్తూ హైకోర్టు తీర్పునిచ్చింది. అలాగే వ్యాజ్యాల విచారణార్హతపై కూడా ఇటీవల న్యాయస్థానంలో వాదనలు ముగిశాయి. ప్రభుత్వం తరఫున సుప్రీం కోర్టు సీనియర్ న్యాయవాది సిద్దార్థ లూథ్రా వాదనలు వినిపించారు. ఇలాంటి పిటిషన్లకు విచారణార్హత లేదని సిద్దార్థ లూథ్రా వాదించారు. ఈ వాదనలు పరిగణలోకి తీసుకున్న ఏపీ హైకోర్టు.. ఈ పిటిషన్లకు విచారణార్హత లేదంటూ వేర్వేరుగా దాఖలు చేసిన మూడు పిటిషన్లను డిస్మిస్ చేసింది.

# పార్టీలు మార్పులు తప్పవా

**విజయవాడ, మార్చి30( వెలుతురు):**




ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో నాయకుల పాత్ర మరింత కీలకంగా మారుతున్నది. గత ఎన్నికల సమయంలోనే చాలా మంది నాయకులు తమ రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని పార్టీలను మార్చడం కనిపించింది. ఎవరికైతే ఎక్కడ అవకాశాలు కనిపించాయో, వారు ఆ దిశగా అడుగులు వేసిన పరిస్థితి ఏర్పడింది. టీడీపీ , జనసేన, వైసీపీ ఇలా ఏ పార్టీలో చూసినా ఎన్నికల ముందు మార్పులు కనిపిస్తూనే ఉంటాయి.గెలిచిన వారు తమ స్థాయిని పెంచుకోగా, ఓడిన వారు కొత్త అవకాశాల కోసం మళ్లీ రాజకీయ సమీకరణలను పరిశీలిస్తున్నారు.రాబోయే ఎన్నికల నాటికి ఈ మార్పులు మరింత వేగంగా జరుగుతాయని పరిశీలకులు అంచనా వేస్తున్నారు. ముఖ్యంగా నియోజకవర్గాల సంఖ్య పెరిగే అవకాశం ఉండటంతో, రాజకీయ నాయకులకు మరింత స్వేచ్ఛ లభించనుంది. ఇది ఒకవైపు పార్టీలకు కూడా అవసరం అవుతుంది. ఎందుకంటే కొత్త సీట్లు పెరిగినప్పుడు సరైన అభ్యర్థులను ఎంపిక చేయడం కీలకం అవుతుంది. అందువల్ల గెలుపు సామర్థ్యం ఉన్న నాయకులను ఆకర్షించేందుకు పార్టీలు కూడా ముందుకు రావాల్సి ఉంటుంది.గత ఎన్నికల సమయంలో టికెట్ల కోసం జరిగిన రాజకీయ మార్పులు అందరికీ గుర్తున్నాయి. చాలామంది నాయకులు తమకు టికెట్ వచ్చే అవకాశాలను బట్టి పార్టీలు మార్చుకున్నారు. మరోవైపు రాజకీయ పార్టీలు కూడా గెలుపు గుర్రాలుగా భావించిన నాయకులను ప్రత్యేకంగా ఆహ్వానించి పార్టీలో చేర్చుకున్నాయి. ఈ విధంగా ఇరువర్గాల మధ్య పరస్పర ఆధారపడే పరిస్థితి ఏర్పడింది.ఇప్పటి పరిస్థితుల్లో ఈ ధోరణి మరింత పెరిగే అవకాశముంది. నియోజకవర్గాల పునర్విభజన వల్ల కొత్త రాజకీయ సమీకరణాలు ఏర్పడతాయి. కొత్త ప్రాంతాలు, కొత్త ఓటరు సమీకరణాలు రావడం వల్ల నాయకులు తమకు అనుకూలంగా ఉండే పార్టీలు లేదా వర్గాలను ఎంచుకునే స్వేచ్ఛ పొందుతారు. దీంతో రాజకీయాల్లో వ్యక్తిగత నిర్ణయాలకు ఎక్కువ ప్రాధాన్యం పెరిగే అవకాశం ఉంది.అయితే ఈ స్వేచ్ఛకు మరో కోణం కూడా ఉంది. నాయకులు తరచూ పార్టీలు మారడం వల్ల రాజకీయ స్థిరత్వం దెబ్బతినే ప్రమాదం ఉందని కొందరు విశ్లేషకులు అంటున్నారు. 2009లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన సమయంలో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయి. అప్పట్లో అనేక మంది నాయకులు తమకు అనుకూలంగా పార్టీలను మార్చుకుని రాజకీయంగా కొత్త అవకాశాలను అందిపుచ్చుకున్నారు.ఇప్పుడు కూడా అదే పరిస్థితి పునరావృతం అవుతుందా లేదా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. కొందరు నాయకులు పార్టీ పట్ల నిబద్ధత చూపుతారా లేక వ్యక్తిగత ప్రయోజనాలను ముందుకు పెట్టుకుంటారా అన్నది ఆసక్తికరంగా మారింది. ప్రజల అభిప్రాయం కూడా ఈ విషయంలో కీలకంగా మారే అవకాశం ఉంది. మరోపక్క ఇలా పార్టీలు మారిన వారికి పదవులు కట్టు పెట్టడం వల్ల కొన్ని సంవత్సరాలుగా పార్టీని నమ్ముకున్న వారి మనోభావాలు దెబ్బతింటున్నాయి. మొత్తంగా చూస్తే ప్రస్తుతం ఉన్న రాజకీయ వాతావరణం పవర్ఫుల్ నాయకులకు అనుకూలంగా మారుతోంది. ఈ అవకాశాన్ని వారు ఎలా వినియోగించుకుంటారన్నది రాబోయే రోజుల్లో స్పష్టతకు వస్తుంది. భవిష్యత్తులో రాజకీయ సమీకరణాల్లో మార్పులు తప్పవని సంకేతాలు కనిపిస్తున్నాయి.

# సిక్కోలులో దువ్వాడ రాజకీయం

**శ్రీకాకుళం,మార్చి30( వెలుతురు):**



శ్రీకాకుళం జిల్లా రాజకీయాలు చాలా విచిత్రంగా ఉంటాయి. దశాబ్దాలుగా ఇక్కడ రాజకీయం కింజరాపు వర్సెస్ ధర్మాన ఫ్యామిలీ అన్నట్టు ఉంటుంది. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ధర్మాన.. టిడిపి అధికారంలోకి వస్తే కింజరాపు కుటుంబాల హవా ఉంటుంది. అదే చాలామంది రాజకీయ పార్టీల నేతలకు మింగుడు పడని విషయం. ఇప్పుడు అటువంటి సంక్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు దువ్వాడ శ్రీనివాస్. ఆ రెండు కుటుంబాల మధ్య రాజకీయ అనైతిక బంధం కొనసాగుతోందని ఆయన చెబుతున్నారు. గత కొద్ది కాలంగా ఇదే విషయాన్ని పదేపదే హెచ్చరిస్తూ వచ్చారు. ఇప్పుడు ఏకంగా ఆ రెండు కుటుంబాలకు గట్టి వార్నింగ్ ఇస్తున్నారు. దువ్వాడ శ్రీనివాస్ కు నేరుగా రాజకీయ ప్రత్యర్థి కింజరాపు ఫ్యామిలీ కాగా.. ఒకే పార్టీలో ప్రత్యర్థులు ధర్మాన సోదరులు. ప్రస్తుతం వ్యక్తిగత కుటుంబ వ్యవహారాలతో వైసిపి సస్పెన్షన్ వేటులో ఉన్నారు దువ్వాడ శ్రీనివాస్. అయితే వైసీపీలో తన సస్పెన్షన్ కు ధర్మాన, కింజరాపు కుటుంబాలే కారణమని కోపంతో రగిలిపోతున్నారు.అయితే దువ్వాడ శ్రీనివాస్ మాత్రం విచిత్ర పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. తన మనసునిండా జగన్మోహన్ రెడ్డి ఉన్నారని చెబుతున్నారు. అదే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుండి ధర్మాన సోదరులు తనను సస్పెండ్ చేయించారని చెప్పుకొస్తున్నారు. అయినా సరే పార్టీలోకి వస్తానని తేల్చి చెప్తున్నారు. జగన్ మాత్రం ఏం సినిమా హీరో అనుకుంటున్నావా అని వ్యంగ్యంగా అడుగుతున్నారు. అదే సమయంలో కింజరాపు కుటుంబం పై కూడా నోరు పారేసుకుంటున్నారు. నా వెంట్రుక కూడా పీకలేరు అంటూ బాబాయ్ అబ్బాయిలను హెచ్చరిస్తున్నారు. తను చెప్పాలనుకున్నది చెబుతున్న దువ్వాడ శ్రీనివాస్ మాటను ఎవరు వినే పరిస్థితిలో లేరు. జగన్ పై అభిమానం కొండంత ఉంది. కానీ వైసీపీలో చోటు లేదు. ధర్మాన కుటుంబం పార్టీని నాశనం చేసిందని చెబుతున్నారు. కానీ వారు లేకుండా ఇప్పుడు జిల్లాలో పార్టీ లేదు. కింజరాపు ఫ్యామిలీ ఏం చేయలేదని చెబుతున్నారు. కానీ జిల్లాలో ఆ కుటుంబానికి మంచి ఆదరణ ఉంది. అందుకే ఇప్పుడు దువ్వాడ శ్రీనివాస్ సొంత యూట్యూబ్ ఛానల్ పెట్టుకుని కింజరాపు, ధర్మాన కుటుంబం పై ఓ రేంజ్ లో విరుచుకుపడుతున్నారు.శ్రీకాకుళం జిల్లాలో మూలపేట కోర్టు నిర్మాణం దాదాపు చివరి దశకు వచ్చింది. అయితే ఆ పోర్టు తమ ప్రభుత్వ హయాంలో జరిగిందని వైసిపి, ఇటు టిడిపి క్రెడిట్ కోసం ఆరాటపడుతున్నాయి. ధర్మాన సోదరుల నేతృత్వంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీమూలపేట కోర్టు సందర్శనకు సిద్ధపడింది. దీంతో మళ్లీ దువ్వాడ శ్రీనివాస్ కు కోపం వచ్చింది. పళ్ళు కొరుకుతూ రగిలిపోతూ కనిపించారు దువ్వాడ శ్రీనివాస్. ఆ పోర్టు క్రెడిట్ జగన్మోహన్ రెడ్డిదని.. తరువాత తనదేనని చెప్పుకొచ్చారు దువ్వాడ. అయితే దువ్వాడ తాను అభిమానించే జగన్ వద్దకు వెళ్లలేకపోతున్నారు. తాను సాధించానని చెబుతున్న మూలపేట పోర్టును సందర్శించలేకపోతున్నారు. అందుకే ఇప్పుడు ఆ రెండు కుటుంబాలపై పడ్డారు దువ్వాడ. సోషల్ మీడియాలో దీనిపైనే సెటైర్లు పడుతున్నాయి.

## ఇండియన్ గ్యాస్ గూడెం వద్ద వినియోగదారులు ఆందోళన

**వైరా మార్చి30( వెలుతురు):**

వైరా మున్సిపాలిటీలో ఇండియన్ గ్యాస్ శ్రీ కాణిపాక ఏజెన్సీ గోడ ముందు గ్యాస్ వినియోగదారులు ఆందోళన చేశారు. అనంతరం కాలేజీ సిలిండర్లతో వైరా టు జగ్గయ్యపేట జాతీయ రహదారిపై బైఠాయించి ఆందోళన చేశారు. గ్యాస్ బుకింగ్ చేసుకున్న వినియోగదారులు సిలిండర్ల కోసం భారీగా వచ్చారు. దీంతో ఏజెన్సీ నిర్వాహకులు సిలిండర్ల కొరత ఉందని చెప్పారు.ఇంకా ఎన్ని రోజులు కొరత ఉంటుందని నిర్వాహకులను నిలదీశారు. పొంతన లేని సమాధానం చెప్పడంతో వినియోగదారులు ఖాళీ సిలిండర్లతో నడిరోడ్డుపై బైఠాయించి ఆందోళనలకు దిగారు.సుమారు అరగంట పైన రోడ్డుపై ఆందోళన చేయడంతో. మధిర, జగ్గయ్యపేట,బోనకల్లు ప్రధాన రహదారి కావడంతో భారీగా వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి.దీంతో వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. విషయం తెలుసుకున్న స్థానిక ట్రైనీ ఎస్ఐ పవన్ కుమార్ సంఘటన స్థలానికి చేరుకుని, వినియోగదారులకు నచ్చజెప్పి, రోడ్డుకు అడ్డంగా ఉంచిన సిలిండర్లను తొలగించి, ట్రాక్ క్లియర్ చేశారు.

# డీలిమిటేషన్... ఎవరికి లాభం... ఎవరికి నష్టం

**గుంటూరు, మార్చి30( వెలుతురు):**




డీలిమిటేషన్. కేంద్రం ఇచ్చిన ఒకే ఒక్క స్టేట్‌మెంట్‌తో సీట్ల పెంపు ఆశలు పీక్స్‌కు చేరాయి. అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలు పెరగడమే కాదు..ఉమెన్ రిజర్వేషన్లు కూడా అమలయ్యే సిచ్యువేషన్ ఉండటంతో..పార్టీల ఈక్వేషన్స్ మారుతున్నాయి. లీడర్ల లెక్కలు తారుమారయ్యే పరిస్థితి ఉందినియోజకవర్గాల పెంపు పొలిటికల్ హీట్‌ను పెంచుతోంది. లోక్ సభతో సహా అన్ని రాష్ట్రాల అసెంబ్లీ స్థానాలు పెరగనున్నాయి. ఇప్పటికే నిర్ణయం తీసుకున్న కేంద్రం.. ఈ పార్లమెంట్ సెషన్‌లోనే బిల్లును తీసుకొచ్చేందుకు ప్లాన్ చేస్తోంది. వచ్చే ఎన్నికల నాటికి అసెంబ్లీ, ఎంపీ సీట్లు పెరగడం ఒక ఎత్తు అయితే..మహిళా రిజర్వేషన్లు కూడా అమల్లోకి వచ్చే అవకాశం ఉంది. ఏపీలో నియోజకవర్గాల పునర్విభజనతో ప్రస్తుతమున్న 175 స్థానాలు 263కి చేరనున్నాయి. 25 లోక్‌సభ స్థానాలు 38 అవుతాయి. ఈ లెక్కన జిల్లాల వారీగా పెరిగే సీట్లపై లెక్కలు తెరమీదకు వస్తున్నాయ్.సామాజిక సమీకరణాలు..ఉమెన్ రిజర్వేషన్‌ల అమలు పవర్‌ను డిసైడ్ చేయటంలో కీరోల్ ప్లే చేయనున్నాయి. అధికారంలోకి రావటానికి మ్యాజిక్ ఫిగర్ 132 కానుంది. ప్రతిపక్ష హోదా దక్కాలంటే 26 స్థానాలు రావాల్సి ఉంటుంది. మంత్రివర్గ సభ్యుల సంఖ్య 39 వరకు ఉండనుంది. నియోజకవర్గాల పునర్విభజన, మహిళ కోటా ఇంప్లిమెంటేషన్..ఏపీ పొలిటికల్ సినారియోనే మార్చేయనుంఅదనంగా నియోజకవర్గాలు పెరుగుతున్నాయన్న ఆనందం ఒకవైపు ఉంటే, మహిళా రిజర్వేషన్లు నేతలను టెన్షన్ పెడుతున్నాయట. ఏపీలో అసెంబ్లీ సీట్లు 263కి పెరిగితే, ఇందులో 80 సీట్లు మహిళలకు రిజర్వ్ అయ్యే ఛాన్స్ ఉంది. ఉమెన్ కోటా అమలులోకి వస్తే ప్రస్తుతం ఎమ్మెల్యేలుగా ఉన్న చాలామంది నేతల నియోజకవర్గాల్లో రిజర్వేషన్లు మారే అవకాశం ఉంది. దాంతో నేతలు లెక్కల్లో బిజీ అయిపోయారు. నియోజకవర్గాల్లో జనాభా లెక్కలపై ఆరా తీస్తూ..ఏయే నియోజకవర్గాల్లో మహిళల ఓట్లు అత్యధికంగా ఉన్నాయో..ఎక్కడెక్కడ రిజర్వేషన్లు మారే అవకాశం ఉందో పరిశీలిస్తూ..ఇప్పటినుంచే అలర్ట్ అవుతున్నారట.2011 జనాభా లెక్కల ప్రకారం కేంద్రం డీలిమిటేషన్ ప్రక్రియ చేపట్టనుంది. ఇలా చూసినా పలువురు సీనియర్లు, ముఖ్యనేతల స్థానాలు మహిళలకు రిజర్వ్ అయ్యే పరిస్థితి కనిపిస్తోందని అంటున్నారు. సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేశ్, వైసీపీ అధినేత జగన్ ప్రాతినిధ్యం వహిస్తున్న నియోజకవర్గాల్లో మహిళల ఓట్లు అత్యధికంగా ఉండటం ఉత్కంఠ రేపుతోంది.ఏపీలో ఓట్లపరంగా అతిపెద్ద నియోజకవర్గం భీమిలి. ఇక్కడ దాదాపు 3 లక్షల 55 వేల ఓట్లు ఉన్నాయి. ఇందులో సగానికి పైగా అంటే దాదాపు ఒక లక్షా 80 వేల మంది మహిళా ఓటర్లు ఉన్నారు. గాజువాక, పెనమలూరు, విజయవాడ సెంట్రల్ నియోజకవర్గాలు కూడా ఓట్ల పరంగా భీమిలి తర్వాతి స్థానంలో నిలిచాయి. ఈ నియోజకవర్గాల్లో కూడా మహిళా ఓటర్లు అధికంగానే ఉన్నారని చెబుతున్నారు. డీలిమిటేషన్ తర్వాత గాజువాక, పెనమలూరు, విజయవాడ సెంట్రల్ సెగ్మెంట్లు కూడా మహిళలకు రిజర్వ్ అవుతాయా? అనేది చర్చగా ఉందఇక సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో మొత్తం 2 లక్షల 30 వేల మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళా ఓటర్లు లక్షా 17వేల మంది. ఇక డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ నియోజకవర్గం పిఠాపురంలో రెండు లక్షల 34 వేల ఓట్లు ఉంటే ఇందులో మహిళా ఓటర్లు 1.19 లక్షల మంది. మంత్రి నారా లోకేశ్ నియోజకవర్గం మంగళగిరిలో మొత్తం ఓటర్లు 2 లక్షల 95 వేలు. ఇందులో మహిళలు లక్షా 51 వేల మంది. ఇక మాజీ సీఎం, వైసీపీ అధినేత జగన్ నియోజకవర్గం పులివెందులలో కూడా పురుషుల కంటే మహిళలే ఎక్కువగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. పులివెందులలో 2 లక్షల 34 వేల మంది ఓటర్లు ఉంటే.. అందులో లక్షా 19వేల మంది మహిళలు ఉన్నారు.రాష్ట్రంలోని మొత్త ఓటర్లలో సగం కంటే ఎక్కువగా మహిళలే ఓటర్లుగా ఉండటంతో..సీనియర్ లీడర్లకు రిజర్వేషన్ల జ్వరం పట్టుకున్నట్లు ఇన్‌సైడ్ టాక్. ఏపీలో చాలా నియోజకవర్గాల్లో మహిళా ఓటర్లు పురుషుల కంటే 2 నుంచి 4 శాతం అధికంగా ఉన్నట్లు లెక్కలు చెబుతున్నాయి. అందుకే సంక్షేమ పథకాలు, రాజకీయ సమీకరణాల్లో మహిళా ఓటు బ్యాంక్‌పై పార్టీలు, నేతలు ఎక్కువ ఫోకస్ చేస్తుంటారని అంటున్నారు. అయితే మహిళలు చట్ట సభలకు ప్రాతినిధ్యం వహించే అవకాశం ఏర్పడటంతో ఓవరాల్ పొలిటికల్ ఈక్వేషన్స్ మొత్తం మారిపోయే పరిస్థితి కనిపిస్తోంది.ఓ వైపు 175 అసెంబ్లీ సీట్లు 263కు పెరుగుతున్నాయన్న ఆనందం..కొత్త వారికి అవకాశం వస్తుందన్న ఆశలు..అలా ఉండగా..ఉమెన్ కోటా పార్టీలకు, లీడర్లకు టెన్షన్ పుట్టిస్తోంది. కంచుకోట లాంటి తమ నియోజకవర్గాల్లో రిజర్వేషన్లు మారితే పక్కనున్న మరో సెగ్మెంట్‌కు షిఫ్ట్ కావాల్సిన పరిస్థితి. అదే జరిగితే మరో నియోజకవర్గానికి మారితే గెలుపు అవకాశాలు అంత ఈజీగా ఉండకపోవచ్చు. పైగా మహిళలకు 80 సీట్లు రిజర్వ్ కానున్నాయి. 80 మంది బలమైన మహిళా నేతలను పోటీలో పెట్టి గెలిపించుకోవడం కూడా పార్టీలకు సవాల్‌గా మారనుంది. ఒకేసారి రెండు కీలక అంశాలు ఎన్నికల రేసును మార్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. డీలిమిటేషన్‌తో ఎవరి సీట్లు గల్లంతు కాబోతున్నాయో? మహిళా రిజర్వేషన్లతో ఎవరి సీటుకు ఎసరు వస్తుందో..? అటు డీలిమిటేషన్..ఇటు ఉమెన్ కోటా ఎన్నికల ఫలితాలను ఎలా డిసైడ్ చేస్తాయో చూడాలి మరి.

# పీఎన్‌జీ వాడితే లాభం, ఆదాయం

**- ప్రమోషన్ ప్రారంభించిన ఏపీ సర్కార్**

**విజయవాడ మార్చి30( వెలుతురు):**



అమెరికా, ఇరాన్ యుద్ధం ప్రభావంతో ముడిచమురుతో పాటు ఎల్పీజీ సిలిండర్ల సరఫరాకు అవాంతరాలు తలెత్తాయి. ఈ పరిస్థితుల్లో ఏపీ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఎల్పీజీ కనెక్షన్ల నుంచి పీఎన్‌జీ కనెక్షన్లకు మారేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్న చంద్రబాబు ప్రభుత్వం తాజాగా వారికి సబ్సిడీ బెనిఫిట్స్ అందించాలని నిర్ణయం తీసుకుంది. ఖఔఉ కనెక్షన్‌కు మారినప్పటికీ లబ్ధిదారులకు దీపం పథకం వర్తింపజేసి నగదు వారి ఖాతాల్లో రూ.2400 జమచేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ ప్రకటించారు. పీఎన్‌జీ కనెక్షన్‌కు మారుతున్నందుకు కేంద్రం ఇచ్చే రూ.500 రాయితీ కూడా లభించనుంది. ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రానున్న నెల రోజుల్లో లక్షకు పైగా పైప్డ్ నేచురల్ గ్యాస్ కనెక్షన్లు అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. వెలగపూడి సచివాలయంలో జరిగిన మీడియాతో ఆయన మాట్లాడుతూ.. విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కాకినాడ, విశాఖపట్నం, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో ఎల్పీజీ సిలిండర్ల వినియోగదారులను పీఎన్జీ వైపు మళ్లించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని వివరించారు. ఈ నగరాల్లో 10 లక్షల పీఎన్జీ కనెక్షన్లు ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. అపార్ట్‌మెంట్లు, పారిశ్రామిక యూనిట్లు ఈ సౌకర్యాన్ని వినియోగిస్తే కేంద్ర ప్రభుత్వ ప్రోత్సాహకాలు కూడా లభిస్తాయని పేర్కొన్నారుప్రముఖ పుణ్యక్షేత్రాలైన తిరుమల తిరుపతి, విజయవాడ కనకదుర్గమ్మ ఆలయం, శ్రీకాళహస్తి, సింహాచలం, అన్నవరం దేవస్థానాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అన్న క్యాంటీన్లకు కూడా ఖఔఉ కనెక్షన్లు మంజూరు చేయాలని నిర్ణయించినట్లు మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు, దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోనే అపార్ట్‌మెంట్లు, హోటళ్లు, పారిశ్రామిక యూనిట్లకు కనెక్షన్లు ఇచ్చేలా చర్యలు తీసుకుంటున్నామని, అవసరమైతే ఇందుకోసం 'ఆటోమేటిక్ పర్మిషన్ సిస్టమ్'ను తీసుకువస్తామని స్పష్టం చేశారు.గత ప్రభుత్వ హయాంలో జీఎస్టీని 5 శాతం నుండి 25 శాతానికి పెంచడం వల్లే పీఎన్జీపై ప్రజలు ఆసక్తి చూపలేదని మంత్రి నాదెండ్ల మనోహర్ విమర్శించారు. ఇకపై 'దీపం' పథకం కింద ఇచ్చే సబ్సిడీని పీఎన్జీ వినియోగదారులకు కూడా వర్తింపజేస్తామని ప్రకటించారు. ఖఔఉ వినియోగదారులకు నిబంధనల మేరకు 2 నెలలకు ఒకసారి సబ్సిడీ ప్రయోజనం అందే విధంగా మార్పులు చేయనున్నట్లు వెల్లడించారు. ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లకు సమానమైన రూ. 2400 నగదును పీఎన్జీ వినియోగదారుల ఖాతాల్లోకి డీబీటీ ద్వారా జమ చేస్తామని తెలిపారు. రాష్ట్రంలో సుమారు 94 లక్షల మంది దీపం పథకం లబ్ధిదారులు ఉన్నారు. సోషల్ మీడియాలో వస్తున్న గ్యాస్ కొరత వార్తలను మంత్రి తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో ఎక్కడా గ్యాస్ కొరత లేదని, ప్రతిరోజూ సుమారు 2.70 లక్షల నుండి 2.80 లక్షల సిలిండర్లు సరఫరా అవుతున్నాయని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు. వదంతుల కారణంగా ప్రజలు అనవసరంగా గ్యాస్ బుక్ చేయడంతో కొంత ఒత్తిడి పెరిగిందని, ప్రస్తుతం పరిస్థితి చక్కబడిందని ఆయన వివరించారు. ఎవరైనా బ్లాక్ మార్కెట్‌కు పాల్పడినా లేదా అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ సమావేశంలో పౌర సరఫరాల శాఖ కమిషనర్ సౌరవ్ గౌర్ కూడా పాల్గొన్నారు.

# బంగారు తవ్వకాలు షురూ...

**కర్నూలు, మార్చి30( వెలుతురు):**



భారతదేశం ప్రపంచంలోనే రెండో అతిపెద్ద బంగారు వినియోగదారు అయినప్పటికీ, మన దేశీయ ఉత్పత్తి చాలా తక్కువగా ఉంది. ఈ లోటును భర్తీ చేస్తూ ఆంధ్రప్రదేశ్ వేదికగా ఒక చారిత్రాత్మక అడుగు పడబోతోంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని జొన్నగిరి, ఎర్రగుడి, పగిడిరాయి గ్రామాల్లో విస్తరించి ఉన్న ఈ గని, భారతదేశపు మొట్టమొదటి భారీ ప్రైవేట్ గోల్డ్ మైనింగ్ ప్రాజెక్టుగా అవతరించింది.ఈ ప్రాజెక్టును జియో మైసూర్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టింది. ఇందులో బాంబే స్టాక్ ఎక్స్ఛేంజ్ లో లిస్టెడ్ కంపెనీ అయిన డెక్కన్ గోల్డ్ మైన్స్ లిమిటెడ్ కీలక భాగస్వామిగా ఉంది. 2025 జూన్-జూలై నాటికి అవసరమైన పర్యావరణ అనుమతులు పొందిన ఈ ప్రాజెక్టు, ఇప్పటికే ట్రయల్ రన్ ప్రారంభించింది. నవంబర్ 2025 నాటికి పూర్తిస్థాయి వాణిజ్య ఉత్పత్తి ప్రారంభించాలని లక్ష్యంగా పెట్టుకుంది.ప్రారంభ దశలో ఏటా సుమారు 750 కిలోల నుంచి 900 కిలోల శుద్ధి చేసిన బంగారాన్ని ఉత్పత్తి చేయాలని భావిస్తున్నారు. రాబోయే 2-3 ఏళ్లలో ఈ సామర్థ్యాన్ని ఏటా 1 టన్నుకు పెంచే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా మొదటి ఏడాదిలోనే దాదాపు 300 నుంచి 350 కోట్ల రూపాయల ఆదాయం సమకూరవచ్చని అంచనా. ప్రస్తుతం భారత్ ఏటా కేవలం 1.5 టన్నుల బంగారాన్ని మాత్రమే ఉత్పత్తి చేస్తోంది. జొన్నగిరి గని అందుబాటులోకి వస్తే దేశీయ ఉత్పత్తి దాదాపు రెట్టింపు అవుతుంది.ఈ ప్రాజెక్టు సక్సెస్ వెనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ వేగవంతమైన అనుమతులు , మౌలిక సదుపాయాల కల్పన ప్రధాన పాత్ర పోషించాయి. ఓపెన్ పిట్ మైనింగ్ ద్ధతిలో అత్యాధునిక సాంకేతికతను వాడుతూ, పర్యావరణ నియమాలను పాటిస్తూ ఈ తవ్వకాలు జరుగుతున్నాయి. ఈ గని సుమారు 15 ఏళ్ల పాటు నిరంతరంగా బంగారాన్ని ఉత్పత్తి చేసే సామర్థ్యం కలిగి ఉందని నిపుణులు విశ్లేషిస్తున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా స్థానికంగా సుమారు 300 మందికి ప్రత్యక్షంగా, మరో 300 మందికి పరోక్షంగా ఉపాధి లభిస్తుంది. అంతేకాకుండా, గని చుట్టుపక్కల గ్రామాల్లో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య సౌకర్యాలను అభివృద్ధి చేసేందుకు నిర్వాహక సంస్థ కృషి చేస్తోంది. అతిపెద్ద దిగుమతి వస్తువుగా ఉన్న బంగారం విషయంలో భారతదేశం స్వయం సమృద్ధి దిశగా సాగడానికి జొన్నగిరి ప్రాజెక్టు ఒక దిక్సూచిగా నిలవనుంది. కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి వేదికగా భారీ ఎత్తున బంగారు గనుల తవ్వకం ప్రాజెక్టు పట్టాలెక్కుతోంది. కర్ణాటకలోని కోలార్ గోల్డ్ ఫీల్డ్స్ తరహాలో, భారతదేశపు తదుపరి అతిపెద్ద బంగారు గనిగా అవతరించబోతోంది. జియో మైసూర్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ నేతృత్వంలో సాగుతున్న ఈ ప్రాజెక్టు, అత్యాధునిక సాంకేతికతతో దేశీయంగా బంగారు ఉత్పత్తిని పెంచడమే లక్ష్యంగా పెట్టుకుంది.ఈ ప్రాజెక్టుకు సంబంధించి ప్రభుత్వం వేగంగా ఇస్తున్న అనుమతులు , పారదర్శకమైన విధానాలు పెట్టుబడిదారుల్లో నమ్మకాన్ని నింపుతున్నాయి. దశాబ్దాలుగా నత్తనడకన సాగిన ఈ గనుల తవ్వకం అంశంపై, ప్రస్తుత ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించి మౌలిక సదుపాయాల కల్పన , అనుమతుల ప్రక్రియను వేగవంతం చేసింది. ఇది కేవలం ఒక మైనింగ్ ప్రాజెక్టు మాత్రమే కాకుండా .. జాతీయ ప్రాధాన్యమున్న ప్రాజెక్టుగా గుర్తిస్తున్నారు.జొన్నగిరి గోల్డ్ ప్రాజెక్టు ద్వారా ఏటా సుమారు 750 కిలోల బంగారాన్ని ఉత్పత్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే, స్థానికంగా వేలాది మందికి ఉపాధి లభించడమే కాకుండా, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థకు పెద్ద ఎత్తున ఆదాయం సమకూరనుంది. అనుబంధ పరిశ్రమల ఏర్పాటుతో ఈ ప్రాంతం పారిశ్రామిక హబ్‌గా మారే అవకాశం ఉంది. ఈ గోల్డ్ మూమెంట్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రతిష్టను అంతర్జాతీయ స్థాయిలో పెంచుతోంది. గనుల తవ్వకంలో పర్యావరణ నియమాలను పాటిస్తూనే, పారిశ్రామికాభివృద్ధికి పెద్దపీట వేయడం ద్వారా రాష్ట్రం పెట్టుబడులకు స్వర్గధామంగా మారుతోంది. దేశ అవసరాలకు తగ్గట్టుగా బంగారు దిగుమతులను తగ్గించి, స్వయం సమృద్ధి దిశగా అడుగులు వేయడంలో జొన్నగిరి కీలక పాత్ర పోషించనుందని భావిస్తున్నారు.

# చిరుతో మరోమారు బాబీ సినిమా

మన శంకర వరప్రసాద్ గారు అనే చిత్రంతో మంచి హిట్ కొట్టిన చిరంజీవి ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో అభిమానులను అలరించేందుకు సిద్ధమవుతున్నారు. ఈ చిత్రం తన కెరీర్‌లో 158వ చిత్రంగా రూపొందుతుంది. ఈ చిత్రాన్ని గతంలో 'వాల్తేరు వీరయ్య'తో బాక్సాఫీస్ వద్ద సెన్సేషన్ సృష్టించిన దర్శకుడు కేఎస్ రవీంద్ర (బాబీ) తెరకెక్కిస్తున్నారు. ఈ హిట్ కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. 'వాల్తేరు వీరయ్య' తర్వాత బాబీ మెగాస్టార్‌ను మరింత పవర్‌ఫుల్‌గా చూపించబోతున్నారని సినీ వర్గాల్లో చర్చ నడుస్తోంది.తాజా సమాచారం ప్రకారం, ఈ క్రేజీ ప్రాజెక్ట్ రెగ్యులర్ షూటింగ్ ఏప్రిల్ 20, 2026 నుంచి ప్రారంభం కానుంది. ఇప్పటికే ప్రీ-ప్రొడక్షన్ పనులు పూర్తయ్యాయి. బెంగాల్ బ్యాక్‌డ్రాప్‌లో తండ్రీకూతుళ్ల భావోద్వేగాలతో కూడిన మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా ఈ కథను రూపొందించినట్లు సమాచారం. ఈ సినిమాను వచ్చే ఏడాది సంక్రాంతి కానుకగా విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ కేవీఎన్ ప్రొడక్షన్స్ అత్యంత భారీ బ్జడెట్‌తో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోంది. టాలీవుడ్ మాత్రమే కాకుండా ఇతర ఇండస్ట్రీల నుంచి కూడా ప్రముఖ నటులను ఎంపిక చేస్తున్నట్లు వార్తలు వినిపిస్తున్నాయి.సినిమా కాస్టింగ్ విషయంలో కూడా ఆసక్తికర విషయాలు బయటకు వస్తున్నాయి. మెగాస్టార్‌కు భార్య పాత్రలో నేషనల్ అవార్డ్ విన్నర్ ప్రియమణి నటించనున్నట్లు తెలుస్తోంది. కూతురు పాత్రలో 'కన్నప్ప' ఫేమ్ ప్రీతి ముకుందన్ ఎంపికైనట్లు సమాచారం.



# రూ.1,365 కోట్లు సాధించిన 'ధురంధర్ 2'..

## దరుంధర్ చూసి పాఠాలు నేర్చుకోవాలన్న ఆర్జీవి

రణ్‌వీర్ సింగ్ హీరోగా తెరకెక్కిన దురంధర-2 చిత్రం తొలిరోజు నుంచే వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఇప్పటివరకూ ప్రపంచవ్యాప్తంగా రూ.1,365 కోట్లు తన ఖాతాలో వేసుకుంది. దీంతో మొదటిభాగం ఆల్‌టైమ్ కలెక్షన్ల రూ.1,307 కోట్లును ఈ సీక్వెల్ కేవలం 11 రోజుల్లోనే దాటేసింది. ఇకపోతే ఉలవురు ప్రముఖులు ఈ చిత్రాన్ని ప్రశంసిస్తూనే ఉన్నారు. తాజాగా దర్శకుడు రామ్ గోపాల్ వర్మ మరోసారి సోషల్ మీడియా వేదికగా సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిత్య ధర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'ధురంధర్ 2' బాక్సాఫీస్ వద్ద సృష్టిస్తోన్న ప్రభంజనంపై స్పందిస్తూ.. చిత్ర పరిశ్రమలోని ప్రముఖుల మౌనాన్ని ఆయన ప్రస్తావించారు. ఈ సినిమా సాధించిన విజయం ఒక 'అణుబాంబు' లాంటిదని ఆయన అన్నారు. ఆదిత్య ధర్ చిత్ర పరిశ్రమ కింద ఒక అణుబాంబును పేల్చారు. కానీ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే.. మిగిలిన చిత్ర పరిశ్రమ అంతా మౌనం పాటిస్తోంది. 'ధురంధర్ 2' పేలుడు ధాటికి అందరూ అంతరిక్షంలోకి వెళ్లారేమో.. అందుకే వారి చప్పట్లు ఇక్కడికి వినిపించడం లేదు. బహుశా వారంతా ఇది కేవలం ప్రచారమే అని, త్వరలోనే తగ్గిపోతుందని తమలో తాము గుసగుసలాడుకుంటున్నారేమో. అలా అనుకుంటూ మళ్లీ పాత కాలపు మూస సినిమాలను తీయాలని చూస్తున్నారు. లేదా ఈ సినిమా అద్భుతమైన విజయాన్ని



చూసి, తాము తీస్తున్న సినిమాలు దీని ముందు నిలవలేవని అనుకొని మౌనంగా ఉంటున్నారేమో అంటూ వ్యాఖ్యానించారు. కల్లెదుట డైనోసార్ లాంటి సినిమా నిలబడి నిప్పులు కురిపిస్తుంటే, దాని బాక్సాఫీస్ గర్జనతో భూమి కంపిస్తుంటే.. కళ్లు మూసుకోవడం సరైన పద్ధతి కాదు. నా సహచరులందరికీ నేను ఇచ్చే సలహా ఒక్కటే.. 'ధురంధర్ 2' సినిమాను ఒక పాఠంలా చదవండి. దీన్ని చూసి మీ చిత్రాల్లో మార్పులు చేసుకోండి' అని ఆర్జీవీ సలహా ఇచ్చారు. ప్రస్తుతం ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.







## ఓటీటీలోకి సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని

శివాజీ, లయ, రోహన్ నటించిన తాజా చిత్రం సాంప్రదాయిని సుప్పిని సుద్దపూసని. మార్చిలో థియేటర్‌లో విడుదలై నవ్వులు పంచిన ఈ సినిమా ఇప్పుడు ఓటీటీ ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమైంది. ఏప్రిల్ 3 నుంచి నెట్‌ఫ్లిక్స్ వేదికగా స్ట్రీమింగ్ కానుంది. సుధీర్ శ్రీరామ్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో అలీ, ధనరాజ్, ఇమ్మాన్యుయేల్ నవ్వులు పూయించారు. శ్రీరామ్ (శివాజీ) నిజాయతీపరుడైన పంచాయతీ కార్యదర్శి. కొత్తకోట సమీపంలోని హార్స్‌లీహిల్స్‌లో భార్య ఉత్తర (లయ), కొడుకు బిట్టు అలియాస్ నితిన్ (రోహన్)తో కలిసి జీవిస్తుంటాడు. ఓ దీపావళి రోజున వాళ్ల ఇంటికి ఆ ఊరి ఎస్సై విక్రమ్ వాసుదేవ్ (ప్రిన్స్) వస్తాడు. అతనికి ఆడవాళ్ల పిచ్చి. అప్పటికే శ్రీరామ్‌తో ఓసారి గొడవ జరుగుతుంది. దీంతో అతనిపై పగ పెంచుకున్న విక్రమ్.. ఇంట్లో తను లేడని తెలిసి ఉత్తరపై అఘాయిత్యానికి ప్రయత్నిసాడు. కట్ చేస్తే.. అనూహ్యంగా శ్రీరామ్ కొడుకు చేతిలో ఆ ఎస్సై హత్యకు గురవుతాడు. మరి ఆ తర్వాత ఏమైంది? ఆ హత్య కేసు నుంచి తన కుటుంబాన్ని కాపాడుకునేందుకు శ్రీరామ్ ఏం చేశాడు? రూ.కోటి డబ్బుతో ఉన్న తన గిఫ్ట్ బ్యాగ్ ఎత్తుకెళ్లారంటూ స్థానిక ఎమ్మెల్యే తిమ్మప్ప (శరత్ లోహితాశ్వ) గ్యాంగ్ శ్రీరామ్ వెంట పడటానికి కారణమేంటి? ఈ మొత్తం కథకు కానిస్టేబుల్ సుధీర్ (ధనరాజ్)కు ఉన్న సంబంధం ఏంటి? అన్నది చిత్ర కథ.

# ప్రకాశ్‌రాజ్‌కు మాతృవియోగం

## సంతాపం ప్రకటించిన పవన్

విలక్షణ నటుడు ప్రకాశ్ రాజ్ కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది. ఆయన మాతృమూర్తి సువర్ణలత (86) సోమవారం ఉదయం బెంగళూరులోని స్వగృహంలో కన్నుమూశారు. అనారోగ్య సమస్యలతో గత కొంతకాలంగా బాధపడుతున్న ఆమె ఆరోగ్యం విషమించడంతో తుది శ్వాస విడిచారు. తల్లితో ఎంతో ఆత్మీయ అనుబంధం కలిగిన ప్రకాశ్ రాజ్, షూటింగ్‌లతో బిజీగా ఉన్నప్పటికీ తరచూ ఆమెను పరామర్శించేవారు. మరణవార్త తెలియగానే వెంటనే బెంగళూరుకు చేరుకున్న ఆయన, కుటుంబ సభ్యులతో కలిసి అంత్యక్రియల ఏర్పాట్లలో పాల్గొన్నారు. ఈ విషాద ఘటనపై పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు.



ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సోషల్ మీడియా ద్వారా స్పందిస్తూ, 'ప్రకాశ్ రాజ్ గారి మాతృమూర్తి సువర్ణలత గారి మరణ వార్త తెలిసి తీవ్రంగా విచారించాను. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని కోరుకుంటున్నాను. ఈ దుఃఖ సమయంలో ప్రకాశ్ రాజ్ గారికి, వారి కుటుంబ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నాను' అని పేర్కొన్నారు. ప్రకాశ్ రాజ్ కుటుంబం ఈ విషాదాన్ని ధైర్యంగా ఎదుర్కొనాలని సినీ వర్గాలు, అభిమానులు కోరుకుంటున్నారు.




# సితార ఎంటర్‌టైనర్‌లో నితిన్

చాలా కాలంగా సరైన బ్రేక్ కోసం ఎదురుచూస్తున్న టాలీవుడ్ యంగ్ హీరోల్లో ఒకరు నితిన్. హిట్టు, ప్లాపులతో సంబంధం లేకుండా సినిమాలు చేస్తున్న నితిన్ తాజాగా కొత్త ప్రాజెక్టును రివీల్ చేశాడు. సోమవారం నితిన్ కు పుట్టినరోజు సందర్భంగా శుభాకాంక్షలు తెలియజేస్తూ మేకర్స్ ఈ కొత్త సినిమాను ప్రకటించారు. టాలీవుడ్ లీడింగ్ ప్రొడ్యూసర్ సూర్య దేవర నాగవంశీ సితార ఎంటర్‌టైన్ మెంట్స్‌పై ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రొడక్షన్ నంబర్ 43గా రాబోతున్న ఈ చిత్రాన్ని డైరెక్ట్ చేయబోయేది ఎవరనేది క్లారిటీ రావాల్సి ఉంది. స్టైలిష్ లుక్‌లో ఉన్న నితిన్ తాజా స్టిల్‌లో కనిపిస్తుండగా.. ఇంతకీ ఈ మూవీ ఎలాంటి స్టోరీతో రాబోతుంది. హీరోయిన్, ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణులు ఎవరనే దానిపై రానున్న రోజుల్లో క్లారిటీ ఇవ్వనున్నారు మేకర్స్. నితిన్ నటించిన ఎక్స్‌ట్రా ఆర్డినరీ మ్యాన్, రాబిన్ హుడ్, తమ్ముడు చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మూవీ లవర్స్‌ను నిరాశపరిచాయి. ఈ నేపథ్యంలో ఈ సారి ఎలాగైనా మంచి హిట్ కొట్టాలని చూస్తున్నాడు నితిన్. మరి నితిన్‌కు ఈ సినిమానైనా కలిసొస్తుందేమో చూడాలంటున్నారు మూవీ లవర్స్.

# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ

బాలీవుడ్ స్టార్ హీరో సల్మాన్ ఖాన్‌తోవంశీ పైడిపల్లి సినిమా చేయనున్నట్లు ఎప్పటినుంచో వార్తలు వస్తోన్న విషయం తెలిసిందే. ఈ ప్రాజెక్ట్‌పై అధికారిక ప్రకటన వెలువడింది. శ్రీవెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై ఇది రానున్నట్లు తెలుపుతూ ఓ ఫొటో షేర్ చేసింది. ఏప్రిల్ నుంచి దీని షూటింగ్ ప్రారంభం కానున్నట్లు వెల్లడించింది. ఇందులో హీరోయిన్‌గా నయనతారను ఎంపిక చేసినట్లు కూడా ఇటీవల వార్తలు వచ్చాయి. బాలీవుడ్ సీనియర్ నటుడు అనిల్‌కపూర్ ఓ కీలక పాత్రలో కనిపించనున్నట్లు సమాచారం. త్వరలోనే నటీనటుల వివరాలు పంచుకోనున్నారు. 2027లో దీన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం సల్మాన్ ఖాన్ 'మాతృభూమి'లో నటిస్తున్నారు. దీనితోపాటే వంశీ సినిమాను కూడా మొదలు పెట్టనున్నట్లు తెలుస్తోంది. భారీస్థాయిలో దీన్ని తెరకెక్కించనున్నారు. నిజానికి సల్మాన్‌కు మంచి హిట్ పడి చాలాకాలం అయింది. మరోవైపు వంశీ కూడా చివరిగా విజయ్ హీరోగా 'వారసుడు' రూపొందించారు. అది అనుకున్న స్థాయిలో అంచనాలను అందుకోలేకపోయింది. అప్పటినుంచి సల్మాన్ ప్రాజెక్ట్ పైనే వర్క్ చేశారు. దీంతో ఈ ప్రాజెక్ట్ ఇద్దరికీ కీలకంగా మారింది.



# కరువు మండల విద్యార్థులకు డ్రై రేషన్

**అమరావతి, మార్చి30( వెలుతురు):**

కరువు మండలాల్లోని విద్యార్థుల ఆకలిని తీర్చేందుకు వేసవిలో డ్రై రేషన్ పంపిణీకి ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వం గతేడాది గుర్తించిన 51 కరువు మండలాల్లో విద్యార్థులకు వేసవిలో డ్రైరేషన్ ఇవ్వాలని మధ్యాహ్న భోజన విభాగం ఉత్తర్వులు జారీచేసింది. ఒక్కో విద్యార్థికి... ప్రాథమిక పాఠశాలల్లో 4 కిలోల బియ్యం, ఉన్నత పాఠశాలల్లో 6కిలోల బియ్యం, 35 గుడ్లు, 21 చిక్కీలు అందజేస్తారు. రెండు నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థులకు ఇది వర్తిస్తుంది.

# నరసరావుపేట కుటుంబ ఆత్మహత్యాయత్నం కేసు

**- చికిత్స పొందుతూ డాక్టర్ గోపి మృతి**

**- ఇప్పటికే మృతి చెందిన భార్య, కూతురు**

**పల్నాడు, మార్చి30( వెలుతురు):**

నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్యాయత్నం ఘటనలో మరొకరు మృతి చెందారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ వైద్యుడు గోపి సోమవారం చనిపోయారు. నరసరావుపేటలో డాక్టర్ కుటుంబం ఆత్మహత్య తీవ్ర విషాదాన్ని నింపింది. నాదెండ్ల మండలానికి చెందిన డాక్టర్ కుంభ గోపి కుటుంబం ఆదివారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. ఈ ఘటనలో మూడేళ్ల చిన్నారి మౌనిక, భార్య శంకర కుమారి మృతి చెందగా.. డాక్టర్ గోపి ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఉదయం కన్నుమూశారు. గోపి కుటుంబం భోపాల్‌లో నివాసం ఉంటోంది. భోపాల్ ఎయిమ్స్‌లో గోపి డాక్టర్‌గా, అతడి భార్య శంకర కుమారి నర్స్‌గా పనిచేస్తున్నారు. వారికి మూడేళ్ల కుమార్తె మౌనిక ఉంది. చిన్నారి మౌనికకు పుట్టినప్పటి నుంచి డౌన్ సిండ్రోమ్ అనే అనారోగ్య సమస్య ఉండటంతో తండ్రి గోపి తీవ్ర మనస్తాపం చెందారు. ఈ కారణంగా గోపి కుటుంబంతో సహా ఆత్మహత్యాయత్రం చేసినట్లు తెలుస్తోంది. గోపి కుటుంబం శనివారం రాత్రి భోపాల్ నుంచి నరసరావుపేటకు వచ్చింది. ఓ లాడ్జిలో రూమ్ తీసుకుని చిన్నారితో సహా భార్యాభర్తలు ఆత్మహత్య చేసుకున్నారు. మత్తు ఇంజెక్షన్ తీసుకుని బలవన్మరణానికి పాల్పడినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# వేతనసవరణ కమిటీ చైర్మన్‌ను నియమించాలి

**విజయవాడ, మార్చి30( వెలుతురు):**

ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్లు ఎంతో కాలంగా ఎదురు చూస్తున్న వేతన సవరణ కమిటీ చైర్మన్ నియామకాన్ని వెంటనే చేపట్టాలని ఏపీఎన్జీజీవో సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, ఏపీజేఏసీ చైర్మన్ విద్యాసాగర్ డిమాండ్ చేశారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు ఏడాదిగా విరమణ బెనిఫిట్స్ రాక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వెంటనే బెనిఫిట్స్ చెల్లించాలని కోరారు.

# చివరి ధాన్యం గింజ వరకు కొంటాం

**- 8గంటల్లోనే రైతుల ఖాతాల్లోకి డబ్బులు**

**- కోవూరు మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రం**

**- ఎమ్మెల్యే ప్రశాంతితో కలిసి పరిశీలించిన మంత్రి నాదెండ్ల**



**నెల్లూరు, మార్చి30( వెలుతురు):**

చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేస్తామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. ధాన్యం అమ్మిన ఎనిమిది గంటల్లోనే రైతుల ఖాతాల్లో డబ్బులు పడేలా చూస్తున్నామని మంత్రి అన్నారు. క్షేత్రస్థాయిలోనూ రైతులు.. డబ్బులు వేగంగా పడుతున్నాయని చెప్పడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి నియోజకవర్గంలో ప్రత్యేకంగా కల్లాలు ఏర్పాటు చేస్తామని ఆయన ప్రకటించారు. నెల్లూరు జిల్లా సాగు చాలా ప్రత్యేకమైనదని మంత్రి అన్నారు. రాష్ట్రంలోని ఇతర ప్రాంతాలతో పోలిస్తే 40 నుంచి 60 రోజులు ఆలస్యంగా దిగుబడి వచ్చే ప్రాంతమిది అని చెప్పుకొచ్చారు. సోమవారం ఉదయం కోవూరు మండలం ఇనమడుగులోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంత్రి నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా పొలాల్లో రైతులతో మాట్లాడి వారి సమస్యలు, ఇబ్బందులు తెలుసుకున్నారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ.. రైతుల నుంచి ధాన్యాన్ని మొత్తం కొనుగోలు చేయాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పక్కా ఏర్పాట్లు చేసిందని వెల్లడించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో నెల్లూరు జిల్లా నుంచి ఒక్క ధాన్యం గింజ కూడా కొనుగోలు చేయలేదని, రైతులను నిలువునా ముంచేశారని ఆయన ఆరోపించారు. ధాన్యం కొనుగోలు విషయంలో అప్పటి నేతలు గోల్‌మాల్ చేసి రూ.82 కోట్ల మేర అవినీతి చేశారని మంత్రి నాదెండ్ల మనోహర్ ఆరోపించారు. ప్రస్తుతం ధాన్యం కొనుగోలు వ్యవస్థలను క్రమబద్ధీకరిస్తున్నామని చెప్పారు. గత ఏడాది 75 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించగా, ఈ ఏడాది 2.50 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయాలని లక్ష్యం పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. ఇప్పటికే 60 వేల మెట్రిక్ టన్నులు సేకరించామన్నారు. రైతులందరూ ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే అమ్మాలని సూచించారు. రైతులకు తేమ సమస్య ఉందని, 22 శాతం తేమ ఉన్నా ధాన్యం తీసుకునేలా ఆదేశాలు ఇస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఆధునిక డ్రోన్లు ఇచ్చిన తరహాలో డ్రయర్లు కూడా రైతులకు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. జిల్లాలోని రైస్ మిల్లులన్నీ వెంటనే బ్యాంక్ గ్యారంటీలు ఇవ్వాలని, అలా చేయని పక్షంలో వాటిని బ్లాక్ లిస్ట్‌లో పెడతామని మంత్రి హెచ్చరించారు. మిల్లర్ల అవకతవకలు, నిర్లక్ష్యం సహించేది లేదని మంత్రి నాదెండ్ల మనోహర్ స్పష్టం చేశారు.

# నల్లగొండలో ఆర్టీసీ కార్మికుల అర్ధనగ్న ప్రదర్శన

**నల్లగొండ, మార్చి30( వెలుతురు):**

టీజీఎస్ఆర్టీసీ జేఏసీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నల్లగొండ డిపో జేఏసీ ఆధ్వర్యంలో ప్రైవేట్ విద్యుత్ బస్సుల విధానాన్ని వ్యతిరేకిస్తూ ఆర్టీసీ కార్మికులు సోమవారం అర్ధనగ్న ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా గో బ్యాక్ గోబ్యాక్ ఈవీ బస్సులు గో బ్యాక్.. ఆర్టీసీ స్థలాల్లో- ఆర్టీసీ బస్సులే ఉండాలి.. ఆర్టీసీ బస్సులే ఉండాలి- ఆర్టీసీ సిబ్బందే నడపాలి.. ఆర్టీసీ స్థలాల నుండి- ప్రైవేట్ ఈవీ బస్సులు వెళ్లగొట్టాలే అంటూ నినాదాలు చేశారు. ప్రభుత్వమే ఈవీ బస్సులని కొనుగోలు చేసి ఆర్టీసీలకు ఇవ్వాలని, ఆర్టీసీ ఆధ్వర్యంలోనే నడపాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా ప్రైవేట్ ఈవీ బస్సులను తీసుకుని, పూర్తిగా ప్రైవేట్ వారికి అప్పగించి, కొత్త నియామకాలు చేపట్టకుండా పూర్తిగా సంస్థను నిర్వీర్యం చేస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆర్టీసీ కార్మికుల న్యాయమైన డిమాండ్లను, మేనిఫెస్టోలో పెట్టిన అంశాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఆర్టీసీ కార్మికుల పట్ల ప్రభుత్వం, యాజమాన్యం అనుసరిస్తున్న విధానాల పట్ల రాష్ట్ర జేఏసీ సమ్మె నోటీసు ఇచ్చిందని, ఇక ముందు జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించే అన్ని పోరాటాల్లో పాల్గొని విజయవంతం చేసి అన్నింటిని సాధించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జేఏసీ రాష్ట్ర నాయకులు బి.నరేందర్, బాసాని వెంకటయ్య, జిల్లా జేఏసీ నాయకులు ఎన్ఆర్సీ రాజు, టీజే రావు, డిపో జేఏసీ నాయకులు ఏఎల్ స్వామి తదితరులు పాల్గొన్నారు.

# నవనీత కృష్ణాలంకారంలో రాములవారు

**- స్వామిని దర్శించుకుని పులకించిన భక్తులు**

**- ఒంటిమిట్ట కళ్యాణానికి తిరుమల శ్రీవారి లడ్డూ**



**ఒంటిమిట్ట, మార్చి30( వెలుతురు):**

ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగో రోజు సోమవారం ఉదయం నవనీత కృష్ణాలంకారంలో రాములవారు ముగ్ధమనోహరంగా దర్శనమిచ్చారు. ఉదయం 7.30 గంటల నుండి స్వామివారి ఊరేగింపు వైభవంగా జరిగింది. కేరళ డ్రమ్స్, భక్తజన బృందాల చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి ఊరేగింపు కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు.పురాణాల ప్రకారం.. కృష్ణుడు వెన్నదొంగ. రేపల్లెలో బాలకృష్ణుడు యశోదమ్మ ఇంట్లోనే గాక అందరి ఇళ్లలోకి వెళ్లి వెన్న ఆరగించేవారు. ఈ చిన్నికృష్ణుడి లీలలను గుర్తు చేస్తూ రాములవారు వెన్నకుండతో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో శ్రీమతి ప్రశాంతి, సూపరింటెండెంట్ శ్రీ హనుమంతయ్య, టెంపుల్ ఇన్స్పెక్టర్ శ్రీ నవీన్, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఇదిలావుంటే ఏప్రిల్ 1వ తేదీన ఎంతో ప్రతిష్టాత్మకంగా ఒంటిమిట్టలో జరిగే శ్రీ సీతా రాముల కల్యాణానికి విచ్చేసే భక్తులకు అందించేందుకు 85 వేల తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను సిద్ధం చేశారు. తిరుమలలోని శ్రీవారి సేవా సదన్ 1లో శ్రీవారి సేవకుల సహకారంతో లడ్డూల ప్యాకింగ్‌ను టీటీడీ ఒక బృహత్కార్యక్రమంగా నిర్వహించింది. ఈ లడ్డూల ప్యాకింగ్ కార్యక్రమంలో సుమారు 300 మంది శ్రీవారి సేవకులు అపార భక్తి, శ్రద్ధలతో పాల్గొన్నారు. తిరుమల ఎస్టేట్స్ అధికారి,డిప్యూటీ ఈవో వెంకటేశ్వరులు ఆధ్వర్యంలో లడ్డూ ప్యాకింగ్ నిరంతరాయంగా సాగింది. లడ్డూల ప్యాకింగ్, లోడింగ్, రవాణా వంటి అన్ని కార్యక్రమాలను విజయవంతంగా పూర్తి చేశారని అన్నారు.

# మౌనిక హత్య కేసులో దర్యాప్తుముమ్మరం

**- హత్యకు ముందే కత్తులు కొనుగోలు చేసిన రవీంద్ర**

**- డబ్బుల కోసం వేధింపులు తట్టకోలేక హత్య చేసినట్లు వెల్లడి**



**విశాఖపట్టణం, మార్చి30( వెలుతురు):**

విశాఖపట్నంలోని ఎల్.వి.నగర్‌లో దారుణ హత్యకు గురైన యువతి మౌనిక (29) కేసులో పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది. ప్రాథమిక విచారణలో కీలక విషయాలు వెలుగులోకి వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో నిందితుడు చింతాడ రవీంద్రకు డేటింగ్ యాప్‌లో మౌనిక పరిచయమైనట్లు తెలిసింది. ఆమెకు రూ.3.50లక్షల ఇచ్చినట్లు రవీంద్ర తెలిపాడు. డబ్బు కోసం మౌనిక వేధించేదని.. హింస భరించలేకే ఆమెను హతమార్చినట్లు పోలీసులకు చెప్పాడు. గాజువాక ప్రాంతంలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ప్రేమ పేరుతో ఒక యువతిని హత్య చేసిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. గాజువాక 70వ వార్డు పరిధిలోని ఎల్‌బీ నగర్‌లో ఈ ఘటన జరిగింది. ఈ హత్యతో గాజువాక ప్రాంతంలో భయాందోళనలు నెలకొన్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి.. నేవీ ఉద్యోగి అయిన ప్రియుడిని అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల సమాచారం ప్రకారం శ్రీకాకుళం జిల్లా పాలకొండకు చెందిన నేవీ ఉద్యోగి రవీందర్ తన ప్రియురాలిని ఇంటికి పిలిపించి దారుణంగా హత్య చేశాడు. హత్య అనంతరం మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికి.. కొంత భాగాన్ని ఫ్రిజ్‌లో, మరో భాగాన్ని గోనె సంచిలో దాచాడు. ప్రియురాలిని దారుణంగా హత్య చేసిన అనంతరం నిందితుడు స్వయంగా గాజువాక పోలీస్ స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయాడు. దాంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. రవీందర్ ఇంటికి వెళ్లిన పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ దారుణానికి కారణంగా కుటుంబ పరిస్థితులు, వ్యక్తిగత వివాదాలు ఉన్నాయనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిందితుడు రవీందర్ భార్య పుట్టింటికి వెళ్లిన సమయంలో ప్రియురాలిని ఇంటికి పిలిపించుకొని ఈ ఘాతుకానికి పాల్పడ్డాడని పోలీసులు ప్రాథమికంగా తెలిపారు. ప్రస్తుతం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఎల్.వి.నగర్‌లోని ఓ అపార్ట్‌మెంట్‌కు మౌనికను రవీంద్ర పిలిచాడు. అక్కడికి వచ్చిన కాసేపటికే వారిద్దరి మధ్య ఘర్షణ జరిగింది. ఆ తర్వాత ఆమెను రవీంద్ర కిరాతకంగా హతమార్చాడు. హత్యకు ముందే గాజువాకలో కత్తులు కొనుగోలు చేశాడు. మౌనికను చంపిన తర్వాత రక్తపు మరకలు కడిగేశాడు. రక్తపు వాసన రాకుండా ఇంట్లో సెంటు కొట్టాడు. శరీర భాగాలను ముక్కలుగా చేసి ఫ్రిజ్‌లో పెట్టాడు. తల, ఆమె ఫోన్‌ను దారపాలెం తోటల్లో తగులబెట్టాడు. అనంతరం స్నేహితుడికి ఫోన్ చేసి హత్య విషయాన్ని చెప్పాడు. స్నేహితుడు హెచ్చరించడంతో గాజువాక పోలీసులకు రవీంద్ర లొంగిపోయాడు.

# ప్రైవేట్ బస్సుల తనిఖీలు ముమ్మరం

**- 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సుల తనిఖీ**

**- నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు**

**- ప్రయాణికుల భద్రత కోసమే అన్న మంత్రి రాంప్రసాద్**



**అమరావతి, మార్చి30( వెలుతురు):**

ఏపీలో రోడ్డు ప్రమాదాల నివారణెళి ధ్యేయంగా రవాణ శాఖ తనిఖీలను ముమ్మరం చేసింది. నిబంధనలకు విరుద్ధంగా.. ఓవర్ లోడ్‌తో నడుపుతున్న ప్రైవేట్ బస్సులపై కఠిన చర్యలు తీసుకోవాలని రవాణా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి అధికారులను ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న టోల్ ప్లాజాలు, సరిహద్దు చెక్ పోస్టుల వద్ద రవాణా శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఒక్కరోజే రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 976 ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులను తనిఖీ చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేకుండా నడుపుతున్న, నిబంధనలు ఉల్లంఘించిన 193 బస్సులపై కేసులు నమోదు చేసి, భారీగా జరిమానాలు విధించినట్లు అధికారులు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా 16 ప్రధాన పాయింట్లలో ఈ తనిఖీలు నిరంతరాయంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ.. ప్రయాణికుల భద్రత విషయంలో ప్రభుత్వం రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. కొంతమంది బస్సు యజమానులు ఇష్టానుసారంగా వాణిజ్య సరుకులను తరలిస్తూ.. అధిక లోడ్‌తో బస్సులను నడుపుతున్నారని చెప్పారు. భద్రతా నియమాలను ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ విధిగా నిబంధనలను పాటించాలని చెప్పారు. ప్రయాణికుల క్షేమమే తమ ప్రభుత్వ మొదటి ప్రాధాన్యత అని మంత్రి పేర్కొన్నారు.

# అమరావతి ఎప్పుడు ప్రారంభం అవుతుందో తెలుసా

**విజయవాడ, మార్చి30( వెలుతురు):**

ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో నిర్మాణ పనులు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎం చంద్రబాబు నాయుడు అసెంబ్లీ వేదికగా కీలక ప్రకటన చేశారు. అమరావతికి చట్టబద్ధత కల్పించాలని కేంద్రాన్ని కోరుతూ ప్రవేశపెట్టిన తీర్మానంపై చంద్రబాబు మాట్లాడారు. ఈ సందర్భంగా అమరావతిలో చేపట్టిన నిర్మాణాలు ఎప్పటికి పూర్తవుతాయనే దానిపై సీఎ చంద్రబాబు వివరాలు వెల్లడించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా అమరావతి నిర్మాణ పనులను 2025 మే 2వ తేదీన పునఃప్రారంభించినట్లు చంద్రబాబు గుర్తు చేశారు. 2028 ఆగస్ట్ నాటికి నిర్మాణ పనులు పూర్తి చేసి.. ప్రారంభోత్సవానికి మరోసారి ప్రధాని మోదీని ఆహ్వానిస్తామని స్పష్టం చేశారు. ఈ క్రమంలోనే అమరావతిలోని ట్రంక్ రోడ్లను మే 27, 2027 నాటి పూర్తిచేస్తామని చంద్రబాబు తెలిపారు.అమరావతి లేఅవుట్లను మే 27, 2028 నాటికి, ఏపీ అసెంబ్లీ నిర్మాణాన్ని మే 28, 2028 నాటికల్లా పూర్తిచేస్తామని చంద్రబాబు వివరించారు. అలాగే ఏపీ హైకోర్టు నిర్మాణాన్ని జూన్ 20, 2028 నాటికి.. అమరావతి ఐకానిక్ టవర్ల నిర్మాణాన్ని ఆగస్ట్ 4, 2028 నాటికి పూర్తిచేసి.. ప్రధాని మోదీని ప్రారంభోత్సానికి ఆహ్వానిస్తామని సీఎం చంద్రబాబు నాయుడు ప్రకటించారు. అమరావతి ప్రజా రాజధాని అని చెప్పిన చంద్రబాబు.. భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బంది ఉండకూడదనే ఉద్దేశంతోనే చట్టబద్ధత కల్పిస్తున్నట్లు తెలిపారు.తొమ్మిది నెలల కాలంలోనే అమరావతిలో సచివాలయం, అసెంబ్లీ భవనాల నిర్మాణాలను పూర్తి చేశామని చంద్రబాబు వివరించారు. అమరావతిలో ప్రస్తుతం 56 వేలకోట్ల రూపాయల విలువైన పనులు జరుగుతున్నాయని.. 2028 నాటికి పనులు పూర్తి చేస్తామని తెలిపారు. అమరావతిలో హింసను సృష్టించాలని ప్రయత్నించేవారికి.. అదే చివరి రోజు అవుతుందంటూ చంద్రబాబు వార్నింగ్ ఇచ్చారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ఒక్కటే రాజధాని ఉంటుందని.. అది అమరావతి మాత్రమేనని చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతిని ఎవరూ టచ్ చేయలేరంటూ చంద్రబాబు స్పష్టం చేశారు

# ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లు కట్టిచ్చాం

**- విజయవాడలో టిడ్కో ఇళ్ల పంపిణీలో బోండా ఉమ**



**విజయవాడ, మార్చి30( వెలుతురు):**

టిడ్కో ఇళ్లలో ఉన్న 10 శాతం వసతులు కూడా సెంట్‌లో కట్టిన ఇళ్లలో లేవని ఎమ్మెల్యే బొండా ఉమ అన్నారు. సోమవారం విజయవాడ సమీపంలోని జక్కంపూడిలో టిడ్కో ఇళ్ల ప్రారంభ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బోండా ఉమ, గద్దె రామ్మోహన్, కలెక్టర్ లక్ష్మీశ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ.. ఈ ఇళ్ల నిర్మాణం కోసం గత 5 ఏళ్లలో ఎన్నో బాధలు, కష్టాలు పడ్డారని తెలిపారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఇచ్చిన మాట ప్రకారం ఇళ్లను ఇచ్చామన్నారు. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లు రద్దు చేసుకోమని బలవంతం చేశారని.. కానీ చాలా మంది ప్రజలు వారి అబద్ధపు మాటలు నమ్మకుండా నిలబడ్డారని ఎమ్మెల్యే బొండా ఉమ తెలిపారు. పార్టీలకు అతీతంగా టిడ్కో ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. 2019 - 24 మధ్య జగన్ హయాంలో రాష్ట్రంలో విధ్వంసం జరిగిందని విమర్శించారు. జగన్ వైరస్ వల్ల అన్ని వ్యవస్థలు కుంగిపోయాయని వ్యాఖ్యలు చేశారు. వ్యవస్థలను గాడిలో పెట్టడానికి ఇంత కాలం పట్టిందని ఎమ్మెల్యే తెలిపారు. సొంత ఇంటిని సాకారం చేస్తున్న ప్రభుత్వానికి కలెక్టర్ లక్ష్మీశా కృతజ్ఞతలు తెలియజేశారు. రోడ్లు, డ్రైనేజ్, నీటి సదుపాయం సహా అన్ని వసతులు కల్పించామని చెప్పారు. టిడ్కో ఇళ్లలో విడతల వారీగా ప్రజలు గృహ ప్రవేశాలు చేస్తున్నారని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.

# జీతాల కోసం ఆశావర్కర్ల ధర్నా

**- జాతీయరహదారిపై బైఠాయింపు**

**- ఎక్కడిక్కడే నిలిచి పోయిన వాహనాలు**

**మహబూబ్‌నగర్, మార్చి30( వెలుతురు):**

సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆశావర్కర్లు జడ్చర్ల సమీపంలోని కావరమ్మపేట జాతీయ రహదారిపై ఆందోళన చేపట్టారు. ఆరు నెలలుగా వేతనాలు అందడం లేదంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తూ వందలాది మంది మహిళలు రోడ్డుపై బైఠాయించారు.ధర్నా వల్ల హైదరాబాద్ ,కర్నూలు జాతీయ రహదారిపై రాకపోకలు పూర్తిగా ఎక్కడికక్కడే నిలిచి పోయాయి . జీతాలు ఇవ్వాలని, సీఎం డౌన్ డౌన్ అంటూ ఆశా వర్కర్లు నినాదాలు చేశారు. జీతాలు లేక కుటుంబాలు గడవడమే కష్టంగా మారిందని, పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆశా వర్కర్లు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం తమ కష్టాన్ని గుర్తించడం లేదని, వెట్టి చాకిరీ చేయించుకుంటూ వేతనాలు నిలిపివేయడం దారుణమని అన్నారు. ధర్నాను విరమించాలని పోలీసులు బలగాలు కోరగా ససేమిరా అనడంతో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడ్డాయి. ఆశావర్కర్లను అక్కడి నుంచి తొలగించేందుకు నానా అవస్థలు పడ్డారు. స్థానిక ఎమ్మెల్యే వెంటనే ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని ఆశా వర్కర్లు డిమాండ్ చేశారు. అధికారులు రాతపూర్వక హామీ ఇచ్చే వరకు పోరాటం ఆగదని హెచ్చరించారు.

# 30వేలు లంచం డిమాండ్ చేసిన ఎస్ఐ

**- ఎసిబి అధికారులు దాడి చేసి పట్టివేత**

**నాగర్‌కర్నూల్, మార్చి30( వెలుతురు):**

తిమ్మాజిపేట మండల ఎస్సై ఏసీబీకి పట్టుబడ్డారు. ఒక కేసుకు సంబంధించి ఒక వ్యక్తి నుంచి రూ. 30 వేలు లంచం ఎస్సై డిమాండ్ చేశాడు. ఈ మేరకు సోమవారం 20 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా మహబూబ్ నగర్ ఏసీబీ డీఎస్పీ బాలకృష్ణ ఆధ్వర్యంలో అదుపులోకి తీసుకున్నారు. ఇందుకు సంబంధించి ఏసీబీ డీఎస్పీ వివరాలు వెల్లడించారు. ఇసుక సరఫరా చేస్తున్న ఓ వ్యక్తికి సంబంధించిన ట్రాక్టర్, జేసీబీని పట్టుకొని ఈనెల 5న ఎస్సై హరి ప్రసాద్ రెడ్డి కేసు నమోదు చేసి వివరాలను నాగర్ కర్నూల్ జిల్లా మైనింగ్ అధికారులకు తెలిపారు. మైనింగ్ అధికారులు ఆ వాహనాలకు రూ. 60 వేలు ఫైన్ వేశారు. ఈ డబ్బులను ఈనెల 7వ తేదీన చెల్లించి వాహనాల రిలీజ్ కోసం పత్రాలను తెచ్చి ఎస్సైకి అందజేశాడు. అయితే ఎస్సై రూ. 30 వేలు ఇస్తేనే వాహనాలను విడుదల చేస్తామని డిమాండ్ చేశారు. మైనింగ్ ఫైన్ కట్టడంతో పాటు, మళ్లీ రూ. 30 వేలు కట్టవలసి రావడంతో వాయిస్ రికార్డింగ్‌లు, రూ. 20వేలు చెల్లించిన అంశాలతో బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. అన్ని ఆధారాలతో ఏసీబీ అధికారులు సోమవారం పోలీస్ స్టేషన్‌కు చేరుకొని ఎస్సైని అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు డీఎస్పీ బాలకృష్ణ వెల్లడించారు.

Edited, Printed, Published and Owner by BAKKA YADAIAH, Published & Printed at SRI SHANTHI PUBLICATIONS H.No. 7-2-31/221/2, S.V. Colony, Bairamalaguda, Saroornagar, Mdl.R.R. DIST, Telangana-79. EDITORG BAKKA YADAIAH, R.N.I. TEL TEL /2019 / 78609. Cell:91773 87328, Email: velthurunewspaper@gmail.com